# మూసీ

సాహిత్య
సాంస్కృతిక
చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

జనవరి

2026





వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి

# మూసీ

సాహిత్య
సాంస్కృతిక
చారిత్రక

చదివి దాచుకోదగిన పత్రిక తెలుగు మాసపత్రిక

సంపుటి : 29 సంచిక : 3
జనవరి - 2026
'విశ్వావసు' పుష్య, మాఘ మాసాలు

సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA
సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
B. MANOHARI
Type Setting at :
Kavyasree Graphics
Ph: 934 797 1177
Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)
చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.
వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక, 2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013 .. ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com
website : musimagazine.org

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796

## ఈ సంచికలో ...

తెలుగులో మాహాత్మ్య కావ్యాలు - సామాజికత ... ఆచార్య పి.సి. వెంకటేశ్వర్లు - 7
పర్యావరణ సంక్షోభాన్ని ప్రతిఘటిస్తున్న నాటికలు - 'ఊడలు' 'రెండు చేతులు' ... డా. వై. సుభాషిణి, కె. అశ్విని -13
తెలుగు సాహిత్య పునరుజ్జీవన ప్రదాత - సి.పి. బ్రౌన్ ... డా. బాణాల భుజంగరెడ్డి - 23
తెలుగు సాహిత్య పరిశోధన - విషయ విశ్లేషణ పద్ధతి ... ఆచార్య గంపా వెంకటరామయ్య - 29
అమలిన భక్తి తత్త్వపు హేల - భగవత్ కీర్తన భజన మాల ... సుప్పని సత్యనారాయణ -37
జనగామ జిల్లా బహుజన కవిత్వం ... అలంశెట్టి పర్శరాములు - 40
గోల్కొండ కవుల సంచిక : తెలంగాణ తొలి సాహితీ స్వరం - పాలమూరు కవుల ప్రతిధ్వని ... డా. స్వప్న భువకర్ - 43
స్ఫూర్తి ప్రదాత - వివేకానందుడు ... డా. టంగుటూరి సైదులు - 47
వ్యాకరణ శాస్త్ర సంబంధ ఔచిత్య రీతులు : ఆముక్తమాల్యద ... డా. రాంభట్ల పార్వతీశ్వర శర్మ - 49

### కవిత్వం

నూతన సంవత్సరానికి స్వాగతం .. డా. రాధశ్రీ - 5; తుకారాం అభంగం - డా. మంత్రి శ్రీనివాస్-6; శ్రమ సౌందర్యం ... డా. ఆవుల రేణుక - 12; ఆదిత్య హృదయము ... డా. ఆచార్య ఫణీంద్ర - 21; తరగతిలో బల్ల ... పి. సువర్ణ - 27; సప్తపది ... డా. గన్నోజు శ్రీనివాసాచారి - 28; నది ... బి.ఎల్.ఎన్. కొల్లి - 60; శూన్యయాత్ర ... డా. ఎన్. గోపి - 62.

### సమీక్ష

శ్రమ వీరుల రహదారి, కిలారి ... వద్దిలేటి సోమశేఖర్ - 55; తెలంగాణ అస్తిత్వాన్ని చాటిన 'తెలంగాణ పద సాహిత్యం - సమాలోచన' - డా. మంత్రి శ్రీనివాస్ - 56

ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.

*Printed, Published and Owned by :*
**B. MANOHARI,** 2-2-1109/BK-LIG-10, Bathukamma Kunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad -13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 3  హైదరాబాద్ జనవరి : 2026

## సంపాదకీయం







వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి

స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**





# క్రాంతి

క్రాంతమంటే మార్పు అని అర్థం. భూమి నుండి చూస్తే సూర్యుడు కనిపించే విధానంలోని మార్పు కూడా క్రాంతి లేదా సంక్రాంతి. ఈ క్రాంతి సరియైన విధంగా (ఉత్తరంవైపు) ఉంటే అది పండుగ అవుతుంది. అదే సూర్యుడు మరోవైపు (దక్షిణం వైపు) క్రాంతమవుతుంటే పండుగల వంటివి చేసుకోరు. అంటే క్రాంతి కూడా ఒక శుభసూచకం కావాలి. మానవాళికి కల్యాణ కారకం కావాలి. ప్రకృతికి, సమస్త జీవరాశికి హితకారకం కావాలి.

జీవన గతిలోనూ క్రాంతి ఉంటుంది. పుట్టుక నుండి మరణం వరకు శారీరకమైన మార్పులు ఉంటాయి. ప్రకృతిలోనూ వసంతం నుండి శిశిరం వరకు మార్పులుంటాయి. వ్యవసాయ, వ్యాపార రంగాలలోనూ మార్పులు అనేకం ఉంటాయి. మంచి నుండి చెడువైపుకు అయినా, చెడు నుండి మంచి వైపుకు అయినా సాధారణ పరిభాషలో క్రాంతి అని మాత్రమే ఉపయోగిస్తాం. ఈ విషయంపైన అవగాహనతో ప్రవర్తించాల్సిన అవసరం ఉంది. క్రాంతి పేరుతో శిశిరం నుండి వసంతం వైపుకు రావడం ప్రకృతి. క్రాంతి పేరుతో వసంతం నుండి శిశిరం వైపుకు వెళ్ళే విధానం వికృతి. దక్షినాయనం, ఉత్తరాయణం రెండూ క్రాంతి కారకాలే అయినా లోకానికి ఉత్తరాయణం ఆనంద ప్రదమవుతుంది. ధర్మశాస్త్రం ప్రకారం కూడా ఉత్తరాయణంలోనే అనేక శుభ కార్యక్రమాలు నిర్వర్తించబడుతాయి. దక్షినాయనమంతా వ్యక్తి తనను తాను బలోపేతం చేసుకోవడం, శక్తిని పెంచుకోవడంలో నిమగ్నం అవుతూ ఉంటాడు. అవే పూజలు, వ్రతాలు, నోములు. అన్నీ ఎలాగూ తప్పవు కానీ, ఎక్కడ శక్తిని పెంచుకునేందుకు కృషి చేయాలో, ఎక్కడ ఆనందంగా గడపాలో తెలిసి ప్రవర్తించాలి. సమయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా తమ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే ఇబ్బందులు తప్పకపోవచ్చు.

క్రాంతి సమాజ, ప్రకృతి, పశు పక్ష్యాది హితంగా ఉండాలి. ఈ మూడింటిలో దేనికి ఇబ్బంది కలిగినా అది సరియైన క్రాంతి కాదు. వ్యక్తి తన స్వార్థం కోసం తనను తాను తాత్కాలికంగా ఉన్నతంగా చూసుకోవడం కోసం చుట్టూ ఉన్న ప్రకృతి సంపదను నాశనం చేయడం, దానిని మార్పు అనడం పరిపాటిగా మారింది. జీవరాశుల సమతుల్యతను దెబ్బ తీయడం కూడా క్రాంతి కాదు. అన్నింటితోనూ సాధ్యమైనంత కలిసి ఉండడం, జీవకారుణ్యాన్ని చూపడం, విశ్వశ్రేయాన్ని కోరడమే అసలైన క్రాంతి. సంక్రాంతి సూచించే జీవన విధానమూ ఇదే. తన సంతోషం కోసం ఇతరులను నాశనం చేయడమే ప్రస్తుతం లక్ష్యంగా కొనసాగుతుంది.

ఒక రోజులో పగలు, రాత్రిని ప్రకృతి మనకు సూచిస్తుంది. రాత్రి నుండి పగలువైపు రావడం ఎంత ఆనందదాయకమో, పగటి నుండి రాత్రికి వెళ్ళడంలో వచ్చే ఇబ్బందులేమిటో ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూనే ఉంది. నిర్ణయించుకునే జీవి మానవుడే.. వెలుగువైపు ప్రయాణమా, చీకటివైపా. ఆనందమా, విషాదమా? ప్రకృతి, సమాజ హితమా, అహితమా?

రాజకీయంలోనూ, సమాజంలోనూ బుద్ధిజీవులైన వారు అనేక రకాల మార్పులు కోరుకుంటారు. ఆ మార్పు ఎటువైపు అనేది మాత్రం మనలోని విజ్ఞతను బట్టి ఉంటుంది. క్రాంతమెప్పుడూ సమాజ, ప్రకృతి హితమైనదై మాత్రమే ఉండాలి. వ్యక్తి స్వార్థాదులవైపు కనిపించగానే దానికి దూరం కావాల్సిన అవసరం ఉంది. క్రాంతమిది అని ఏవో మాటలు వినిపించినా ఆలోచనాపరులు మళ్ళీ మళ్ళీ చూసుకోవాలి. దోషానికి దూరంగా మెలగాలి. హితానికి దగ్గరగా మెలగాలి. ఆ విధమైన ఆలోచనలు కలిగినవారు మాత్రమే సమాజానికి దిక్సూచి కాగలరు. క్రాంతదర్శనం చేయగలరు.

# నూతన సంవత్సరానికి స్వాగతం




స్మితపూర్వభాషి రాముం
డితిహాసముగా నిలుపుత నీప్సితమిడి ప్రా
గితరేతరముల నొల్లని
ఇతవరియగు "రెండువేల ఇరువది యారు"న్ !!




అంపాచారముగా నను
కంపాపరుడై యభవుడు కామన లిడుచున్
సొంపుగ తీరిచి దిద్దుత
నింపారెడి "రెండువేల ఇరువది యారు"న్ !!

తగదీరగ శ్లాఘించెద
నుగమును బెంపొందజేయు నుత్సాహముతో
నగణిత శోభామయముగ
నిగురించెడి" రెండువేల ఇరువది యారు"న్ !!




అనవరతము శుభముల నిడు
వనజాక్షుని కృపగ వచ్చు వత్సర మనుచున్
మనమున దలచుచు గొలిచెద
నెనయికగల" రెండువేల ఇరువది యారు"న్ !!




పెంపొందజేయ కరుణను
నింపగ లోకమ్ములోన నిజధర్మంబున్
చంపకములతో గొలిచెద
నింపొసగెడి" రెండు వేల ఇరువది యారు"న్ !!

పద్యమౌళి, పద్యభాషి డాక్టర్ రాధశ్రీ

# మూసీ 'వ్యాస' రచయితలకు సూచనలు

మీ వ్యాసాన్ని వర్డ్ (యునికోడ్), పేజిమేకర్ (అను.7)లో టైప్ చేసి editormusi@gmail.com కు మెయిల్ చేయగలరు.

**వ్యాససంగ్రహం - (Abstract) : (200 పదాలకు మించకుండా)**

1. వ్యాససంగ్రహం : 1) రెండు-మూడు వాక్యాల పరిచయం, 2) వ్యాసరచన ముఖ్యోద్దేశం, 3) పరిశోధన ఊహా ప్రణాళిక, 4) అనుసరించిన పరిశోధన పద్ధతులు, 5) ఆశించే ఫలితాలతో కూడిన ముగింపు
2. Keywords : (కనీసం 5 పదాలు) (ఉదా: భాష, సాహిత్యం, ప్రకియలు, శతకం, నీతులు, విశ్లేషణ, అనువాదం, కవిపేరు, పాత్రచిత్రణ.)

**పూర్తి పరిశోధనవ్యాసం (పేజిమేకర్ ఎ4 సైజ్ లో 4-5 పేజీలకు తగ్గకుండా)**

1. **ఉపోద్ఘాతం :** ఒకటి లేదా రెండు పేరాలలో పరిశోధన వ్యాస ముఖ్య ఉద్దేశాన్ని ఉపోద్ఘాతంగా పేర్కొనాలి. కవి/రచయిత పరిచయం, పరిశోధనాంశానికి సంబంధించిన పరిచయవాక్యాలను వ్రాయవచ్చును. పూర్వపరిశోధనలకు సంబంధించిన అంశాలను సంక్షిప్తంగా చర్చించవచ్చును.
2. **విషయం :** పరిశోధనవిలువలుండాలి. సొంతంగా రాసినదై ఉండాలి. యధాతథంగా పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి గ్రహించకూడదు. కొన్ని విభాగాలుగా విభజించుకుని, ఆయా విభాగాలకు అనుగుణమైన ఉపశీర్షికలు (సైడ్ హెడ్డింగ్స్) పొందుపరచాలి. ఎంచుకున్న పరిశోధన సామగ్రి (పుస్తకాల) నుండి పద్యం, కవిత, గేయం, కీర్తన, కథ, నవల, నాటకభాగాలు మొదలైన ఉల్లేఖాలను (references) అనుకరణ చిహ్నాల (" ") తో తప్పక ఉటంకించాలి. ఈ ఉటంకింపుల ప్రక్కనే బ్రాకెట్లో తప్పకుండా వాటికి తగిన సూచికలను సంక్షిప్తాక్షరాలలో పొందుపరచాలి. (ఉదా. ఆం.మ. భార. ఆది, ఆశ్వా. 5ప. 235) పేర్కొన్న ప్రతి పద్యం, కవిత, గేయ, వచన భాగాలను చక్కగా, పరిశోధన ధ్యేయం దృష్ట్యా విశ్లేషించాలి.
3. **ముగింపు :** పరిశోధనలో వెలువడిన ఫలితాలను విశ్లేషణాత్మకంగా 'ముగింపు' అన్న శీర్షిక క్రింద పేర్కొనాలి. కవి ఆత్మీయత, శైలి, ఆకర్షణీయాంశాలు, వెలువడిన క్రొత్త విషయాలు, రచన సామాజిక ప్రయోజనం, భాషాసాహిత్యాలకు పరిపుష్టిని చేకూర్చే కావ్య, వ్యాకరణ, అలంకారాది అంశాలు, ప్రత్యేకతలు మొదలైనవి రెండు-మూడు పేరాలుగా ముగింపులో పేర్కొనవచ్చు.
4. **ఉపయుక్త గ్రంథసూచి :** ముగింపు తరువాత ఆధారగ్రంథాలన్నింటికీ ఉపయుక్తగ్రంథసూచిని తప్పక పొందుపరచాలి. (రచయితపేరు, ఇంటిపేరు. గ్రంథం పేరు, ప్రచురణ సంవత్సరం, ప్రచురణ స్థలం, ప్రచురణసంస్థ) సంకలనగ్రంథాలకు సంపాదకుడి పేరు పేర్కొనాలి. పత్రికావ్యాసాలు, బ్లాగ్, వెబ్సైట్లకు పూర్తివివరాలు తెలపాలి. ఉదా :

1. కమలాకర శర్మ, సాగి. సంపా. **'కదంబం'** (తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు). 2014. హైదరాబాద్ : మూసీ ప్రచురణలు.
2. రఘునాథ శర్మ, శలాక. '**భారత ధ్వని దర్శనము**'. 2000. అనంతపురం : ఆనందవల్లీ గ్రంథమాల.

(సూచనలు పాటించని / పరిశోధనవిలువలు లేని/ పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి యధాతథంగా రాసే వ్యాసాలు తిరస్కరించబడతాయి)

# తుకారాం అభంగం

చిత్తమా స్థిర చిత్తమవ్వవే
చిగురించు కోరికల దాస్యమాపవే
పరమానందము పీఠమెక్కి నిలబడె
పదములతో ప్రస్తుతించ కదలవే

అదే చంద్రభాగ అదే పండరీపురి
అదే భక్త సందోహము అదే ఆనందము
చిత్తమా నీ చిలిపి పనులు మానవే
చిగురించు కోరికల దాస్యమాపవే

జయ జయధ్వాన బృంద మేళాలు
ఏకతార నాదాలు ప్రభుకీర్తి గానాలు
చిత్తమా పరుగున ఆడి పాడవే
పరమాత్మ విఠలు కూడి చూడవే

తుకా పలుకు సత్యము మరిగి చూడవే
హరినామ జపము మహదానందమే
చిత్తమా శ్రీధరుని చేతు బట్టవే
చిగురించు కోరికల దాస్యమాపవే




అనువాదం
డా॥ మంత్రి శ్రీనివాస్
ఫోన్ : 83283 33720

# తెలుగులో మాహాత్మ్య కావ్యాలు – సామాజికత

✍ **ఆచార్య పి.సి. వెంకటేశ్వర్లు,** సంచాలకులు, ప్రాచ్య పరిశోధనా సంస్థ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి. ఫోన్ :

తెలుగు సాహిత్యంలో అనేక రకరకాలైన కావ్య ప్రయోగాలు జరిగాయి. విలాసకావ్యాలు, పరిణయ కావ్యాలు, నాయకాభ్యుదయ కావ్యాలు, మాహాత్మ్యకావ్యాలు ఇవన్నీ ఒక్కొక్క విధానం ప్రకారం రాయబడిన ప్రాచీన కావ్యాలు. పాండురంగ మాహాత్మ్యం, శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యం అనే రెండు కావ్యాల్లోని సామాజికతను గురించి అధ్యయనం చేయడం ఈ వ్యాసోద్దేశం.

**పాండురంగ మాహాత్మ్యం** ఐదు ఆశ్వాసాల కావ్యం. 1302 గద్య పద్యాలతో, 9 ముఖ్య కథలతో సాగిన ఈ గ్రంథం తెనాలి రామకృష్ణ కవి విరచితం. శ్రీకాళహస్తి మాహాత్మ్యం నాలుగు ఆశ్వాసాల్లో, 755 గద్య పద్యాలలో రాయబడిన ధూర్జటి కావ్యం. ఈ రెండు కావ్యాలు క్షేత్ర మాహాత్మ్యాలను చెప్పిన ఈ కావ్యాలుగా చెప్పబడుతున్నప్పటికీ, ఆయా క్షేత్రాలను, దైవాలను వర్ణించే క్రమంలో సందర్భోచితంగా వచ్చిన ఉపాఖ్యానాలు, ఉపకథల్లో సమకాలీనమైన సామాజికత స్పష్టంగా కనబడుతుంది. ఈ రెండు మాహాత్మ్య గ్రంథాల్లోని సామాజికతను, ఆయా కవులు చూపించిన ప్రజల నివాస ప్రదేశాలు, సామాజిక వ్యవస్థ, కట్టుకున్న బట్టలు, ఆహారపు అలవాట్లు ఆర్థిక లావాదేవీలు నాటి రాచరిక వ్యవస్థ, వారు ఆచరించిన ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, జీవన సరళి మొదలైన వాటి ఆధారంగా పరిశీలిస్తే నాటి సమాజ దృశ్యం ఆవిష్కరించబడుతుంది.

**శ్రీకాళహస్తి మాహాత్మ్యం– సామాజికత :**

ఈ గ్రంథంలో ఒకే సామాజిక వ్యవస్థలోని భిన్న రూపాలు కనిపిస్తాయి. భిన్న అస్తిత్వంగల జనసమూహాలు దర్శనమిస్తాయి. రాచరికం, పట్టణ పరిపాలన, పట్టణ జీవనం, ఆటవిక జీవనం వంటి వాటిల్లో భిన్న రకాలైన స్థితిగతులు కనిపిస్తాయి.

శ్రీకాళహస్తి మాహాత్మ్యంలో మధురా నగరం, కాళహస్తి పట్టణం, ఉడుమూరు పల్లె మనకి నివాసయోగ్యాలైన ప్రాంతాలుగా కనపడతాయి. నత్కీరుని కథలో రెండు పద్యాల్లో మధురానగరం రూపురేఖలు మన ముందు ఆవిష్కరింప చేస్తాడు ధూర్జటి. అలాగే వేశ్యాతనయ కథల్లో మూడు పద్యాల్లో అదే మధురా నగరాన్ని చూపిస్తాడు. వైఘై నదీ తీరంలో ఉన్న ఆ మధురా నగరం లోతైన అగడ్తతో, ఎత్తైన కోట బురుజులతో, అందమైన మేడలతో, శోభను ఇనుమడింప చేసేదిగా వుందని చెబుతాడు. ఆరోజు ద్రావిడ పండితులకు పూజనీయమైన నగరంగా ఉన్నటువంటి మధుర కేవలం సాహిత్య కేంద్రంగానే కాకుండా, సంపన్నులైన గృహస్తులు ఎలాంటి వైభవంతో ఉండేవాళ్లో కవి వర్ణన తెలియజేస్తుంది. ఇక కాళహస్తి పట్టణం విషయానికొస్తే స్వర్ణముఖి నదీ తీరంలో ఇది కనిపిస్తుంది. ఈ పట్టణాన్ని పది పద్యాల్లో ధూర్జటి కావ్యం ఆరంభంలోనే వర్ణిస్తాడు. రత్నపుగోడలు, ఆకాశాన్నంటే హర్మ్యాలు కొంత అతిశయోక్తిగా అనిపించినా, ఆనాటి పట్టణంలో సంపదల వైభవాన్ని తెలిపే విధంగా ఆ గృహాలు కనిపిస్తున్నాయని, ఆ వనాలు, తోటలు ఆ పట్టణానికి అందాన్ని రెట్టింపు చేస్తున్నాయని చెప్పడం వాస్తవమే. ఇక మూడవది ఉడుమూరు అనే పల్లెటూరు. అది పొత్తపినాడులోని ఉన్న ఒక బోయపల్లె. కిరాతులు ఎక్కువమంది ఉండే ప్రాంతం. కవి ఆ గ్రామంలో లభించే సంపద ఏమిటో వర్ణించాడు. ఈ మూడు అంశాలను పరిశీలించిన తర్వాత ఆనాటి సమాజంలో నగరాలు, పట్టణాలు, గ్రామాలు ఏవైనా నీటి వసతి సమృద్ధిగా




ఉన్న ప్రాంతం లోనే వెలసిల్లాయని స్పష్టంగా చెప్పవచ్చు. రెండు నదులు ఒడ్డున ఉన్న నగరం, పట్టణాలను చూపిస్తూ, దూరంగా ఉన్న పల్లెటూరు అన్ని రకాలైన వసతులకు ఆలవాలమైన కేంద్రమని, కాబట్టి అక్కడికి వస్తే అన్ని వసతులు ఉంటాయని తిన్నని చేత శివుడికి చెప్పడంలోనే ఆనాటి గ్రామాలు ఎంత స్వయం సమృద్ధిగా ఉన్నాయో తెలియజేస్తాడు.

ధూర్జటి రాసిన కావ్యం నాగరిక సమాజం కంటే కూడా జానపద సమాజానికి లేదా ఆటవిక సమాజానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చింది. ఆటవికులు ఆరోజు తినే ఆహారాలను బ్రాహ్మణుడైన ధూర్జటి ఎంతో ఓపిగ్గా గ్రంథస్థం చేశాడు. పంది, దుప్పి, లేడి, రకరకాల పిట్టలు వంటి వాటి మాంసాలను భుజించే తీరు చెప్పాడు. అలాగే మాంస పదార్థాలను కరకుట్లుగా చేసుకుని ఆటవికులు తింటారని చెప్పి, వాటిని తిన్నని చేత శివునికి నైవేద్యంగా పెట్టించాడు. బోయలు కేవలం మాంసాహారులే కాదు. నివ్వరిప్రాలు, ఒడిపిళ్లు, వెదురు ప్రాలు వంటి

బియ్యాలను కూడా వాళ్ళు తినే వాళ్ళని చెబుతాడు. సవరపు మృగాల పాలను తాగుతారని, పుట్టతేనె, పుట్టజున్ను వంటి వాటిని ఇష్టంగా తింటారని, నేరేడు, నెలయేటి, కొండమామిడి, దొండపండ్లను కూడా ఇష్టంగా తింటారని చెప్పడం ఆనాటి ఆటవికుల ఆహారాన్ని రికార్డు చేయడమే.

ధూర్జటి కాలానికి వ్యవసాయమే ప్రధాన వృత్తి. ఆటవికులు వేటాడి జీవించేవారు. వ్యవసాయదార్లు తమ పంటలను పందుల నుంచి రక్షించుకోవడం కోసం చామరఖండాలు, పోగుతాళ్లు వంటి వాటిని ఉపయోగించేవారు. అలాగే కొన్ని పక్షుల నుంచి సజ్జ, చోళ్ళు వంటి మెట పైరులను రక్షించుకోవడం కోసం ఒడిసెలతో పిట్టలను తరిమేవారు. మధురలో వచ్చిన కరువు గురించి వర్ణించడాన్ని బట్టి ఆ రోజుల్లో కరువులు కూడా ఎక్కువగానే ఉన్నాయని తెలుస్తుంది. అయితే పంటలు పండకుండా తెగుళ్లు పాలైనప్పుడు ప్రజలు అల్లిబియ్యం, వెదురు బియ్యం, ఈతగుంజు మొదలైన వాటిని తిని ప్రాణం నిలుపుకునే వాళ్ళు. ఆటవికులైతే తెరవేట, డేగవేట, ముంగివేట, సివంగివేట, ఎద్దువేట వంటి వేటల్లో స్త్రీలు, పురుషులు పాల్గొని జీవనం సాగించే వాళ్ళు. ధూర్జటి రకరకాల వేటలను వర్ణించే క్రమంలో కాళహస్తి పరిసరాల్లో ఉండే చెంచులను పరిశీలించారు. వారి వేటకు వెళ్లేముందు చేసే తాగి తూలుతూ చేసే చేష్టలను కళ్లముందుంచాడు.

**సీ॥ మాటలాడదలంచి మరచిపోయెడు వారు**
**నడవబోవుచు దొట్రుపడెడు వారు**
**నూరకుండెదమని యుండనోపనివారు**
**లేచెదమని లేవలేని వారు**
**పనిలేని పని బట్టబయలు దిట్టెడివారు**
**బాడనేరకయును బాడువారు**
**నెదురైన వారిని నెల్ల మ్రొక్కెడివారు**
**వ్రీడావిహీనులై యాడువారు**
**తే॥ జాల ద్రావియు మగుడ జేసాచువారు**
**దొడరి యువదంశభాండము ల్దొడుకువారు**
**నైరి మృగయాదిదైవత యాత్రయందు**
**బానములు జేసి శబరదంపతులు రతుల**

శ్రీకాళహస్తి మాహాత్మ్యంలో ప్రసవాన్ని గురించి లోతైన సమాచారం లభిస్తుంది. జానపదాల్లో, ఆటవిక సమాజాల్లో ప్రసవం మంత్రసాని ద్వారానే జరుగుతుంది. భిల్లు స్త్రీలు బాలెంతకు కాయం సిద్ధం చేయడం, స్నానానికి వేడినీళ్లు కాయడం, తలకు నూనె పెట్టడం, తాంబూలం ఇవ్వడం, మెడలో పూసలు ధరింపజేయడం, కళ్ళకు కాటుక పెట్టడం, పలుచటి జిడ్డుగా ఉండే వస్త్రాలను ధరింప చేయడం వంటివి నాటి సమాజంలో కాన్పుకు ముందు జాగ్రత్తలు. బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత బొడ్డు కోయడం, స్నానం చేయించడం, చిట్టాముదం పెట్టడం, పిల్లలకు నలుగు పిండితో స్నానం చేయించడం వంటివి ధూర్జటి గ్రంథస్థం చేసిన సామాజిక అంశాలు.

శ్రీకాళహస్తి మాహాత్మ్యంలోని కాట్రేని జాతర మంగళవారం జరుగుతుంది. ఇప్పటికీ ఆ సంప్రదాయాన్ని అనేక జాతరల్లో జానపదులు కొనసాగిస్తున్నారు. జాతర సమయంలో గునుగు బియ్యాన్ని, చమరీమృగాల పాలను కలిపి పాయసాన్ని సిద్ధం చేయడం, వెదురుబియ్యాన్ని పిండిగా కొట్టి కొట్రబోసి కుడుములు తయారు చేయడాన్ని ధూర్జటి స్పష్టంగా వివరిస్తాడు. అనేక రకాల మాంసాలను కూడా సిద్ధం చేసి, వాటిని గంపల్లో పెట్టుకొని, కావెళ్లతో తీసుకెళ్లి కాట్రేనికి నివేదించేవారు. ఇప్పటికీ జాతరల్లో ఈ దృశ్యాలు కనిపిస్తాయి.

అనేకమంది కవులు కావ్యాల్లో వర్ణించిన సమాజంలో మూస విధానం కనబడుతుంది. చాలా పాత్రలు చాలా బుద్ధిగా, తెలివైనవిగా, ఆదర్శవంతమైనవిగా కనిపిస్తాయి. కానీ మాహాత్మ్య కావ్యాల్లో సమాజంలో పరిస్థితులను ఎదిరించేవిగా, కట్టుబాట్లకు లొంగనివిగా, కట్టుబాట్లను ఏదో ఒక రూపంలో అతిక్రమించేవిగా కొన్ని పాత్రలు కనపడతాయి.

శ్రీకాళహస్తి మాహాత్మ్యంలో కనిపించే యాదవరాజు, తిన్నడు, నత్కీరుడు, చోరులవంటి వారు ఆనాటి సమాజంలో ఉన్న వివిధ రకాల స్థాయిలకు ప్రతినిధులు. ఆనాటి రాచరిక వ్యవస్థకు ప్రతినిధిగా యాదవరాజు వీరనరసింహ రాయలు కనిపిస్తాడు. ఈయన తన దాసి సమయానికి రాలేదని, భోజనం వడ్డించలేదనే చిన్న కారణంతో ఆరోజు ఆమెకు శిరోముండనం చేయించడం అధికారదర్ప ప్రదర్శన. సామాజిక వ్యవస్థలో రాజుల అహంకారం ఏ విధంగా ఉందో చూపించడానికి ఈ సన్నివేశం మనకు కళ్ళ ముందుంచుతాడు కవి. అలాగే శివ భక్తురాలైన ఆమె ఈశ్వరానుగ్రహంతో తిరిగి కురులు పొందిన తర్వాత రాజు ఆశ్చర్య చకితుడౌతాడు. అయితే రాజు ఎంత అహంకారైనా, శివుడి ద్వారా ఆమెకు కురులు తిరిగి వచ్చాయనే సత్యాన్ని గ్రహించి, తన మనసును మార్చుకొని పశ్చాత్తాపం చెందుతాడు. అయితే పశ్చాత్తాపం శివ భక్తుడైనందువల్ల మాత్రమే ఆ రాజులో కనిపిస్తుంది. కానీ శివభక్తి లేని రాజుల విషయంలో ఎలా ఉండేదో ఆలోచించాలి. అలాగే ఇదే కావ్యంలో నత్కీరుని కథ ఆనాటి సమాజంలో కవికి ఉన్న స్వతంత్ర ప్రతిపత్తిని, అలాగే రాజును ధిక్కరించినా లేదా దేవుడిని ధిక్కరించినా కవికి ఎలాంటి శిక్ష ఉండేదో మరోసారి నిరూపిస్తుంది. నత్కీరుడు పాండ్యరాజు ఆస్థానం లోని కవులలో అగ్రగణ్యుడు. అయితే అహంభావం కలిగిన వాడు. ఎంతటి మహాకవుల కవిత్వంలోనైనా తప్పులు పట్టగలిగిన దిట్ట. శివ బ్రాహ్మణుడు రాసుకుని తెచ్చిన పద్యంలో కూడా తప్పులు పట్టాడు. అయితే ఇక్కడ తాను రాసి పంపిన పద్యంలో తప్పులు పట్టడాన్ని శివుడు జీర్ణించుకోలేకపోయాడు. నత్కీరుని కుశాగ్రబుద్ధిని మెచ్చుకోకుండా, నత్కీరుని కుష్టు వ్యాధిగ్రస్తునిగా కమ్మని శపించాడు.

ఇక్కడ అహంకారుడైన నత్కీరునికి సాధారణమైన మార్ధవ మనస్తత్వాన్ని కలిగించాలనేది శివుని ఉద్దేశం కావచ్చు. పండితుడికి అహంకారం ఉండవచ్చు. కానీ ఆ పద్యం ఎవరు రాశారో చెప్పిన తర్వాత, ఎందుకు రాసి పంపాడో చెప్పిన తర్వాత కూడా, శివుడైనా, ఎవరైనా తప్పు తప్పే అని మొండిగా వాదించడం నత్కీరునిలోని మొండితనాన్ని తెలియజేస్తుంది. అందుకే అతను శిక్ష అనుభవించాడు.

సామాన్య ప్రజలు వారి వారి వృత్తులను క్రమం తప్పకుండా అనుసరిస్తూ చక్కటి జీవితాన్ని సాగించేవాళ్ళు. శ్రీకాళహస్తి మాహాత్మ్యం లోని దాసీలు, బోయలు, వేశ్యలు వంటి వారిని చూసినపుడు అది అర్థమౌతుంది. ధూర్జటి చూపించిన దాసీ జీవితం ఆనాటి సామాజిక వ్యవస్థలోని వారి దీనావస్థని తెలియజేస్తుంది. ఆమె ఎంత గొప్ప శివ భక్తురాలు అయినప్పటికీ, రాజుకు చేసే పరిచర్య విషయంలో ఆలస్యం కావడంతో ఆమె శిరోముండనానికి గురికావలసిన పరిస్థితి ఏర్పడింది. కావాలని కూడా ఆమె ఆలస్యం చేయలేదు. జంగం కోరికను తీర్చి ఆమె వచ్చే లోపు ఆలస్యమైంది. అతిథిపూజ చేయడం దాసీ జనాలలో కూడా తప్పకుండా ఉండేదని ఈ సంఘటన వల్ల అర్థమవుతుంది. బోయల్లో కూడా ఈ అతిథి సత్కార తత్పరత కనిపిస్తుందని ధూర్జటి చెప్పే సన్నివేశాలున్నాయి. తిన్నని వేటకు తీసుకెళ్లి, అడవిలో చెట్టుకింద ఉన్న శివలింగం ముందు నిలబెట్టాడు. ఆ శివలింగాన్ని ఉడుమూరుకు తీసుకువెళ్లడానికి రకరకాల ప్రయత్నాలు చేశాడు. తనతో కలిసి రావాలని అభ్యర్థించాడు. అతిథి సత్కారాలు చేస్తానని ప్రార్థించాడు. తన ఊరిలో రకరకాలైన ఆహార పదార్థాలు ఉన్నాయని, సేవచేసే దాసీ జనం కూడా ఉన్నారని చెప్పి శివలింగాన్ని మెప్పించడం కోసం ప్రయత్నం చేస్తాడు. బోయలు ఏ పని చేసినా, నిష్కల్మషమైన హృదయంతో చేస్తారని తర్వాత ఘట్టాల్లో చూపించాడు. ధూర్జటి పాఠకుల హృదయాన్ని కదిలించే విధంగా ఆనాటి సమాజంలోని గ్రామీణులు, ఆటవికులు నిష్కల్మషమైన మనసును చూపించాడు. శివలింగం కంటిలో నీటిని, ఆ తర్వాత రక్తాన్ని చూపించి, ఆయుర్వేద చికిత్సలకు లొంగని కంటి జబ్బును ప్రదర్శించి, ఆ తర్వాత ఆ కంటికి తిన్నని కంటిని అమర్చేటట్లు చేయడం కేవలం వారి అపరిమితమైన భక్తిని నిరూపించడానికి మాత్రమే చేసింది కాదు. నాటి సమాజంలో నమ్మకమైన ఆటవిక తెగల జీవన సరళిని మచ్చుకు చూపడమే. వేశ్యావృత్తిని అవలంబించే వారు వీలున్నంతవరకు సంపన్నులకు, రాజ కుటుంబీకులకు జీవితాన్ని అర్పించేవారు. ఇందుకు నిదర్శనం శ్రీకాళహస్తి మాహాత్మ్యంలో మాణిక్యవల్లి . అయితే వేశ్య కుటుంబీకుల్లో కూడా కొందరు స్వేచ్ఛతో తమ జీవిత సరళిని మార్చుకోవడం కోసం ప్రయత్నం చేసేవారు. సామాన్య జనజీవన స్రవంతిలో కలవడానికి తమ అలవాట్లను మార్చుకునేవారు. మార్చుకోవాల్సిన అవసరాన్ని,




సామాజిక చైతన్యాన్ని సూచించడానికి ధూర్జటి వేశ్యాతనయిలను కాళహస్తికి చేర్చి, భక్తులుగా చేసి, సామాజిక వ్యవస్థలో రావాల్సిన మార్పును సూచించాడు.

**పాండురంగ మాహాత్మ్యం – సామాజికత :**

పాండురంగ మాహాత్మ్యంలో కాశీపురం, తెనాలి అగ్రహార వర్ణన రెండూ కనిపిస్తాయి. కాశీ నగరం కూడా గంగానది ఒడ్డున విలసిల్లిన నగరం. బలమైన కోటలు, కోట చుట్టూ అగడ్తలు, అందమైన మేడలు, ఆ మేడల ముందుభాగంలో కట్టిన ధ్వజాలను కవి వర్ణిస్తాడు. అలాగే ఒక్కొక్క ప్రాంతంలో కొంతమంది జనావాసాలకు కేటాయించేవారు. అగ్రహారం ఒక ప్రత్యేకమైన నివాస ప్రాంతం. అంటే తెనాలిలో ఉన్న బ్రాహ్మణులు నివసించే ఒక ప్రత్యేకమైన ప్రదేశం. ఆనాటి అగ్రహారాలు ఎలా ఉండేవో ఎలా ప్రతిష్ట పొందాయో రామకృష్ణ కవి నిగమశర్మోపాఖ్యానంలో చూపించాడు.

పుండరీకుడు స్వామికి సమర్పించిన నైవేద్యంలో నాటి బ్రాహ్మణుల ఆహారం కనిపిస్తుంది. శల్యాన్నం, నేయి, వరుగులు, చారు, పప్పులు, అప్పడాలు, తాలింపులు, పరమాన్నం మొదలైనవి సమకాలీన సమాజంలో బ్రాహ్మణులు తినేవారని రామకృష్ణ కవి స్వీయానుభవంతో చెప్పినవే. తన ఇంటికి వచ్చిన మాయ వటుడుకి భోజనం పెట్టే సందర్భంలో రాజనాల బియ్యాన్ని వండి వార్చి, కూరగాయలు, పెరుగు మొదలైన వాటితో అరిటాకులో వడ్డించే సంప్రదాయాన్ని చెప్పడంలో, ఆనాటి అతిథికి భోజనం ఎలా పెట్టాలో చూపించాడు. అంతేకాదు స్థితిమంతుల ఇళ్లల్లో కజ్జికాయలు, నేతితో చేసిన అపూపాలు వంటి పిండివంటలు వున్నాయని రామకృష్ణ కవి చెబుతాడు. రామకృష్ణ కవి కూడా అడవిలో బోయవారితో కలిసి నిగమశర్మ ఆహారాన్ని తినే సందర్భంలో వెదురు బియ్యాన్ని,

మూకుళ్లలో వండుకొని తినే విధానాన్ని, వన్యమృగాల మాంసాన్ని వండడాన్ని చెబుతాడు. మజ్జిగ, సొరకాయ, దుంపలు, కాయలు వంటి వాటిని తినే ఆటవికులను చూపిస్తాడు.

పాండురంగ మాహాత్మ్యం రచనా కాలం నాటికి వ్యవసాయం ప్రధాన వృత్తిగా ఉండేదని, నారికేళ్ళు, మామిడి, అరటి, పనస వంటి పంటలు పండించే వారని, చెరుకు, వరి బాగా పండేదని తెలుస్తుంది. మూడు కార్ల పంటలు, కాలువలు కట్టి నీరుపారించి పండించిన సన్నివేశాన్ని రామకృష్ణ కవి రికార్డ్ చేశాడు. అంటే రామకృష్ణ కవి జల సమృద్ధమైన ప్రాంతాల్లోని పంటలపై ఎక్కువ దృష్టి పెట్టాడు. తెనాలి ప్రాంతం నుంచి వచ్చినవాడు కావడం వల్ల, ఆ ప్రాంతంలో నీటి వసతి బాగా ఉండటం వల్ల, ఇలాంటి పంటలు ఆనాటి సమాజంలో ఉన్నట్లు చెప్పి ఉండవచ్చు.

పాండురంగ మాహాత్మ్యంలో జాతర చాటింపు దగ్గర నుంచి కనిపిస్తుంది. ప్రజలు తలకు నూనె రాసుకోవడం, గోరువెచ్చని పసుపు నీటితో స్నానం చేయడం, కొత్తబట్టలు కట్టుకోవడం, కళ్ళకు కాటుక పెట్టుకోవడం, సిందూరాన్ని తిలకంగా దిద్దుకోవడం, వేప చిగుర్లు ధరించడం, చుక్క బొట్టులు పెట్టుకోవడం వంటివి ఈనాటి జాతర సన్నివేశాన్ని గుర్తుచేస్తాయి. జాతరలో పురుషుల కంటే స్త్రీలు ఎక్కువగా పాల్గొనేవాళ్ళని రామకృష్ణ కవి చెప్తాడు. ఎందుకంటే మొక్కుబడులను చెల్లించేవారిలో స్త్రీలే ఎక్కువ. '**అంబోదరము క్రింద నసియాడు నైరావతియుబోలె సిడిగ్రేలెదెఱవ యొర్తు....**' అంటూ స్త్రీలు జాతరలో చేసే నృత్యాన్ని వర్ణిస్తాడు.

ఈ గ్రంథంలో సహజ సిద్ధమైన, సమకాలీనమైన సమాజం కనిపించినప్పటికీ, ఎక్కువగా బ్రాహ్మణ సామాజపు తీరుతెన్నులు కనిపిస్తాయి. బ్రాహ్మణ సమాజంలో భ్రష్టులు, నియమనిష్టలు రెండు రకాల వారు కనిపిస్తారు. నిగమశర్మ, సుశీల భర్త, విద్యాధరుడు, సుశర్మ వంటి వారు ఒకవైపు కనిపిస్తే, పుండరీకుడు, నిగమశర్మ అక్కసుశీల, బోయడు వంటి వారు మరోవైపు కనిపిస్తారు.

కళింగదేశంలోని పీఠికాపురంలో నివసిస్తున్న బ్రాహ్మణ కులాన్ని భ్రష్టు పట్టించడానికి పుట్టిన నిగమశర్మ. ఆధునిక యుగంలో చక్కగా చదువుకున్న కుటుంబంలో పుట్టిన కుక్క మూతి పిందెల్లాంటి వ్యక్తిని గుర్తు చేస్తాడు. ప్రతి సమాజంలోనూ, ప్రతి కులంలోను, ప్రతి గ్రామంలో ఇలాంటివారు ఉంటారని చెప్పడానికి రామకృష్ణ కవి చక్కటి ప్రయత్నం చేశాడు. అన్ని చదువులు చదువుకున్నప్పటికీ, వేశ్యా సంపర్కం, దొంగతనాలు, చెడుస్నేహాలు సమాజంలోని నిలకడలేని ఒక వ్యక్తి తత్వాన్ని చూపిస్తాయి. నిగమశర్మ అక్క మెత్తటి మందలింపులో వాడిన పిల్లిశీలం, చిలుక చదువుల వంటి జాతీయాల ప్రయోగం వెను నాటి సమాజంలో మనిషి మలినమైన నడవడికను, ఉపయోగం లేని విద్యను చూపించడమే.

**సీ॥ పరమేష్టి నుండి నీ తరముదాక విశుద్ధ**
**తరమైన వంశంబు దలపవైతి**
**తరిదక్కి యున్న యీ తలిదండ్రులం జాల**
**పరచవై సంతోషపరచవైతి**
**వగ్నిసాక్షిగ బెండ్లియాడిన యిల్లాలి**
**నిల్లాలితనకార నొల్లవైతి**
**ధర్మశాస్త్రార్థ విత్తముల విత్తములచే**
**నలరించి విఖ్యాతినందవైతి**
**తే॥ శీల మఖిలంబు నిది పిల్లిశీలమనుచు**
**చదువు లివియెల్ల జిల్కల చదువులనుచు**
**దోడివారలు నవ్వ నాతోనె! యేల**
**బేలవైతివి? యీ గుణంబేలనీకు**

ఇక నేటి సమాజంలో యువతను, వారి చదువును చూసి వుంటే రామకృష్ణ కవి ఎంత బాధపడేవాడో! బుద్ధి చెప్పిన అక్క సొమ్మును కూడా కాజేసిన ఘనత వహించే సోదరులకు నిగమశర్మ ప్రతినిధి లాంటివాడు. కొంత మందికి ఎన్ని దెబ్బలు తగిలినా బుద్ధి రాదు. అదే నిగమశర్మ విషయంలో కూడా జరిగింది. దొంగలచేత దెబ్బలు తిని, కాపు చేత రక్షించబడ్డాడు. అన్నం తిన్న ఇంటి వాసాలు లెక్కబెట్టి, కాపు కోడల్ని లేవ తీసుకొని వెళ్ళిపోయాడు. ఆమె చచ్చిపోవడంతో ఒక ప్లవ కన్యతో జీవితాన్ని కొనసాగించాడు. ఆ చండాల స్త్రీ, సంతానంతో సహా అగ్ని ప్రమాదంలో ఆహుతి కావడంతో చివరికి పండరి చేరాడు. స్వర్గలోకంలో పుట్టిన గంగ చివరికి సముద్రంలో కలిసినట్టు అయింది నిగమశర్మ పరిస్థితి. సరైన జీవనసరళి లేనటువంటి వారి పతనం ఇలాగే ఉంటుందని సూచించడానికి రామకృష్ణకవి నిగమశర్మను చూపించాడు. నాటి సమాజంలో అనులోమ వివాహపద్ధతే కాకుండా, విలోమ వివాహపద్ధతి కూడా ప్రచారంలో ఉండేదని తెలుస్తోంది. గురజాడ సృష్టించిన గిరీశం కంటే నాలుగు ఆకులు ఎక్కువే చదివిన బ్రాహ్మణుడిగా నిగమశర్మ ఆనాటి సమాజంలో కనిపిస్తాడు.ఒక వ్యక్తిలోని ఒక చెడుగుణం అనేక రకాలైన చెడులకు ఎలా దారితీస్తుందో నిగమశర్మ లాంటి వ్యక్తుల ద్వారా చూపిస్తాడు.

సుశీలభర్త వంటి లోభులు కూడా ఆనాటి సమాజంలో ఉన్నారని చెప్పడానికి ఒక వ్యక్తిని పరిచయం చేస్తాడు రామకృష్ణ కవి. అతనికి పేరు పెట్టే ఆలోచన కూడా చేయలేదు కవి. గ్రామాల్లో ఇలాంటి యజమానులు కనిపిస్తూనే ఉంటారు. సుశీల మహాపతివ్రత కాబట్టి అతను పెట్టే బాధల్ని భరించింది. తిండి గింజలను, బియ్యాన్ని కూడా లెక్క చూసి ఇచ్చే భర్తలు ఆనాటి సమాజంలో సహజంగా కనిపించే వాళ్ళు. గొణగటం, పరుషంగా మాట్లాడడం, అకారణంగా తిట్టడం వంటివి కొంతమంది పురుషులకు జన్మసిద్ధంగా వస్తూ ఉంటాయి. రాజుల దగ్గర ప్రాధేయపడి తెచ్చుకున్న పదార్థాలను కూడా కోమటి

ఇంట్లో తీసుకెళ్లి అమ్ముకొని, ఆ డబ్బును కూడా జాగ్రత్తగా చేసుకుని లోభులకు, బంధువులు ఇంటికి వచ్చినప్పుడు తమకు సూతకం ఉందని చెప్పి వెళ్ళగొట్టే విచిత్రమైన మనస్తత్వం కలిగిన వాళ్లకు, కూరగాయల కోసం, ఉప్పు కోసం, పప్పు కోసం పక్క ఇళ్లకు వెళ్లి దీనాలాపాలు చేసి అడుక్కునే స్వభావాలకు, వేరే వాళ్లది దుమ్ము వచ్చి తన ఇంట్లో పడినా లాభంగా భావించే వారికి ప్రతినిధిగా సుశీల భర్తను చూపిస్తాడు రామకృష్ణ కవి. అయితే సొమ్ములతో ఇల్లువిడిచి వెళుతున్న నిగమశర్మను దారిలో దొంగలు కొట్టినప్పుడు, అతన్ని రక్షించి, వైద్యం చేయించి, తానే ఆశ్రయం ఇచ్చే కాపు లాంటి మంచి మనసున్న వాళ్లు కూడా సమాజంలో ఉన్నారు. జానపదులు సాధారణంగా అమాయకులుగా, పరోపకారులుగా ఉంటారని కవి భావన.

ఆనాటి సమాజంలో నిబద్ధతగల స్త్రీలతో పాటు, వికారపు మనస్తత్వాలు కలిగిన స్త్రీలు కూడా ఉండేవారని చూపిస్తాడు రామకృష్ణకవి. ఆనాటి ఉమ్మడికుటుంబ జీవనంలో ఇంట్లో ఎవరైనా చెడు అలవాట్లకు లోనైనప్పుడు, ఆ ఇంటి పెద్దగా ఉన్నవారు బాధ్యత తీసుకొని, చక్కదిద్దడం ఆనాటి సామాజిక ధర్మం. ఆ సామాజిక ధర్మాన్ని పురుషుడే నిర్వర్తించవలసిన అవసరం లేదు, స్త్రీ కూడా నిర్వర్తించవచ్చు అనే ఒక కొత్త మార్గాన్ని చూపించాడు రామకృష్ణ కవి. అందుకే నిగమశర్మ అక్కను ఆ కుటుంబాన్ని చక్కదిద్దే బాధ్యత నిర్వర్తించే ప్రధానమైన వ్యక్తిగా నిలిపాడు. ఆమె గ్రంథాలయాన్ని పునరుద్ధరించింది. నిగమశర్మ భార్యను ఓదార్చింది. నిగమశర్మకు చక్కని బుద్ధులు చెప్పింది. కుక్కతోక వంకర లాంటి స్వభావం గల మనుషులను మార్చలేమని నిజాన్ని గ్రహించింది. చివరకు తన నగలతో పాటు ముక్కెరను కూడా పోగొట్టుకుంది. అయితే ఆనాటి సమాజంలో ఆడపడుచు నిర్వర్తించవలసిన బాధ్యతకు ఒక నిర్వచనంగా నిగమశర్మ అక్కను చూపించాడు రామకృష్ణ కవి. ప్రతి ఇంట్లో అలాంటి బాధ్యత నేర్పే వ్యక్తి ఒకరు ఉండే వారని, ఆనాటి సామాజిక కుటుంబ వ్యవస్థను కళ్ళ ముందు ఉంచాడు. నిగమశర్మ భార్య కూడా మంచి బుద్ధిమంతురాలైన ఇల్లాలు. భర్త మాట జవదాటదు. ఆనాటి సమాజంలో కుటుంబ స్త్రీ ఎలా ఉండేదో చూడాలంటే, నిగమశర్మ భార్యను పాండురంగ మాహాత్మ్యంలో చూడాలి. సుశీల లాగా భర్తలో మార్పును తీసుకొచ్చే సామర్థ్యం లేని గృహిణులు కూడా నాటి సమాజంలో వున్నారు. అలాగే మంచి కుటుంబంలో ఉంటూ, మానసిక వికారమైన కామకోరికలకు లోనై తమ శరీరాన్ని పర పురుషులకు అర్పించుకునే కొందరు స్త్రీలు కూడా ఆనాటి సమాజంలో కనిపిస్తున్నారని చెప్పడానికి రామకృష్ణ కవి ఈ ఒక ప్రత్యేకమైన వ్యక్తిని సృష్టించాడు.ఆమె కాపు కోడలు ముందుగానే కోతి స్వభావం కలిగిన నిగమశర్మ దృష్టిని ఆమె ఆకర్షించేటట్లు చేసింది. చాటుమాటుగా వ్యవహారాలు నడిపే స్త్రీలు ఆనాటి సమాజంలో ఎలా ప్రవర్తిస్తారో కవి నేరుగా చెప్పాడు. భర్తకు ఏదో ఒక సాకు చెప్పి పొలానికి వెళ్లకుండా తప్పించుకోవడం, తనకు ఆరోగ్యం సరిగ్గా లేదని నటించడం వంటివి నాటి జానపద సమాజంలో కవి గమనించినవిగా చెప్పుకోవచ్చు.

ఈ విధంగా శ్రీకాళహస్తి, పండరీపురక్షేత్ర మాహాత్మ్యాలను కావ్యాలుగా మలచిన ధూర్జటి, తెనాలి రామకృష్ణ కవులిద్దరి కావ్య ప్రయోజనాన్ని సాధించారు. అయితే తమ తమ కావ్య దైవాలకు ఉత్కృష్టమైన మాహాత్మ్యాలను వర్ణించే క్రమంలో సమాజంలోకి వెళ్లారు. మనిషిని దేవుని దగ్గరకు తీసుకురావడానికి కవులు సమాజంలోకి, ఆ మనుషుల దగ్గరకు వెళ్లక తప్పలేదు. అలా వెళ్లి, ఆయా సామాజిక సన్నివేశాలను, జీవితాలను, జీవికకు అవసరమైన సామగ్రిని తెచ్చుకుని వారి కావ్యల్లో దాచిపెట్టారు. ఫలితంగా నాటి సమకాలీన సామాజిక అంశాలు అనివార్యంగా చేరాయి. ఇవి భక్తి కావ్యాలైనా, ఇందులో చెడు వర్తనం కలిగిన వాళ్ళైనా ఏదో ఒక రోజైనా దేవునికి మొక్కితే పాపాలు పోయి, ఉత్తమగతులు పొందుతారనే ఉపదేశం ఇచ్చినా, ఉత్తమ సమాజ నిర్మాణానికి మనిషి మంచి మార్గంలో వెళ్లాలనే నైతిక సందేశాన్ని అందిస్తున్నాయి.

**ఆధార గ్రంథాలు:**

1. సమగ్ర ఆంధ్ర సాహిత్యం ( 1,2 సంపుటాలు) – ఆరుద్ర

2. శ్రీ కాళహస్తి మాహాత్మ్యం – ధూర్జటి

3. పాండురంగ మాహాత్మ్యము(బులుసు వేంకట రమణయ్య టీక) – తెనాలి రామకృష్ణ కవి

4. శ్రీ కాళహస్తి మాహాత్మ్యము ( సమగ్ర పరిశీలన) – శెట్టివారి అశ్వత్థప్ప

5. శ్రీ కాళహస్తి పాండురంగ మహాత్మ్యాలు – డా॥ బండి ప్రభాకర్



ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 3  హైదరాబాద్ జనవరి : 2026

# శ్రమ సౌందర్యం

**డా. ఆవుల రేణుక**

ఫోన్ : 9398268976

ఉదయపు మబ్బులు
తొలిగేలోపు
నా కాళ్లకు మట్టి
అంటుకుంటుంది,
ఆ మట్టిలోని అడుగు జాడలే
నా జీవితపు బాటలు.

మట్టితో నా అనుబంధం
నిన్న మొన్నటిది కాదు,
తాతల నాటి ఊపిరి,
అమ్మ చేతుల స్పర్శ
అన్నీ ఈ పొలంలోనే
దాగున్నాయి.

నారు మడిలో వంగిన నా
నడుము
భూమికి నమస్కరిస్తూ,
విత్తనాన్ని చేతిలో పట్టి
భవిష్యత్తును నేలలో దాస్తాను.

ఎండ నెత్తిన నిలిచినా...
చినుకు నిలువెల్లా తడిపినా...

ఆ మడికట్టులో....
నా అరచేతుల మీదుగా
ఆకుపచ్చ కలలు మొలుస్తాయి.

పురుగుల భయం వున్నా...
వాన ఆలస్యం అయినా...
అన్నిటి నడుమ నా ఆశ
పంటచేలో మొక్కలా
నిలబడుతుంది.

నా శ్రమకు గుర్తింపు
లేకపోయినా
కోతల కాలానికి కల్లంలో
ధాన్యపు రాశి చిరునవ్వుల్లో
నా కష్టం ప్రతిఫలిస్తుంది

శ్రమైక సౌందర్యంలో
దేశానికి అన్నం పెట్టే
అన్నపూర్ణాదేవినై నిలుస్తాను.

పొలంలో శ్రమజీవినే కాదు
నేను
భూమికి శ్వాసనిచ్చే స్త్రీని,
అన్నానికి అర్థమయ్యే మౌన
గాథను నేను.

❖ ❖ ❖ ❖ ❖













ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 3 (13) హైదరాబాద్ జనవరి : 2026

# పర్యావరణ సంక్షోభాన్ని ప్రతిఘటిస్తున్న నాటికలు – 'ఊడలు' 'రెండు చేతులు'

✍ **డా. వై. సుభాషిణి,** తెలుగు సహాయాచార్యులు, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం,
**కె. అశ్విని,** అధ్యాపకులు, స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.
ఫోన్ : 90001 02394

**(A Study of Ecological Perceptions in Modern Telugu Literature (2014-2024)**

**A Research Project under the PM - USHA Scheme, Govt. of India)**

**1.0 పరిచయంః** తెలుగు నాటక సాహిత్యంలో 'ఊడలు', 'రెండు చేతులు' రెండు విభిన్న సామాజిక సమస్యలను ప్రతిబింబించే నాటకాలు. 'ఊడలు' పర్యావరణ దోపిడీ, రాజకీయ అవినీతి, అభివృద్ధి ముసుగులో జరిగే ప్రకృతి--మానవ నాశనం గురించి తెలుపుతుంది. 'రెండు చేతులు' మానవ నైతికత, అవినీతి, వ్యక్తిగత--సామాజిక బాధ్యతల మధ్య జరిగే అంతర్గత సంఘర్షణ గురించి వివరిస్తుంది. ఈ రెండు నాటకాలలో ప్రతిపాదిత సమస్యలు వేరు అయినప్పటికీ, సామాజిక న్యాయం అన్న ఒకే లక్ష్యాన్ని ముందుకు తెస్తాయి.

**1.1. నేపథ్యం - సమస్యల స్వభావం :** 'ఊడలు' - అల్యూమినియం ఫ్యాక్టరీ కోసం గ్రామం ఆక్రమణ, ప్రభుత్వ--కార్పొరేట్ కుట్ర, పర్యావరణం నాశనం రైతుల భూములు, నీటి వనరుల అపహరణ స్థానికుల జీవితాల విచ్ఛిత్తిని తెలియజేస్తుంది. 'రెండు చేతులు' - వ్యక్తిలోని మంచితనం--చెడుతనం మధ్య సంఘర్షణ, అవినీతిని అంగీకరించే ఒక చేయి నైతిక బాధ్యతను గుర్తు చేసే మరో చేయి, వ్యక్తి, కుటుంబం, సమాజం మధ్య విలువల విభేదాలు, సాధారణ మనిషి నిర్ణయాలలో నైతిక సంక్షోభం వెల్లడిచేస్తుంది. తులనాత్మకంగా చూస్తే 'ఊడలు' బాహ్య సంఘర్షణ వ్యవస్థకు ప్రజలకు మధ్య జరిగితే, 'రెండు చేతులు' అంతర్గత సంఘర్షణ వ్యక్తికి మనస్సాక్షికి జరిగేది. రెండింటిలోనూ అవినీతి కేంద్ర సమస్య, కానీ దాని రూపం వేరు. రెండు నాటకాలూ ప్రేక్షకుడిని ఆలోచింప చేస్తాయి, కానీ పద్ధతి వేరు. ఒకటి బాహ్య వాస్తవికతను చూపితే, మరొకటి అంతర్గత నైతికతను ఆవిష్కరిస్తుంది.

1. 2. ప్రకృతిని అందులోని సహజ వనరులన్నింటినీ సమూలంగా నాశనం చేసి దానితో వ్యాపారం సాగించి, కోట్లు సంపాదించి అంతకంతకు కుబేరులవ్వాలనే రాజకీయ దురుద్దేశ్యాలను, ప్రాణాలకు తెగించైనా ప్రకృతిని కాపాడాలనే తెగింపును చిత్రించే నాటకం చింతాడ రామారావు (సిరా) రాసిన "ఊడలు". ఇదొక సాంఘిక నాటకం. ఆధునిక తెలుగు నాటకాల్లో పర్యావరణ చింతన, అభివృద్ధి--అవినీతి సంబంధం, ప్రజా ఉద్యమం వంటి అంశాలను స్పష్టంగా ప్రతిబింబించే ప్రముఖమైన రచన. ఇది కేవలం ఒక గ్రామం కథ



కాదు; "అభివృద్ధి" అనే పేరుతో జరుగుతున్న ప్రకృతి దోపిడీ, రాజకీయ-పారిశ్రామిక కక్ష్యల అధర్మం, పర్యావరణ న్యాయం కోసం ప్రజల పోరాటాన్ని ఆవిష్కరించిన సామాజిక దర్పణం.

డా. సింహ బలనాయుడు రాష్ట్ర మంత్రి. ఇతని కొడుకు వ్యాఘ్రేశ్వర నాయుడు. జగన్నాథం రాజు గ్రామ పంచాయితీ సర్పంచ్. అతని కూతురు ఉష, మేనల్లుడు సూర్యతేజ. ఉ మామహేశ్వరరావు పట్నాయక్ అనే వ్యక్తి మంత్రికి పి.ఏ. కాగా, వెంకటరమణమూర్తి ఆర్.డి.ఓ. ఈ నాటకంలోని అన్ని ప్రధాన పాత్రలు ఇవే. తెరలేచే సరికి వేదిక ఒక వైపున వేపచెట్టు--రావిచెట్టు పెనవేసుకుని పెరిగిన వృక్షాలు కనిపిస్తాయి. వాటి ముందు ఊరమ్మోరు రాతి విగ్రహం. ఊరి జనమంతా అక్కడ దైవ క్రతువును చేస్తుంటారు. ఇదే సమయంలో అక్కడికి మంత్రి సింహబల నాయుడు, అతని పి.ఏ. చేరుకున్నారు. వారు ఆ క్రతువును ఆపేయమని ఆజ్ఞాపించారు. కాసేపటికి భూ వితరణ వేదిక ప్రారంభమైంది. వేదికపై రాష్ట్ర మంత్రి, సర్పంచ్, మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడు, ఆర్.డి.ఓ. ఆశీనులై ఉన్నారు. ఈ సభకు **"భూదాన యజ్ఞం"** అని పేరు. సర్పంచ్ మైక్ తీసుకొని మాట్లాడుతూ... **"ఈ ప్రాంత అభివృద్ధే నా లక్ష్యం. ఈ ఊరిలో భూమిలేని వారు ఎవరూ ఉండకూడదు. అందుకే భూములను పంచాలని నిర్ణయించానన్నారు. వెంటనే సర్పంచ్ మేనల్లుడు సూర్యతేజ, మా భూముల్ని తిరిగి మాకివ్వడమేంటి? ఎంతోకాలంగా మేము సాగు చేసుకుంటున్నాం అవి మావే"** అన్నాడు. దానికి మంత్రి మీరు సాగు చేసినా వాటి మీద మీకు హక్కు లేదు. దానిని మేము కల్పిస్తాం అన్నాడు. మా భూములు మీద మాకు గాక ఇంకెవరికి ఉంటుంది



హక్కు అని సూర్యతేజ ప్రశ్నించాడు. ప్రభుత్వానికే హక్కు ఉంటుంది. అవి ప్రభుత్వ భూములే అని మంత్రి సమాధానమిచ్చాడు. ప్రభుత్వ భూములు అంటే ప్రజలవే కదా, ఏదో సొంత భూములిస్తున్నట్టు “భూదాన యజ్ఞం” అని పేరెందుకు అని సర్పంచ్ కూతురు ఉష అంది. సూర్యతేజ, ఉషలకు ఇద్దరికీ ప్రశ్నించే తత్వం ఉన్నందుకు మెచ్చుకొని, ఇదే సమాజానికి కావాల్సింది అన్నాడు మంత్రి. అంతలో మంత్రి పి.ఏ. ఉమామహేశ్వరరావు పట్నాయక్ కి “సిద్ధాంత” అల్యూమినియం కర్మాగారం మంజూరు అయిందని ఫోన్ కాల్ వచ్చింది. అతడు మంత్రికి చెప్పగా మంత్రి సభాముఖంగా ప్రజలందరికీ తెలియజేశాడు. మన భూములకు రెక్కలొచ్చాయి. ఇంటికొక ఉద్యోగం ఖాయం, మీరంతా లక్షాధికారులు కాబోతున్నారని మంత్రి చెప్పాడు. అందరూ చప్పట్లతో, జేజేలుతో మంత్రిని అభిషేకించారు.

ఉష, సూర్యతేజ ఇద్దరూ ఒకేసారి కంపెనీని ఎవరు కోరారు. ఈ కంపెనీ వద్దు, దాని వల్ల వచ్చే కాలుష్యమూ వద్దు, రోగాలు వద్దు వాటికి మందులు వద్దు అని వాదించారు. ఫ్యాక్టరీలు రావడం వల్ల కాలుష్యం పెరగడమే కాదు అనేకమంది ప్రజలు వ్యవసాయ భూముల్ని, జీవనోపాధిని కోల్పోతున్నారు. అదే విషయాన్ని వందన శివ “In fact, the rural poor in china and India are losing their land and livelihood to make way for an Energy” (Soil Not Oil -- Vandana Shiva, Pg. No.34) అన్నారు. అభివృద్ధి జరగాలి అంటే కంపెనీలు కావాలంటారు మంత్రి. అలాగే ప్రజాభిప్రాయ సేకరణ సర్పంచ్ ఇచ్చారు కదా అంటే... సర్పంచ్ లేదు మేము అల్యూమినియం కంపెనీ వద్దనే అభిప్రాయాన్ని తెలిపామన్నాడు. అది అప్పటి మాట ఇప్పుడు కంపెనీకి ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నాడు మంత్రి. ఇలా వాదోపవాదనలు జరిగాయి. అభివృద్ధి నా ఒక్కడి కోసం కాదు మన ప్రాంతం మొత్తానికి చెందింది, ఎన్నో అభివృద్ధి పనులు మన ప్రభుత్వంలో జరుగుతా యన్నాడు మంత్రి. ఎంత అభివృద్ధి జరిగినా అది మీ కింద ఉద్యోగు లకే చెందుతుంది కానీ మాకు ఎలా చెందుతుందని ప్రశ్నించాడు జగన్నాథం. మా ఊరికి ఫ్యాక్టరీ వద్దు, కాలుష్యమూ వద్దు, మీకు ఫ్యాక్టరీ కావాలంటే పట్టణ శివారుల్లో బంగ్లా పక్కన రెండువేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది, అందులో పెట్టుకోండి అన్నాడు జగన్నాథం. మంత్రి ఆర్.డి.ఓ. కి వెంటనే దర్యాప్తు జరిపి రిపోర్టు పెట్టు అని అరిచాడు. తరువాత కొద్ది రోజులకి మంత్రి పి.ఏ., ఆర్.డి.ఓ. ని కలిసి సిద్ధాంత అల్యూమినియం ఫ్యాక్టరీ ఫైల్ గురించి అడగగా ఇంకా పూర్తి కాలేదన్నాడు. పి.ఏ., ఆర్.డి.ఓ. భార్యకి బంగారు వడ్డాణం, ఐదు లక్షలు డబ్బులు ఇచ్చానని చెప్పగా ఆర్.డి.ఓ. ఆ ఫైల్ పని చేయడానికి ఉత్సాహం కనబరిచాడు. వెంటనే పని పూర్తి చేశాడు. ఆర్.డి.ఓ.. ఈ విషయం చెప్పగానే మంత్రి కొడుకు వ్యాఘ్రేశ్వర నాయుడు తండ్రి పి.ఏ.ను మెచ్చుకొని, తాను చేయబోయే ఇంకో దుర్మార్గపు పన్నాగం గురించి చెప్పాడు. నాగావళి నది ఒడ్డులో ఒక పెద్ద అపార్ట్మెంట్, సినిమా హాల్స్ మొదలైన విలాసాలు పెట్టి డబ్బు గుట్టలు వేయడానికి వ్యూహాలు రచించాడు మంత్రి కొడుకు. అలాగే ఒక గుడి, మసీదు, చర్చి కట్టి మనవాళ్ళని సెంటిమెంట్ ఫూల్స్ ను చేసి డబ్బు సంపాదిద్దాం అన్నాడు మంత్రి కొడుకు. దీనికంటే ముందు రంగు రాళ్ళ గనిని తవ్వడానికి చాపరాయి గ్రామాన్ని లేపేయాలి. దానికి జగన్నాథం రాజు, తన కూతురు, మేనల్లుడు వీరికి అడ్డు తగులుతున్నారు. వ్యాఘ్రేశ్వర నాయుడు ఉషా, సూర్య తేజలతో ప్రతిఘటించాడు. ఉష, సూర్యతేజలు వ్యాఘ్రేశ్వర నాయుడుకి హితబోధ చేసినా ప్రయోజనం లేదు. అతడితో కొట్లాటకు దిగారు. చాపరాయి గ్రామంలో ఉన్న రంగు రాళ్ళగని, ‘సిద్ధాంత’ అల్యూమినియం ఫ్యాక్టరీ నిర్మాణం వలన పర్యావరణానికి కలిగే నష్టాలను, దీని పేరు మీద జరుగుతున్న లక్షల దోపిడీ గురించి ఉష సూర్య తేజ అనే విద్యార్థులు సమాచారం అందించినట్టు మంత్రి పత్రికలో ప్రచురించారు ఇది చదివిన జగన్నాథంరాజు ఉష సూర్యతేజలు ఉద్యమం తప్పదని నిర్ణయించు కొని, ప్రజల్లో చైతన్యం నింపి సన్నద్ధ పరుస్తారు. ఊరిలో తవ్వకాలు జరపడానికి వచ్చిన బుల్డోజర్లు యంత్రాలకు ఎదురుతిరిగి పోరాటం చేశారు. ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఉద్యమ ప్రజలు, విద్యార్థులు సమూహాలుగా విడివడి రాజకీయ నాయకులను చుట్టూ చుట్టుముట్టి తరిమికొట్టారు. మంత్రి సింహబలనాయుడు ప్రాణభీతితో పరుగులు తీయటం కథ.

**1.2.1. కథలో ప్రధాన ఘర్షణ:** నాటకంలోని కేంద్రీయ ఘర్షణ మూడు శక్తుల మధ్య జరుగుతుంది. అందులో ఒకటి- ప్రకృతి-- గ్రామ జీవనం. చాపరాయి అనే గ్రామం ప్రకృతి సహజత్వంతో నిండిన పచ్చని ప్రదేశం. అక్కడి వాగులు, దోనెలు, చెట్లు, పొలాలు, పశువులు అన్నీ గ్రామీణ జీవన శైలిలో అంతర్భాగాలు. రెండవది- పారిశ్రామిక దోపిడీ. అల్యూమినియం ఫ్యాక్టరీ---బాక్సైట్ గనులు--- దీనివల్ల కలుషితం అయ్యే గాలి, నీరు, నేల, పశువుల ఆరోగ్యం, చిన్నారుల రోగాలు ఇవి నాటకానికి నేపథ్య సమస్యలు. ఇక మూడవది రాజకీయ దుర్వినియోగం. మంత్రులు, మేనేజ్‌మెంట్, అబద్ధాలతో

గ్రామస్థులను మోసగించడం, పోలీస్ శక్తిని ఉపయోగించడం, నాయకులను తమవైపుకు తిప్పుకోవడం -- ఇవన్నీ అభివృద్ధి పేరుతో దోపిడీ ముసుగులో కనిపించే శక్తులు.

**1.2.2. పర్యావరణ నాశనం :** 'ఊడలు'లో ప్రకృతి మరణం ఒక కేంద్ర థీమ్. వాగులు ఎండిపోవడం, పంటలు పాడైపోవడం, పశువులు చనిపోవడం, చిన్న పిల్లల్లో ఊపిరితిత్తుల సమస్యలు. చాపరాయి గ్రామం ఏజెన్సీ కాదు. అలా అని మైదాన ప్రాంతం కాదు. ఏజెన్సీని ఆనుకొని ఉండే ప్రాంతం. అందుచేత గిరిజన సంస్కృతిని, మైదాన ప్రాంతంతో సంబంధ బాంధవ్యాలుండటం చేత నాగరిక సంస్కృతిని అనుసరిస్తారు ఈ గ్రామ ప్రజలు. ఊరికి ఎగువన జలపాతం, దాని కింద జలాశయం, చుట్టూ చెట్లు, రకరకాల పక్షులు, జంతువులు, ఊరిచుట్టూ ప్రవహించే సెలయేరు ఇలా ఎంతో అద్భుతంగా ఉంటుంది ఈ ఊరు. అటువంటి సుందరమైన ప్రాంతాన్ని ధ్వంసం చేయాలనే దురాశతో రాజకీయ నాయకులు, ఈ ఊరిలో రంగురాళ్ళ గని ఉందని, దాని కోసం 'సిద్ధాంత' అల్యూమినియం ఫ్యాక్టరీని నెలకొల్పి, ఈ ఊరిని కొల్లగొట్టాలని పన్నాగాలు పన్నారు. ఇలాగే జరిగితే ఆ ఫ్యాక్టరీ నుండి వచ్చే విష వాయువులు, వ్యర్థాలు వల్ల అద్భుత దృశ్యాలన్నీ కనుమరుగై పోతాయి. జలపాతం నీరంతా బురదగా మారుతుంది. పక్షులు జంతువులు నశించిపోతాయి. మొత్తం పర్యావరణమంతా నాశనమవుతుంది. "Besides depleting natural resources, they cause climate change, air and water pollution, acid rain, deforestation nausea/emesis, degradation" (Environment and Ecology - Anuj Kumar Purwar, Pg. 57).

**1.2.3. రసాయన కాలుష్యం :** ఊరికి అల్యూమినియం ఫ్యాక్టరీ మంజూరు అయ్యిందని తెలియగానే ఉష, సూర్యతేజ అనే విద్యార్థులు నేరుగా మంత్రితోనే ఎదురు తిరిగి ప్రశ్నించిన తీరు ఎంతో చైతన్యవంతంగా ఉంది. చాపరాయి గ్రామానికి పెద్ద ఆసుపత్రి నిర్మిస్తామని చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు ఫ్యాక్టరీ నిర్మాణం కాబోతోందని, వారే ఆసుపత్రి నిర్మిస్తారని చెప్తుంది. గ్రామ సర్పంచ్ కూతురు ఉష **"మాకు ఆ ఫ్యాక్టరీ వద్దు. దానివల్ల వచ్చే కాలుష్యమూ వద్దు, అందువల్ల వచ్చే రోగాలు వద్దు. ఆ రోగాలకు వాళ్ళిచ్చే మందులూ వద్దు"** అన్న మాటలు ఫ్యాక్టరీ కారణంగా వచ్చే ఉపద్రవాలను సూచిస్తున్నాయి. ఇవి ఫ్యాక్టరీ వల్ల గ్రామ జీవితం ఎలా నశిస్తోంది అన్నదాన్ని వాస్తవంగా చూపిస్తాయి. రచయిత అభివృద్ధి మోడళ్లలో పర్యావరణ విలువలు ఎంత నిర్లక్ష్యం చెయ్యబడ్డాయో ఘాటుగా విమర్శించారు.

ప్రభుత్వాలకి ఆదాయాలు వస్తే చాలు. ప్రజల అంగీకారంతో అవసరం లేదు. పర్యావరణం నాశనం అవుతుందన్న చింత ఉండదు. ధనాపేక్షే వారి ప్రథమ ధ్యేయం. గ్రామ సభ తీర్మానం, లెక్క



చేయకుండా వినాశనానికి పాల్పడుతున్న మంత్రి సింహబల నాయుడి వైఖరికి జగన్నాథం రాజు ఆవేశపడ్డాడు. **"చిన్న పిల్లాడేంటండీ... చిన్న పిల్లాడు... ఈ ఫ్యాక్టరీ ప్రతిపాదన వచ్చిందగ్గర నుంచి మేం వద్దంటూనే ఉన్నాం. ఫ్యాక్టరీ వల్ల ఇక్కడ పర్యావరణం పాడై పోతుందని ఈ పచ్చని ప్రకృతి అందాలు ధ్వంసమై పోతాయని! ఇక్కడి నీరూ గాలి అన్నీ కలుషితమైపోతాయి అని! అన్నీ మీరే చేసుకుంటే .... మేమెందుకు ఇక్కడ! పదండ్రా"** (లేచి వెళ్ళబోతే ఎం.పీ.పీ. అధికారులు అతనిని వారిస్తారు తేజస్వి, ఉషలు వేదిక దిగిపోతారు) అని జగన్నాథం రాజు అన్న మాటల్లోని ఆవేశం, ప్రకృతి పట్ల బాధ్యత ప్రతి ఒక్క మానవుడిలో ఉన్నట్లయితే ప్రకృతి రక్షించబడుతుంది.

రాజకీయ నాయకులు అధికారంలో ఉండి ధనదాహంతో వారు చేసే విధ్వంసాలకు హద్దు లేకుండా పోతుంది. పథకాల పేరిట జనాల్ని మోసం చేయటం, వారిని వారు స్వయం వృద్ధి చేసుకోవటం, దానికి సమిష్టి అభివృద్ధి అని పేరు పెట్టడం, అంతేకాదు పర్యావరణం పూర్తిగా పాడైపోతున్నా లెక్క చేయక, భవిష్యత్తు మానవ మనుగడను తృణప్రాయంగా తీసేయటం ప్రభుత్వాలకు పరిపాటి అయిపోయింది. **"అలా అంటావేం రాజూ... మీ అంటావేం! ఇది మన ప్రాంతం! ఈ ఊరితో నాకున్న బంధాన్ని తుడి చేస్తారా! నాకు బాధ్యత లేదా? ఈ ప్రాంతం మంచి చెడ్డలు చూడ్డం! ఈ ప్రాంతానికేం తక్కువ జరిగింది? భూములిస్తున్నాం.... ఇళ్ళిస్తున్నాం... పింఛన్లిస్తున్నాం. ఫ్యాక్టరీ పెట్టి ఉద్యోగాలిస్తామంటున్నాం. ఇంకా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలనుకుంటున్నాం"** (పుట : 11,12). అని మంత్రి సింహబల నాయుడు అన్నాడు. ఇక్కడ పచ్చని ప్రకృతి ఒడిలో వ్యర్థాలను విడిచే ఫ్యాక్టరీ కట్టి ప్రతి ఇంటికి ఉద్యోగం ఇచ్చినా ప్రయోజనం ఏమీ లేదు. ఆ ఫ్యాక్టరీల్లో పని చేసే, ఆ కాలుష్యంతో అనారోగ్యం సమస్యలొచ్చి జీవితమే కోల్పోతారు. ఇంక అభివృద్ధి ఎవరికి? ప్రభుత్వాలకే కానీ బలహీన జనాలకి కాదు.

మంత్రి కొడుకు వ్యాఘ్రేశ్వర నాయుడు ఆరావళి నది మధ్యలో అధునాతన విల్లాలు, అపార్ట్మెంట్లు, విలాసవంతమైన భవనాలు, పార్కులు, హోటళ్ళు, క్లబ్బులు, స్విమ్మింగ్ పూల్స్, ఆట స్థలాలు ఇలా మెగా ప్లాన్ తో మోడ్రన్ సిటీని నిర్మిస్తే కోట్లు వెనకేసుకోవచ్చు



అని అన్నాడు పి.ఏ.తో. అప్పుడు పి.ఎ. నదీ గర్భంలో నిర్మాణాలా అని అంటే గంగానదీ తీరంలో కాశీపట్నం వారణాసిని నిర్మించలేదా. అప్పటి టెక్నాలజీతో పోల్చితే ఇప్పుడు మరింత రెట్టింపు అయింది కదా అన్నాడు మంత్రి కొడుకు. అంతేకాకుండా దేవుని పేరిట ప్రజల్ని దోచుకోవటం సులభం అన్నాడు. **"మనం కూడా విశ్వేశ్వర దేవాలయం లాంటి ఆలయం ఒకవైపున, మసీదు చర్చి, మరొక వైపు మన టెక్కలి గ్రానైటుతోనో, రాజస్థాన్ పాలరాతితోనో.. నిర్మించేద్దాం! మన వాళ్ళెలాగూ సెంటిమెంటల్ ఫూల్స్ కదా! అన్ని రంగులు, హంగులు, సౌకర్యాలు సమకూర్తే..... భక్తి పారవశ్యంలో మునిగిపోతారు. ప్రజల దృష్టి భక్తిలోనికి మళ్ళి పోతే.... భూమి బద్దలై పోతున్నా... కొండలు తిరగబడి తమ మీద నుండి దొర్లిపోయి, తమ కళ్ళ ముందే శవాలు గుట్టలు రక్తపు మడుగులో తేలిపోతున్నా పట్టించుకోరు!"** (పుటః 29) అని మంత్రి కొడుకు అన్న మాటలు భక్తి అనేది సాధారణ పరిధి దాటితే ప్రజలు దోపిడీకి గురవుతారు అన్న విషయాల్ని తేటతెల్లం చేస్తున్నాయి. ఒక నదీ తీరంలో దేవాలయాన్ని నిర్మిస్తే భక్తి పారవశ్యంతో వెళతారే గానీ ఆ నిర్మాణం అక్కడ జరగటం వల్ల నది ఏ విధంగా కలుషితం అవుతుంది, జలచరాలు ఏ విధంగా కనుమరుగై పోతాయనే ఆలోచన ఏ ఒక్కరికీ లేదు. దానికి కారణం భక్తి. దీనినే ప్రభుత్వాలు సొమ్ముగా మలచుకుంటున్నాయి.

**1.2.4. అభివృద్ధి పేరుతో దోపిడీ -- రాజకీయాలు :** నాటకం అత్యంత తీవ్రంగా చూపే అంశం రాజకీయ-పారిశ్రామిక సక్సెస్. "అభివృద్ధి" అనే పదాన్ని బలహీనులను మోసం చేయడానికి ఉపయోగిస్తారు. గ్రామస్తులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇవ్వడం, వారి భూములను స్వాధీనం చేసుకోవడం, నీరు, గాలి కాలుష్యానికి బాధ్యత తీసుకోకపోవడం, నాయకులను కొనేసి ప్రజా పోరాటాలను నీరుగార్చడం – ఈ అంశాలు ఆధునిక భారతదేశంలోని డెవలప్మెంట్ పాలిటిక్స్‌ను ప్రతిబింబిస్తాయి. ఈ ఊడలు నాటకంలోను రచయిత అదే చెబుతున్నారు. చాపరాయి గ్రామంలో ఉన్న రంగురాళ్ల గనిని తవ్వి, దానితో వ్యాపారం చేయడానికి 'సిద్ధాంత' అల్యూమినియం కర్మాగారాన్ని నిర్మించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీని మూలంగా పర్యావరణం పూర్తిగా ధ్వంసం అవుతుంది. దీనికి ఉష, సూర్యతేజ అనే విద్యార్థులు ప్రభుత్వానికి ఎదురు నిలబడ్డారు. ప్రశ్నించారు. ప్రతిఘటించారు. ఈ విద్యార్థులు ఇద్దరూ తమకు అడ్డు అని వారిని అంతమొందించాలని మంత్రి కొడుకు వ్యాఘ్రేశ్వర నాయుడు వారితో తలపడ్డాడు. అప్పుడు సూర్యతేజ **"వ్యాఘ్రేశ్వర నాయుడూ! తరతరాలుగా వస్తున్న అపురూపమైన ప్రకృతి సంపదను భావి తరాలవారికి భద్రంగా అప్పజెప్పడం మన విధి. పాతతరం ఎలాగో గడిచిపోయింది. మనం యువకులం. భవిష్యత్తు మనది! సమాజంలో వేళ్ళూనుకుపోయిన అవినీతినంతమొందించి చక్కదిద్ద వలసిన బాధ్యత మన మీదుంది! భూమి ఆవర్భించిన్నాడు ఏర్పడ్డాయి ఈ ప్రకృతి సోయగాలు! మన స్వార్థంకోసం.... వాటిని ధ్వంసం చేయటం ధర్మం కాదు! ఆలోచించు!"** (పుటః 39) అంటూ వివరించిన తీరు ఒక విద్యార్థి కర్తవ్యాన్ని తెలియజేస్తుంది. అలాగే ప్రకృతిలో ఉండే ఏ అంశాన్ని మానవుడు నిర్మించలేదు, సృష్టించలేదు. అవి సహజ సిద్ధంగా భూమి అవతరించినప్పుడే ఏర్పడ్డాయి. వాటిని సక్రమంగా ఉపయోగించి, రెట్టింపు చేయడమే మానవుడి బాధ్యత. అంతేకానీ దానిని వినాశనం చేయడానికి హక్కు లేదు. స్వార్థంతో వాటిని కాజేస్తే భావి తరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది అనే మౌలిక స్ఫూర్తిని విద్యార్థి ద్వారా సమాజంలో కలిగించటం ఈ నాటకంలో రచయిత ప్రథమ ఉద్దేశ్యం.

కంపెనీలు, ఫ్యాక్టరీలు, అపార్ట్మెంట్లు, పెద్ద బిల్డింగులు ఇవి ఉంటేనే అభివృద్ధి, టెక్నాలజీ ఉన్నట్టు అని ప్రభుత్వాలు వాటిని ప్రోత్సహిస్తున్నాయి. ఏదైనా ఒక ఫ్యాక్టరీ నిర్మాణం జరగాలంటే దానికి కావలసినది ప్రధానంగా నీరు. అంటే ఏదైనా నదీ పరివాహక ప్రాంతాల్లో నిర్మిస్తారు. దాని వలన నదులు కొల్లగొట్టబడతాయి. కలుషితం అయిపోతాయి. ఇలాంటి చర్యలకు ప్రజలు ఎప్పుడూ వ్యతిరేకులే. ఎందుకంటే దీని మూలంగా వారి స్థావరాలు, ప్రకృతితో వారికున్న అవినాభావ సంబంధాలు అన్నింటినీ కోల్పోయి, ఆ ఫ్యాక్టరీల్లో కార్మికులుగా మారి, కాలుష్య కారణంగా అనారోగ్యం పాలై జీవితాల్ని కోల్పోవలసి వస్తుందని వారి ఇలాంటి చర్యలకు ప్రోత్సాహం అందించరు. ఫ్యాక్టరీ ఏర్పాటు చేశారంటే కచ్చితంగా టైలింగ్ డ్యామ్లు, టైలింగ్ పాండ్స్ వంటివి ఫ్యాక్టరీ వ్యర్థాల్ని నిల్వ ఉంచడానికి ఏర్పాటు చేస్తారు. వీటి వలన అనేక రోగాలు వస్తాయి. దానికి Report from JOAR' Jharkhand, 2004 నివేదిక కూడా నిదర్శనంగా నిలుస్తోంది – "A Study of people living within 1 kilometre of the tailing dam showed that 47 percent of women had developed menstrual problems, 18 percent had suffered miscarriages or had given birth to stillborn babies, and 30 percent had other fertility problems. Children born in the area are born with deformities, skeletal distortions, partly deformed skulls and organs" (Soil Not Oil -- Vandana Shiva, Pg. No. 25).

**1.2.5.** ప్రజా ప్రతిఘటన -- ప్రధాన సందేశం: ఉష, సూర్యతేజ్ వంటి పాత్రలు ప్రజా ఉద్యమానికి ప్రతీకలు. వీరు గ్రామ ప్రజల్లో చైతన్యం కలిగిస్తూ; హక్కులపై అవగాహన, సంప్రదాయ జల వనరుల రక్షణ, కార్పొరేట్ దోపిడీకి అదుపు, ప్రభుత్వాన్ని ప్రశ్నించే ధైర్యం ఇవన్నీ నేర్పుతారు. వారి పోరాటం ప్రజల స్వరాన్ని ప్రతిబింబిస్తుంది. **"ప్రకృతి మీద హక్కు మనదే---దానిని రక్షించేది కూడా మనమే"** నంటారు. ఈ నాటకంలో సూర్యతేజ **"వ్యాఘ్రేశ్వర నాయుడూ... ప్రజలు కేంద్రంగా జరిగే అభివృద్ధికి మేం ఏనాడు అడ్డం కాదు. కాకపోతే... అడ్డగోలు దోపిడీని, ప్రకృతి వనరుల విధ్వంసాన్ని వద్దంటున్నాం! మాకు సహకరించు మీ నాన్న గారిని ఒప్పిద్దాం! రా! జరగబోయే ప్రకృతి విధ్వంసం, జీవహననం ఆపుదాం! మాతో చేయి కలుపు!"** (పుట: 40) అన్న మాటల్లో ప్రకృతి సోయగాలను, సంపదను ఇనుమడింప చేయటమే అభివృద్ధి అని ప్రభుత్వాలు సంకల్పించి, కార్యాచరణ చేస్తే మన దేశం అభివృద్ధి పథములలో మరింత ముందుకు సాగుతుందనే అంశాన్ని గోచరింపచేశారు నాటక కర్త "చింతాడ రామారావు గారు".

**"అల్యూమినియం కర్మాగారం వదిలే విష వ్యర్థ పదార్థాలతో కూడిన ఎర్ర బురద వల్ల ఈ అందమైన జలపాతం... సెలయేరు... కలుషితమైపోతాయి. ఈ నీరే జీవనాధారంగా చేసుకొని బ్రతికే జీవరాశులు, రకరకాల వింత వ్యాధులకు గురై అంతరించిపోయే ప్రమాదం ఉంది. ఇక్కడ నేల చచ్చిపోతుంది. గాలి కలుషితమై పోతుంది. ఆకులపై బూడిద లేపనం ఏర్పడి హరితం హరించుకు పోతుంది! అన్నిటికన్నా ముఖ్యంగా ఏనాడో ఏ మహనీయుని సుందర స్వప్నమో ఈ గ్రామం...! ఈ గ్రామం ఇక్కడి నుండి అంతర్ధానమై పోతుంది"** (పుట: 40) అన్న సూర్య తేజ మాటల ప్రకారంగా చూస్తే దేశం మొత్తంలో వందలు వేలల్లో కర్మాగారాలు ఉన్నాయి. ఒక్కో కర్మాగారానికి ఒక్కో గ్రామమే కాదు, దాని పరిసర ప్రాంతాలు అన్నింటిలో ఇదే పరిస్థితి నెలకొంటుంది. ఇదే కొనసాగుతూ పోతే దేశంలో పచ్చదనమే కనుమరుగవుతుంది. పచ్చదనమే లేకుంటే మానవ మనుగడే మృగ్యమవుతుంది. ఊహించుకుంటేనే భయంకరంగా ఉంది.

ప్రకృతి ధ్వంసం అవ్వడానికి ప్రధాన కారణం ప్రభుత్వాలే అని చెప్పవచ్చు. ప్రజా సంక్షేమం పేరుతో ప్రజల్ని అమాయకుల్ని చేసి సర్వం దోచుకు తింటుంది ప్రభుత్వం. కర్మాగారం వలన ఇంటికొక ఉద్యోగం, భూములకు అధిక ధరలు, రోడ్లు, బస్సులు, హోటల్లు, సినిమా హాలు ఇలా పల్లెలకు పట్టణ పోకడలు దిద్దడం వంటి కల్పనలు చేసి సంపద మొత్తాన్ని దోచుకుంటుంది ప్రభుత్వం అని సూర్యతేజ మంత్రి కొడుకు వ్యాఘ్రేశ్వర నాయుడుతో అనగా, మారుమూల పల్లెలు, నగరాలుగా, మెట్రోపాలిటన్ సిటీలుగా విలసిల్లుతాయి. ఇది కల్పనా! అన్నాడు. దానికి అవును. అవును..!



ముమ్మాటికి కల్పనే!... ఈ ప్రకృతి సంపదను లూటీ చేసి దోచుకునే కుట్రే! అభివృద్ధి అనే పేరుతో దేశంలో 84కి పైగా ఉన్న పారిశ్రామిక క్లస్టర్లలో గాలి, నీరు, భూమి విషతుల్యంగా మారాయని కాలుష్యం నివేదికలు తెలియజేస్తున్నాయి. మన విశాఖ, హైదరాబాద్, విజయవాడలో వచ్చిన కాలుష్యం వలన ప్రజలు పడుతున్న బాధలు చూస్తున్నాం. ఒడిస్సాలో అల్యూమినియం కంపెనీలు ఉన్న చోట జరుగుతున్న నష్టం కళ్లకు కనిపిస్తోంది అని సూర్యతేజ చెప్పిన విషయంలో ఇప్పటికే అభివృద్ధి పేరిట స్వచ్ఛమైన గాలి, నీరు కలుషితమై పోయాయి. దానిద్వారా ప్రజలు అనారోగ్య సమస్యలతో బాధలు పడుతున్నారు. దానిని తగ్గించాలంటే మనవంతుగా చెట్లను పెంచాలి. అంతేకానీ ఇంకా కొత్తగా కర్మాగారాలు నెలకొల్పుకుంటూ పోతే ఈ సృష్టి అంతమైపోతుందని తెలుస్తోంది.

చాపరాయి గ్రామ సర్పంచ్ జగన్నాథం రాజు, అతని కూతురు ఉష, మేనల్లుడు సూర్యతేజ ముగ్గురూ కలిసి ప్రజల్ని చైతన్యపరచి తమ గ్రామంలో అల్యూమినియం కర్మాగారం వద్దని ప్రభుత్వానికి ఎదురు తిరగడానికి ఒక ఉద్యమరూపం దాల్చారు. ప్రజా సమైక్యబలం రుచి చూపి ప్రభుత్వాలని కర్మాగారం నిర్మించకుండా వెనుదిరిగేలా చేసిన ఘనత విద్యార్థులది. విద్యార్థులు తలచుకుంటే విజయాలను సాధించగలరనే దానికి నిదర్శనం ఈ నాటకం. ఉష బలమైన, ప్రజల ఆత్మస్థైర్యానికి ప్రతీక. పర్యావరణ పరిరక్షణలో మహిళల పాత్రను ప్రతిబింబిస్తుంది. సూర్యతేజ అధికార దౌర్జన్యాన్ని ఎదుర్కొనడానికి ధైర్యంగా ముందుకు వచ్చే యువనేత. పరస్పర సహకారంతో జీవించే గ్రామస్తులు వారి అసహాయ స్థితి, తర్వాత తిరుగుబాటుగా మారుతున్న చైతన్యం నాటకంలో ప్రధాన డ్రామాటిక్ మూడ్‌ను సృష్టిస్తుంది.

**1.2.6. గ్రామీణ జీవన శైలి -- మానవ విలువలు:** గ్రామ జీవనంలోని నిర్మలత్వం, పరస్పరం ఆధారపడే జీవన శైలి, పశు వుల--పంటల బంధం, ప్రజల మధ్య నమ్మకం -- ఇవన్నీ నాటకంలో హృద్యంగా చిత్రితమయ్యాయి. ఇవి ఫ్యాక్టరీ రాకతో విచ్ఛిన్నమయ్యాయి. ప్రకృతిని కోల్పోతే మనిషి తన జీవన ఆధారాన్ని కోల్పోతాడన్న భావన రచయిత బలంగా నూరిపోశారు.



'ఊడలు' అనే పేరు ఇది కేవలం శీర్షిక కాదు; అల్యూమినియం తయారీకి కావలసిన గనులు కొండలను "ఊడలు" చేసి తవ్వడం ప్రకృతి శరీరాన్ని గాయపరచడం అన్నింటినీ సూచిస్తుంది. ఎండిపోయిన వాగు ప్రకృతి మరణానికి ప్రతీక. గ్రామస్తుల ప్రతిఘటన పర్యావరణ న్యాయం కోసం జరుగుతున్న ప్రపంచవ్యాప్త ఉద్యమాల ప్రతిబింబం. 'ఊడలు' చెప్పేది ఏమిటంటే – **"ప్రకృతి నాశనం = మనిషి నాశనం"**. అభివృద్ధి అంటే కేవలం ఫ్యాక్టరీలు, కంపెనీలు, భవనాలు కాదు. అభివృద్ధి అంటే జీవన నాణ్యతను పెంపొందించడం. ప్రకృతిని నాశనం చేసి పొందిన సంపద, చివరికి మనిషి జీవనాన్ని ఖాళీ చేసేస్తుంది. ఈ భావన నాటకం మొత్తం వ్యాపించి, చివరకు పర్యావరణ అవగాహన, పోరాటం, నిస్వార్థ ప్రజాధర్మం అనే వాటి వైపుకు నడుస్తుంది.

2.0. ప్రపంచీకరణ కారణంగా మానవుడు పక్షులకు నిలువనీడ లేకుండా చేస్తున్నాడు. అంతే కాకుండా అవి తాగేనీటిని, పంటలకు వాడే రసాయనిక మందులతో అవి తినే తిండి గింజలను కూడా విషతుల్యం చేయడాన్ని, అవి అంతరించి పోవడాన్ని తెలిపే నాటకం **వల్లూరు శివ ప్రసాద్ రాసిన "రెండు చేతులు"**. ఈ బాలల నాటకం పిచ్చుకల మనుగడ అంతరించి పోవడానికి దారి తీసిన పరిస్థితులను వివరించింది. వల్లూరు శివప్రసాద్ గారి 'రెండు చేతులు' ఒక చిన్నారుల నాటకం అయినా, దాని అంతరార్థం ప్రపంచీకరణ, ఆధునిక వ్యవసాయం, ప్రకృతి దోపిడీ వల్ల పక్షి జీవనవ్యవస్థలు ఎలా క్షీణించాయో అత్యంత సున్నితంగా చూపిస్తుంది. పిచ్చుకల మనుగడ సంక్షోభాన్ని కేవలం కథగా కాకుండా పర్యావరణ హెచ్చరికగా, మానవాళి అభివృద్ధి పై ప్రశ్నగా నిలుస్తుంది.

ఒక ఆడ పిచ్చుక అప్పుడే పుట్టింది. అది తన తల్లిదండ్రులు తెచ్చిన రకరకాల తిండి గింజలతో పొట్ట నింపుకొని హాయిగా గడుపుతూ... పెద్దదయ్యింది. తన గూటిని దాటి స్వేచ్ఛగా ఎగిరే స్థాయికి వచ్చింది. అలా ఎగురుతూ ఉండగా తనకు ఒక మగ పిచ్చుక ఎదురు పడింది. మగ పిచ్చుక ఆడపిచ్చుక మీద మరులు పెంచుకుంది. ఆ విషయాన్ని ఆడ పిచ్చుకతో చెప్పగా, ఆడ పిచ్చుక అందుకు నిరాకరించింది. మగ పిచ్చుక కారణం అడగగా, ఆడ పిచ్చుక నీకు సొంత గూడు ఉందా అని ప్రశ్నించగా... మగ పిచ్చుక ఆలోచించి వెంటనే గూడు నిర్మించి ఆడ పిచ్చుకకు ఒప్పించి పెద్దల సాక్షిగా ఒక్కటయ్యారు. ఇద్దరూ జత కట్టగా వారికి ఒక మగ పిచ్చుక, ఆడ పిచ్చుక... ఎంతో ముద్దుగా పుట్టారు. ఆ పిల్ల పిచ్చుకలను చూసుకొని ఎంతో మురిసి పోయారు. వారి గూడు ఉన్న స్థలం ఒక పాడుబడిన ఇల్లు. తల్లి, తండ్రి పిచ్చుకలు ఆహారం కోసం బయటకు వెళ్ళాయి. ఆ పిల్ల పిచ్చుకలు ఆ గూటిలో తమ తల్లిదండ్రుల కోసం ఎదురు చూస్తుంటాయి. అంతలో ఆ ఇంటి మనుషులు వచ్చి ఆ ఇంటిని పడగొట్టాలని మాట్లాడుకుంటున్నారు. ఆ మాటలు విన్న పిల్ల పిచ్చుకలు తల్లడిల్లిపోయాయి. వారు గునపాలతో ఆ ఇంటిని నేలకూల్చారు. గూడు చెదిరిపోయింది. తల్లి, తండ్రి పిచ్చుకలు వచ్చి చూసి తల్లడిల్లిపోయాయి. నీరసించి పోయి... ఎగురుకుంటూ మరో ప్రాంతానికి పోయాయి. ఈ రెండు చేతుల జీవులు మన బిడ్డల్ని పొట్టన పెట్టుకున్నాయి అని మనోవేదన చెందాయి.

ఇంతలో ఒక ముసలి మగ పిచ్చుక ఆయాసంతో అక్కడకు వచ్చి వాలింది. ఈ రెండు పిచ్చుకలు...ఆ ముసలి పిచ్చుకను పలకరించాయి. ఎన్నాళ్ళయింది... ఇలా మన వాళ్లను చూసి అని ఆ ముసలి మగ పిచ్చుక ఆనంద పడసాగింది. మన జాతి పిచ్చుకలు ఇప్పుడు ఎక్కడా కూడా కనిపించలేదు. ఆహార కొరత వల్ల, రెండు చేతుల జీవుల చర్యల వల్ల మన జాతికే ముప్పు వాటిల్లిందని అవి మాట్లాడుకుంటూ... ఆ ముసలి పిచ్చుక అక్కడే ఉన్నా నీటికుంట దగ్గర దాహంతో నీరు తాగింది. అవి నీరే కానీ కటిక చేదు. కొంత సేపటికి ముసలి పిచ్చుక ఊపిరి ఆడక గిలగిలా కొట్టుకొని మరణించింది. అది చూసి ఆ రెండు పిచ్చుకలు అల్లాడిపోయాయి. కనీసం తాగడానికి నీరు కూడా లేకుండా విషతుల్యం అయ్యాయి. ఈ ప్రకృతిలో మనం జీవించడానికి కనీసం తిండి గింజలు కరువయ్యాయని బాధపడుతూ ఎగురుకుంటూ వెళ్లాయి. ఒక రైతు పొలంలో తన పంటకు పచ్చ పురుగు పడిందని పురుగుల మందు కొట్టించాడు. ఆ పురుగులన్నీ నేల మీద జీవచ్ఛవాలుగా పడిపోయాయి. ఇంతలో మగ పిచ్చుక వేగంగా అక్కడికి వచ్చింది. ఆడ పిచ్చుక వెనుకబడి పోయింది. ఎంతో ఆకలితో ఉన్న మగ పిచ్చుక పురుగులను చూసి... ఈరోజు ఆహారం దొరికింది అనే ఆశతో వాటిని వెంటనే తిన సాగింది. ఈ పురుగులు తన ఆడ పిచ్చుకకు చాలా ఇష్టం అని మనసులో అనుకుంటూ ఉంది. ఇంతలో ఆడ పిచ్చుక వచ్చింది. మగ పిచ్చుక తనతో రా! ఇవాళ నీకు ఇష్టమైన పచ్చ పురుగులు.... బాగా తిను అని అంటూనే తన గుండెల్లో వచ్చే ఆ నొప్పిని భరించలేక... వద్దు.. ఆ పురుగులను తినకు అవి విషతుల్యం అయ్యాయి. కడుపులో నొప్పి..వికారం..కళ్ళు తిరుగుతూ ఉన్నాయి... అని అంటూ బాధతో... నువ్వు ఇక్కడ ఉండొద్దు. ఎక్కడికైనా దూరంగా రెండు చేతుల జీవి లేనిచోట జీవించు అని తన తోటి పక్షికి చెప్పి

ప్రాణాలు విడిచింది. ఆ ఆడ పిచ్చుక... ఏడుస్తూ తాను చిన్నప్పుడు... తన తల్లిదండ్రులు రకరకాల చిరుధాన్యాల గింజలను, ఆహారంగా తనకు పెట్టేవారని.. అవన్నీ ఇప్పుడు లేవు అని.. పంటలు మారిపోయి.. విషతుల్యం అయ్యి పర్యావరణానికి.. తమలాంటి జీవులకు అంతం పలుకుతున్న ఈ రెండు చేతుల జీవుల నుండి తమకు రక్షణ కల్పించు తల్లి అని ఆ ప్రకృతిమాతను ఆడ పిచ్చుక వేడుకుంటూ అక్కడ నుండి ఎగిరిపోయింది.

"రెండు చేతులు" అనే ఈ నాటకంలో వల్లూరు శివప్రసాద్ గారు పిచ్చుకల జీవన మనుగడ ఎలా కనుమరుగయ్యే పరిస్థితులను మనిషి సృష్టించాడో తెలియజేశారు. ప్రపంచీకరణ ఫలితంగా చేస్తున్న మానవ చర్యల వల్ల పిచ్చుకలు నివాసం, ఆహారం, నీరు--- అన్నింటినీ కోల్పోయాయి; ఫలితంగా అవి అంతరించడమే మిగిలింది. మానవుడు నిర్మించిన 'రెండు చేతులు' ప్రకృతిని కాపాడటానికి కాకుండా రసాయనాలు గృహ నిర్మాణాలు టవర్లు యాంత్రిక వ్యవసాయం చేసి ప్రకృతిని ధ్వంసం చేస్తున్నాయని, అది చిన్న పక్షులకు బ్రతికే అవకాశం లేకుండా చేసిందని నాటకం స్థిరంగా తెలియజేస్తుంది.

ఒకప్పుడు పిచ్చుకలు గుంపులు గుంపులుగా.. ఆకాశంలోని మేఘాలతో పోటీపడేంతలా విహరించేవి. క్రమేణా వాటి జనాభా తగ్గుముఖం పట్టింది. ఇదే విషయం గురించి జి. సుధాకర్ గారు జీవవైవిధ్యం మన వారసత్వం పుస్తకంలో పేర్కొన్నారు. **"1950 లో చైనాలో యూరోపియన్ ట్రోస్పేర్ లు ఎలుకలలాగా పంటలను నాశనం చేస్తోంటే సామూహిక నిర్మూలనా కార్యక్రమం చేపట్టారు. పెద్ద పెద్ద శబ్దాలు చేయడంతో లక్షలాది పిచ్చుకలు చనిపోయాయి. కారణంగా క్రిమికీటకాలు అడ్డు అదుపూ లేకుండా పెరిగి పంటలను నాశనం చేయడంతో తీవ్ర దుర్భిక్షం ఏర్పడింది."** (పుటః 12, జీవవైవిధ్యం మన వారసత్వం). అదే భారతదేశంలోనూ చోటు చేసుకోవడం గమనార్హం. ఆడ పిచ్చుక చిన్న వయసులో ఉన్నప్పుడు తన తల్లిదండ్రులు తనకు ఎన్నోరకాల తిండి గింజలను, చిరు ధాన్యాలను ఆహారంగా తెచ్చి పెట్టేవి. కానీ ఇప్పుడు ఆ పంటలు అన్నీ కనుమరుగై వాటి స్థానంలో కొత్త పంటలు వచ్చి ఆహారానికి ఇబ్బందులు ఎదురయ్యాయి. మగ పిచ్చుక ఆడ పిచ్చుకతో మాట్లాడుతూ, చిన్నప్పుడు మా అమ్మతో పొలాల మీద వెళ్లే వాన్ని ఎంత హాయిగా, సువాసనగా ఉండేది! ఎంత రివ్వురివ్వున ఎగిరినా అలుపు సొలుపు ఉండేది కాదు. జొన్న, సజ్జ, రాగులు, వరిగెలు ఎన్ని రకాల పైర్లో. ఆ చేలో నాలుగు గింజలు, ఆ చేలో నాలుగు గింజలు తింటే కడుపు నిండిపోయేది. ఇప్పుడు ఆ పంటలు లేవు. కొత్త కొత్త పంట లేస్తున్నారు. మన కడుపులు కొడుతున్నారు అనటంలో వాటి ఆహార స్థాయిలు పూర్తిగా కనుమరుగయిన పరిస్థితిని...వల్లూరు శివప్రసాద్ గారు స్పష్టంగా వివరించారు.



**2.1. నీటి విషతుల్యం :** ముసలి మగ పిచ్చుక దాహంతో అక్కడ ఉన్న కుంటలో నీరు త్రాగగానే **"ఏంటా రుచి పచి లేవు నీళ్లు దాహం కొద్ది తాగడమే కాని వికారపు వాసనొస్తున్నాయి"** అని అనడంలో నేటి రైతులు తమ పంటలకు ఆధునిక రసాయనిక పురుగు మందులు విపరీతంగా వాడడంతో నేలతో పాటు, నీరు, తినే తిండి గింజలు, చుట్టూ ఉన్న ప్రకృతి విషతుల్యం అవుతుందనే విషయాన్ని శివప్రసాద్ గారు నిగూఢంగా తెలియజేశారు. ముసలి పిచ్చుక కుంట నీరు తాగి చావడం---ఇది అత్యంత ప్రతీకాత్మక దృశ్యం. ఫ్యాక్టరీలు, రసాయనాలు వ్యవసాయ మందులు ద్వారా నీరు కూడా జీవుల్ని చంపే పదార్థమైంది. **"నీళ్లు, నేల, గాలి---మూడూ విషపూరితమైతే జీవనం ఎక్కడ?"** అన్న సమాజ ప్రశ్న ఈ దృశ్యంలో ఉంది.

**2.2. రసాయనాల వల్ల ఆహార విషతుల్యం :** ఆడ పిచ్చుక.. తన కళ్ళ ముందే మగ పిచ్చుక ఆ పచ్చపురుగులు తిని గిలగిలా కొట్టుకోవడం చూసి ఎంతో బాధపడుతుంటే ఆ మగ పిచ్చుక.. ఆడ పిచ్చుకతో.. **"పికిలి! ఊపిరి ఆడడం లేదు గుండెల్లో నొప్పి... అబ్బా! ప్రాణం పోయేలా ఉంది. ఆ పురుగులు తిన్నాకే తెలిసింది. ఆ పురుగుల్లో విషం ఉంది. తింటే నువ్వు చచ్చిపోతావు. విషం చిమ్ముతున్నారంతా నేల విషం, నీరు విషం, గాలి విషం...అంతా విషం.. విషం..విషం"** అంటూ నేల కూలింది. ఈ మాటలలో మనిషి ప్రకృతి మొత్తాన్ని విషమయం చేస్తున్నాడని రచయిత వల్లూరు శివప్రసాద్ వివరించారు. ఇది నాటకంలోని అత్యంత హృదయ విదారక దృశ్యం. రైతు పొలంలో పచ్చ పురుగు మందు కొట్టడం వల్ల--- పురుగులు చనిపోవడం వాటిని పిచ్చుకలు తినడం మగ పిచ్చుక నొప్పులతో కూలిపోవడం ఆడ పిచ్చుక కళ్ల ముందే మగ పిచ్చుక మరణించడం ఈ సంఘటనలో రచయిత తెలియజేసిన వాస్తవం. నిజానికి పిచ్చుకలు అంతరించి పోవడం వల్లనే పంటలకు పురుగు ఎక్కువవుతోంది. అటువంటి పరిస్థితుల్లో పక్షి జాతుల్ని పెంచాల్సింది పోయి అవి పూర్తిగా అంతరించిపోయే పరిస్థితులు కల్పిస్తున్నాం. **"ఈ భూమ్మీద జంతువులు-వృక్షాలు తగిన నిష్పత్తి ప్రకారం మనగలిగితేనే పర్యావరణ సమతౌల్యం ఉంటుంది"** (పర్యావరణాన్ని కాపాడుకుందాం- తూములూరి రాజేంద్రప్రసాద్, పుటః 38). లేదంటే ఎన్నో పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్న సత్యాన్ని ఈ నాటిక వివరిస్తుంది.



**2.3. సెల్ టవర్ -- ఆధునిక మృత్యుస్తంభం :** ఆడ పిచ్చుక బాధతో అక్కడి నుండి దూరంగా ఎగురుతూ పోతుంటే ఒక పెద్ద సెల్ టవర్ తగిలి అక్కడ ఒక మగ పిచ్చుక ప్రాణాలతో అల్లాడుతుంటే .. ఈ ఆడ పిచ్చుక... అయ్యో సోదరా ఏమయ్యింది... ఏమి నీకు ఈ దురవస్థ అని ప్రశ్నించగా ఆ మగ పిచ్చుక...**"ఏం చెప్పనే తల్లీ పిచ్చుకల మీద బ్రహ్మాస్త్రాలు అంటారు చూడు.. రాక్షసుల్లా కనిపిస్తున్న.. ఆ ఇనుప స్థంభాలు మన పాలిట యమధర్మ రాజులమ్మా! అలసట తీర్చుకొందామని ఆ స్తంభాల మీద వాలబోయాను. మంటల్లో పడ్డట్టుగా విలవిలలాడి పోయాను. మాంసపు ముద్దలా పడి పోయాను"** (పుటః 50) అని అంటుండడంలో మానవులు చరవాణి వాడకంలో ప్రకృతిని, మన లాంటి జీవులను మరచి ఈ ఇనుప స్తంభాలను నిర్మిస్తూ.. చరమ గీతం పాడుతున్నారని నేటి సమాజాన్ని వల్లూరు శివప్రసాద్ ఈనాటకంలో దృశ్యమానంచేశారు. మొబైల్ టవర్‌కు తగిలి మరణించే పిచ్చుక అత్యంత ఆధునిక కాలపు అసలైన విషాదం. మొబైల్ టవర్ రేడియేషన్ వల్ల పిచ్చుకల దిశ తప్పడం వినికిడి సమస్యలు, ఆకస్మిక మరణాలు ఇవన్నీ ప్రపంచవ్యాప్తంగా అధ్యయనాలు చెబుతున్న వాస్తవాలు. రచయిత దానిని బాలనాటకం స్థాయిలోనే చాలా సూటిగా చెప్పారు.

**2.4. ప్రపంచీకరణ ప్రభావం:** ప్రపంచీకరణతో వచ్చిన మార్పులలో పాత ఇళ్లు పోవడం, పచ్చ పంటలు తగ్గిపోవడం, కొత్త పంటలు (హైబ్రిడ్) రావడం, రసాయన మందుల వినియోగం పెరగడం కమ్యూనికేషన్ టవర్‌లు నిర్మాణం ఎక్కువయ్యాయి. ఇవి నేరుగా పిచ్చుకల జీవన పరిస్థితులను ప్రభావితం చేశాయి. ఆడ పిచ్చుక పుట్టడం నుండి పెరుగుదల వరకు ఉన్న వివరణలు పాతకాలపు పర్యావరణ సమతుల్య జీవితాన్ని ప్రతిబింబిస్తాయి. తల్లిదండ్రులు తెచ్చిన రకరకాల చిరుధాన్యాల గింజలు--- జొన్న సజ్జ రాగులు వరిగె ఇవి పిచ్చుకల సహజ ఆహార ప్రపంచం. ఈ పంటలు అంతరించడమే వారి ఆహార వ్యవస్థను కూల్చేసింది. పాత ఇళ్లు, దుంపలు, రంధ్రాలు---ఇవి చిన్న పక్షుల సహజ వసతి. ఆ పాత మనుషుల ఇల్లు చెదిరిపోవడం, బుల్డోజర్లు రావడం---పక్షుల గూళ్ళు మానవ నిర్మాణాలకు బలి కావడం – ఇది ప్రపంచీకరణ నిర్మాణాల ప్రభావాన్ని ప్రతిబింబించే చిహ్నం. పిల్ల పిచ్చుకలు గూడు కూలిపోతూ తల్లడిల్లిపోతాయి---ఇది మనిషి "అభివృద్ధి" అనే పేరుతో చేస్తున్న నిర్దయను తెలియజేస్తుంది. మానవుడు రెండు చేతులు కలిగిన జీవి. కానీ సాంకేతికత కోసం ఈ చేతులను వినియోగిస్తు న్నాడు, ప్రకృతిని రక్షించడానికి కాదనే సత్యం బోధపడుతుంది. ఈ నాటకం పిల్లలకు పర్యావరణ విద్యను అందిస్తుంది. పక్షుల నొప్పి, తల్లి--తండ్రి ప్రేమ, బిడ్డలపై మమకారం, మరణ భయం, ఆకలి రోదన ఇవన్నీ మనుషుల క్రూరతతో ఢీకొంటాయి.

**ముగింపు :** 'ఊడలు' నాటకం ఆధునిక సమాజంలో అత్యవసరంగా గుర్తించవలసిన సమస్య. ప్రకృతి దోపిడీ, కార్పొరేట్ రాజకీయాల మైత్రిని కళారూపంలో అత్యంత ప్రభావవంతంగా ప్రతిబింబిస్తుంది. ఇది కేవలం కళ కాదు; ఒక చైతన్య పిలుపు. గ్రామ జీవనాన్ని, పర్యావరణాన్ని కాపాడుకునే హక్కు కోసం ఒక ప్రజా మేనిఫెస్టో. ఈ నాటకం తెలుగు పర్యావరణ సాహిత్యంలో ఒక కీలక పాఠం. వల్లూరు శివప్రసాద్ గారి 'రెండు చేతులు' ఒక చిన్నారుల నాటకంకన్నా ఇది ఎక్కువగా పక్షుల విలాపాన్ని వ్యక్తీకరిస్తుంది. ప్రకృతిమాతకు మనిషి చేసిన ద్రోహం. పర్యావరణ పరిరక్షణకు మానవుడికి ఇచ్చిన చివరి పిలుపు. పిచ్చుకలు అంతరించడంపై తెలుగు సాహిత్యంలో ఇంత హృదయ విదారకమైన దృశ్యాలను చూపిస్తూ, ప్రపంచీకరణలో మనుషుల తప్పిదాల్ని శాస్త్రీయంగా--సున్నితంగా--నాటకీయంగా చూపించిన అద్భుత రచన ఇది.

* * *

Acknowledgements:

A Study of Ecological Perceptions in Modern Telugu Literature (2014-2024) అనే పరిశోధనలో భాగంగా సమర్పించిన వ్యాసం ఇది. ఈ ప్రాజెక్టు కాలపరిమితి ఒక సంవత్సరం.

డా.వై.సుభాషిణి
సహాయాచార్యులు, తెలుగు అధ్యయన శాఖ
శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి
&
కె.అశ్విని, అధ్యాపకులు
స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ & టెక్నాలజీ
శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి

❖ ❖ ❖ ❖ ❖

# ఆదిత్య హృదయము

## (అనుసృజిత తెలుగు 'నక్షత్ర మాల' పద్య కృతి)

రచన : డా. ఆచార్య ఫణీంద్ర
99598 82963



ప్రార్థన :

కం. భూమి పయి నిలుచు భాగ్యమ
దేమో – తద్విధి ప్రదక్షణించుచునుం దీ
వ్యోమాలయ సూర్య పరం
ధామునకు, మదీయ జన్మ ధన్యత గాంచన్!

తే.గీ. సూర్య వంశాబ్ధి పాలిట సోముడగుచు,
ధర్మమూర్తియు, శ్రీ పరంధాముడగుచు –
నా మదిని కొలువైన శ్రీరామ నామ
దేవదేవుని పాదాలె దిక్కు నాకు!

ఉ.
నా యిలవేల్పు ధర్మపురి నాథుడు నే జను మార్గమందు సు
శ్రేయము గూర్చగా సతము – సేయుదు నా నరసింహ రాట్టుకు;
న్నా యమ లక్ష్మికిన్ నిరత మంజలి ముద్రను దాల్చి స్తోత్రముల్,
పాయక నాదు చిత్తమున భక్తి సుధల్ ప్రవహించు పోలికన్!

సీ. వేలాది సంవత్సరాలకు పూర్వమే
శాస్త్రీయ విజ్ఞాన సంయుతుడయి
ఆదిత్య దేవుని యద్భుత శక్తిని
అవగాహనంబొంది, యట్టిదైన
సౌర శక్తి నదెల్ల సంఘటనమొనర్చి
విద్యుద్ఘటమ్మును వెలయ జేసి –
రాత్రుల కృత్రిమ రశ్మితో వెలిగించి,
రామచంద్రున కట్టి రవిని గూర్చి

తే.గీ. యుద్ధమం దంధకారమ్ము నుడిగి, వెలుగు
లలర – "ఆదిత్య హృదయమ్ము" ననెడి బోధ
సలిపిన మహా విబుధు "డగస్త్య ముని" గొలుతు!
అట్టి స్తోత్రమ్మున్ తెలుగునం దనుసృజింతు! … 1

సీ. రవి వంశమున దశరథ పుత్రుడై పుట్టి,
శ్రీ వశిష్ఠ మునికి శిష్యుడునయి,
కౌశిక ఋషి వెంట కదలి, యాగము గాచి,
తరలి మిథిల, శివ ధనువు విరిచి,
సీతను పెండ్లాడి క్షేమంబుగా నుండ
తల్లి కైక తెలుప తండ్రి యాజ్ఞ –
వన మేగి సతి, సోదరుని తోడ వసియింప –
సీతాపహరణమ్ము సేసినట్టి

తే.గీ. దానవుడు రావణుని కిడ దండనమ్ము –
సోదరుడు లక్ష్మణుండును, శూరులైన
ఆంజనేయ, సుగ్రీవాదు లండ నిలువ,
పోరె శ్రీరాము డా యుద్ధభూమి యడల!.. 2

సీ. భీషణ ఘోషలన్ భీకరంబుగ సాగు
రామ రావణ సమరంబు గనగ
దేవతలను గూడి దిగివచ్చిన భగవ
న్మూర్తియైన అగస్త్య ముని వరుండు –
యుద్ధమందు నలసి యున్నట్టి రావణ
దైత్య రిపుని గాంచి దయను బూని
యోచించుచున్న అయోధ్య విభుడునగు
శ్రీరామచంద్రుని జేరి పలికె –

తే. గీ. "రణమునందు సమస్త శాత్రవుల పైన
విజయ మందుట నెట్టులో వినుము రామ!
దివ్య బాహు సమేత! ఆదిత్య కులజ!
నిత్యమై వెలుగు రహస్య సత్య మిదియె!… 3

సీ. సకల శత్రువులను సమయజేసెడి స్తుతి –
సతము జపించిన జయమిడు స్తుతి –
పరమ పవిత్రమై పాపమడచు స్తుతి –
మంగళప్రదమైన మహిమల స్తుతి –
శోకోపశమనమౌ శుభదాయక స్తుతి –
క్షయమునొందని మేటి ఘనమగు స్తుతి –
ఆయుష్షునే బెంచునట్టి దివ్య స్తుతి –
"ఆదిత్య హృదయం" బటన్న స్తుతి –

ఆ.వె. రవి హృదయమునందు రాజిల్లుచున్, విశ్వ
సృజనయు, స్థితి, లయల జేయునట్టి
ఆ యనంతుని స్తుతి – "ఆదిత్య హృదయమ్ము"!
సతత మా జపంబు సలుపవలయు!.. 4



సీ. జాజ్జ్వల్య మానమౌ సత్కాంతి పుంజాల
నుదయంబు నొందుచునుండు నెవడొ -
దేవాసురుల చేత దినదినమ్మును భక్తి
వరల నమస్కరింపబడు నెవడొ -
అన్య తేజస్సుల నణగద్రొక్కు నెవండొ -
మహిత తేజస్సుతో మను నెవండొ -
భువనంబులకు నెల్ల భూభృత్తు వెవ్వాడొ -
లోకు లందరి నెప్డు సాకు నెవడొ -

తే.గీ. భవ్యముగ సముల్లసిలు నా భాస్కరునకు
లోకముల నెల్ల నేలేటిఅబ్రశ్రీ శ్రీకరునకు
సర్వ దైవ స్వరూప సద్గర్వితునకు
సిద్ధికై నిరతము పూజ సేయ వలయు!.. 5

సీ. ఈతడే బ్రహ్మయు, నీతడే విష్ణువు,
శంకరు డీతడే, స్కంధు డితడె!
ఇతడె ప్రజాపతి, యితడే మహేంద్రుండు,
నితడె కుబేరుండు, నితడె ప్రొద్దు!
సమవర్తి యీతడే, చంద్రుండు నీతడే,
వరుణ దేవు డితడె, వాయు వితడె!
పితరు లితడె, సాధ్యు లితడె, యష్ట వసువుల్,
మరుతము లీతడే, మనువు నితడె!




తే.గీ. అశ్వనీ దేవత లితడె, అగ్ని యితడె,
ప్రాణ వాయువు నీతడే, ప్రజ లితండె!
ఋతువులను నేర్పరచు దివ్య కృతి యితనిదె!
కాంతినే సృజించెడు నట్టి కర్త యితడె! .. 6

సీ. అదితి కుమారుడౌ ఆదిత్యు డీతడే!
సకలావనికి తండ్రి - సవిత యితడె!
సుజనుల మేల్కొల్పు సూర్యదేవు డితడె!
మహితాఖల గభస్తిమంతు డితడె!
ఆకాశమున సాగునట్టి ఖగ మితండె!
పుడమినే పోషించు పూషు డితడె!
దినమును నిర్మించు దినకరుం డీతడే!
బంగారు వర్ణంపు భాను డితడె!

తే.గీ. స్వర్ణ వర్ణ రేతస్సు స్రావంబు జేసి
సర్వ లోకాల వెలుగుల సాగు జేయు
కృషిక వరు డీతడె - హిరణ్య రేతసుండు!
భాగ్య దాయకుండైన దివాకరుండు! ... 7

సీ. హరిత వర్ణపు మహా హయములు గలవాడు!
వేల మయూఖాల వెలుగు వాడు!
సప్తాశ్వ రథముపై సాగిపోయెడి వాడు!
సౌఖ్యమ్ము నుత్పత్తి సల్పు వాడు!
కిరణాల భూషణాల్ ధరియించు రూపరి!
తిమిర మంతము సేయు ధీర వరుడు!
సృష్ట్యంతమున పునః సృష్టి సల్పెడి వాడు!
విశ్వమ్మునే చెక్కు విశ్వకర్మ!

ఆ.వె. అంశుమాను దగుచు నఖిల విశ్వంబులో
సకల లోక హితము సతము గూర్చి
సర్వ లోక వంద్య శాశ్వత కీర్తితో
వెలగు వాడు! సతము వెలుగు వాడు!... 8

సీ. బ్రహ్మేచ్యుత శివాంశ బ్రహ్మాండ రూపుడౌ
కైవల్యద హిరణ్య గర్భు డితడు!
శిశిర తాప మడంచి, శీఘ్రమే స్తపమును
రావింపగా జేయు రవి యితండు!
అగ్ని గర్భునిగ మధ్యాహ్నమునే తెచ్చు
అదితి మహాసాధ్వి యాత్మజుండు!
మంచుకొండల కరిగించు మహిమ గల్గి
మంచినీళ్ళ నది పారించువాడు!

తే.గీ. పగలు గడచి సాయంత్రమే పరగినంత
తాను స్వయముగా శాంతించి, తత్సమయము
నెల్ల శాంతింప జేసెడి ఇను డితండు!
కాలమును నియంత్రించెడి కర్త యితడు!.. 9

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 3 23 హైదరాబాద్ జనవరి : 2026

# తెలుగు సాహిత్య పునరుజ్జీవన ప్రదాత – సి.పి. బ్రౌన్

**డా. బాణాల భుజంగ రెడ్డి,** అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం. ఫోన్ : 7217872141

In 1825 I found Telugu literature dead, and in 30 years I rised it to life : సి. పి. బ్రౌన్

**ఉపోద్ఘాతం...**

పందొమ్మిదవ శతాబ్ది ప్రారంభం నాటికి జవజీవాలను కోల్పోయి, నిస్తేజంగా ఉన్న తెలుగు సాహిత్యానికి నూతన జవసత్వాలను కల్పించి పునర్వైభవాన్ని ప్రసాదించిన మహానుభావుడు సి.పి.బ్రౌన్. తెలుగు వాడు కాకపోయినా, తెలుగు నాడులో పుట్టకపోయినా తెలుగువారికంటే ఎక్కువగా తెలుగు భాషను ప్రేమించి, తెలుగు భాషా సాహిత్యాల అభివృద్ధిని కాంక్షించి, తెలుగు సాహిత్యాన్ని పునరుద్ధరించి వర్ధిల్ల జేసిన సి.పి.బ్రౌన్ 1798 నవంబర్ 17 వ తేదీన కలకత్తాలో ఆంగ్లేయులైన David Brown, Frances Cowley దంపతులకు జన్మించాడు. 1817 నుండి 1834 వరకూ, మళ్ళీ 1838 నుండి 1855 వరకూ (34 ఏళ్ళు) ఈస్ట్ ఇండియా కంపెనీ సివిల్ సర్వెంటుగా వివిధ హోదాలలో తెలుగు వారి మధ్య పనిచేసి తెలుగు భాషా సాహిత్యాలను నేర్చుకొని తెలుగు భాషకు వ్యాకరణాన్నీ, ఛందోగ్రంథాన్నీ ఆంగ్లంలో రాశాడు. తెలుగు వాచకాలను తయారు చేశాడు. తెలుగు ఇంగ్లీషు, ఇంగ్లీషు తెలుగు అనే బృహన్నిఘంటువులతో పాటు మిశ్రభాషా నిఘంటువూ, జిల్లా నిఘంటువూ అనే లఘు నిఘంటువులను కూర్చాడు. ఆనాటి తెలుగు భాషా సాహిత్య చరిత్రకు ఆకరాలనదగిన 20 సంపుటాల లేఖలనూ, అర్జీలనూ, పత్రికలనూ సేకరించి పదిలం చేశాడు. మెకంజీ సేకరించిన స్థానిక చరిత్ర ప్రతులను తిరగరాయించి భద్రం చేశాడు. ఈ స్థానిక చరిత్ర సంపుటాలను అధ్యయనం చేసి The Wars of Rajas, Cornatic Chronology, Memoirs of Hyder Ali and Tippu Sultan మొదలైన చరిత్ర గ్రంథాలను రాశాడు. బైబిలు, లూకా సువార్త మొదలైన క్రైస్తవ మత గ్రంథాలను తెలుగు పండితుల సహాయంతో తెలుగులోకి అనువదించాడు. వేమన పద్యాలనూ, సుమతి శతకాన్నీ, ఆంధ్రశబ్ద చింతామణినీ, అప్పకవీయాన్నీ (మూడు ఆశ్వాసాలు), కవిజనాశ్రయాన్నీ ఆంగ్లంలోకి అనువదించాడు. తెలుగు భాషా సాహిత్యాలపై వీరశైవ సాహిత్యాలపై వ్యాసాలు రాశాడు. అన్నిటికంటే ముఖ్యంగా కాలగర్భంలో కలసిపోతున్న వేలకొలది తాళపత్ర గ్రంథాలనూ, రాతప్రతులను సేకరించి, శుద్ధ ప్రతులు రాయించి, పండితులతో పరిష్కరింపజేసి, అచ్చువేయించి, వాటికి అమరత్వాన్ని ప్రసాదించాడు. 1855లో ఈస్ట్ ఇండియా కంపెనీ ఉద్యోగిగా పదవీ విరమణ చేసి, ఇంగ్లండుకు వెళ్ళిపోయాడు. అక్కడ కూడా తాను కూర్చిన నిఘంటువులకూ, వ్యాకరణానికీ, బైబిలు అనువాదాలకూ



మార్పులూ చేర్పులూ చేస్తూ, లండను యూనివర్సిటీలో తెలుగు ప్రొఫెసరుగా, ఇండియన్ సివిల్ సర్వీస్ తెలుగు పరీక్షాధికారిగా తెలుగు భాషకు సేవ చేస్తూ 1884, డిసెంబరు 12న అమరుడయ్యాడు.

**వ్యాస పరిధి**

సి.పి.బ్రౌన్ చేసిన ఈ కృషినంతా కాలక్రమంలో కాకుండా విషయాన్ని బట్టి ఐదు వర్గాలుగా విభజించవచ్చు. అవి

**1. తెలుగు భాషా బోధన/అభ్యసన ఉపకరణాలు...** 1. వాచకాలు, 2. వ్యాకరణం, 3. నిఘంటువులు, 4. ఛందస్సు.

**2. గ్రంథ పరిష్కరణ...** 1. సేకరణ, 2. పాఠ పరిష్కరణ, 3. వ్యాఖ్యానాలు, 4. ముద్రణ

**3. అనువాదాలు...** 1. కావ్యానువాదాలు, 2. వ్యాకరణానువాదాలు, 3. బైబిలు అనువాదాలు

**4. వ్యాసాలు**

**5. చరిత్ర గ్రంథాలు...** 1. జీవిత చరిత్ర, 2. దేశ చరిత్ర

బ్రౌన్ చేసిన ఈ అపారమైన కృషినంతా విపులంగా వివరించడం ఈ చిన్న వ్యాసంలో సాధ్యం కాదు కాబట్టి, పైన తెలిపిన మొదటి రెండు అంశాలకు మాత్రమే పరిమితమై ఆయా రచనల్లో, గ్రంథ పరిష్కరణలో ఆయన అనుసరించిన నూతన పోకడలనూ, శాస్త్రీయ విధానాలనూ రేఖామాత్రంగా వివరించడమే ఈ వ్యాసం ఉద్దేశం.

**1. వాచకాలు**

ఆంగ్లేయులు తెలుగు నేర్చుకోవడం కోసం The Telugu Reader (1852) అనే వాచకాన్ని రాశాడు. ఈ వాచకంలో కావ్యభాషకు బదులుగా వాడుక భాషలో రాయబడిన లేఖలనూ, అర్జీలనూ, వాటి ఆంగ్లానువాదాలనూ, వ్యాకరణ వివరణలనూ

ఇచ్చాడు. దీనికి చివర ఒక లఘు నిఘంటువును అనుబంధంగా ఇచ్చాడు. ఈ వాచకమే గాక Vakyavali or Exercises: English and Telugu (1852), Dialogues in English for the use of learners with a grammatical analysis (1841) అనే వాచకాలను కూడా ఆయన రాశాడు. ఈ వాచకాల్లో వాడుక భాషకు ప్రాధాన్యమిచ్చి ఆనాడే వాడుక భాషా ఉద్యమానికి అంకురార్పణ చేశాడు. ఈ సందర్భంలో తెలుగు భాషా బోధన/ అభ్యసన విధానాల్లోని అశాస్త్రీయతపై వేరువేరు చోట్ల ఆయన వెలుబుచ్చిన అభిప్రాయాలను తెలిపి ఆయన తన వాచకాల ద్వారా ప్రవేశ పెట్టిన శాస్త్రీయ విద్యావిధానాన్ని చూద్దాం. విద్యార్థులను తెలుగు పండితులు సాధారణమైన సంభాషణలూ, కథలూ, లేఖలూ, ఆర్జీలకు బదులుగా భాగవతం, రామాయణం, మహాభారతంలోని కొన్ని ఆశ్వాసాలను చదవమంటారనీ, అమరకోశాన్నీ, ఆంధ్రభాషా భూషణాన్నీ, నన్నయ భట్టీయాన్నీ, అప్పకవీయాన్నీ, 'వల్లె' వేయమంటారనీ, దీనివల్ల విద్యార్థులు నిస్పృహకు గురవుతున్నారనీ ఆయన అన్నాడు. అంతేగాక హిందూ పండితులు చైనా వ్యాకర్తల్లాగా వాడుక భాషను నిర్లక్ష్యం చేసి అది విద్యార్థులకు తెలిసే ఉంటుందని కావ్యభాషను, సంస్కృతాన్ని బోధించడానికి ఇష్టపడతారు గాని, వాడుక భాషను చెప్పడానికి ఆసక్తి చూపరనీ, కింది మెట్టు ఎక్కకుండా పై మెట్టు ఎలా ఎక్కగలమనీ బ్రౌన్ ప్రశ్నించారు (Brown ... : ii-v). అందుకే తాను తక్కువ స్థాయి మాండలికం నుంచి ఎక్కువ స్థాయి మాండలికానికి విద్యార్థిని కొనిపోయే కొత్త వాచకాలను తయారు చేశానన్నాడు. (Brown... : 60). ఆయనే మరోచోట పండితులు నన్ను ఛందస్సులో రాయబడిన పదజాలాన్ని భట్టీ పట్టమన్నారు. కానీ నేను తిరస్కరించాను. పాశ్చాత్య పద్ధతి అధ్యయనానికి ప్రాధాన్యం ఇచ్చానన్నాడు (Brown ...: 33).

**2. వ్యాకరణం**

1840 లో బ్రౌన్ A Grammar of the Telugu Language అనే గ్రంథాన్ని ఆంగ్లంలో రాశాడు. దీన్ని 1857 లో రివైజ్ చేశాడు. ఆనాటికే బ్రౌన్ కు వ్యాకరణం ఎలా ఉండాలనే విషయంలో స్పష్టమైన అభిప్రాయాలున్నాయి. ఆంగ్ల వ్యాకరణాలు లాటిన్ వ్యాకరణ పద్ధతిలో రాయబడినట్లుగా తెలుగు వ్యాకరణాలన్నీ సంస్కృత వ్యాకరణ పద్ధతిలో రాయబడ్డాయనీ, ఈ రెండు భాషలు పూర్తిగా వేరనీ దేశీయ పండితులకు **"తెలుగు భాషకు తల్లి సంస్కృతమే"** అనే మాట ఇష్టమనీ, కానీ ఇది తెలుగు భాష ఉత్పత్తికి సంబంధించినది కాదనీ, తెలుగు కేవలం సంస్కృతం మీద ఆధారపడిందనీ బ్రౌన్ అన్నారు. (Brown...... 1857: vi) తెలుగు వ్యాకరణాలు ఎలా ఉండాలో ఆయనే మరోచోట ఇలా చెప్పారు. It is to be hoped that a Telugu Grammar may eventuvally be written for the use of natives, in a plain and Intelligible manner free from the adherence to the Sanscrit system, and clear to the ordinary reader nH •sÁT (Brown 182791). **"ప్రయోగశరణం వ్యాకరణం"** అనే ఉక్తికి అనుగుణంగా వ్యాకరణం ఉండాలన్నది ఆయన అభిప్రాయం. కొందరు తన వ్యాకరణాన్ని సులభీకరించమని కోరగా ఆయన **"కవుల చేత మాత్రమే నూతన వ్యక్తీకరణలు సృష్టించబడతాయి, అవి కూడా అన్ని సందర్భాల్లో వ్యాప్తిలోకి రావు, కేవలం ఉన్నవాటికి పరిశీలించి నమోదు చేసి, కూర్చి, వాస్తవాలను వివరించడం, నా ప్రకటనలకు రుజువులు చూపించే కొటేషన్లు ఇవ్వడమే నా పని"** అని అన్నాడు (Brown 1857: vi). దేశీయ వ్యాకర్తలు వాడుక భాషా పదాలను వ్యతిరేకిస్తారు. నిర్లక్ష్యం చేస్తారు. వాటిని గ్రామ్యం (Vulgar) భావిస్తారు. కానీ, గొప్ప చయితల రచనల్లో కూడా వాడుక మాటలు ఉంటాయి. కాబట్టి, వ్యాకరణంలో వాడుకభాషను కూడా పరిగణించాలనీ ఆయన అభిప్రాయపడ్డారు. బ్రౌన్ తన వ్యాకరణంలో చెప్పిన ఈ కింది విశేషాలను గమనించండి.

1. కొన్ని సమాసాల్లో, సంయుక్త క్రియల్లోని పరుషాలు సరళాలుగా మారుతాయి (సరళాదేశం, గసడదవాదేశం). కానీ, సరళాలు పరుషాలుగా మారవు.

2. స్త్రీ అనే పదాన్ని ఉచ్చరించేటప్పుడు ముందు పంక్తిలో ఉన్న హల్లును ఉచ్చరించాలి. తరువాత పంక్తి కింద ఉండే హల్లు / హల్లులను, ఆ తర్వాత పంక్తి పైన ఉండే అచ్చును ఉచ్చరించాలి.

3. సున్న మొదటి నాలుగు వర్గాక్షరాలకు పూర్వం వచ్చినపుడు 'న్' గా ఉచ్చరించబడుతుంది.

ఉదా : కింద, గ్రంథం, అంగం. చివరి వర్గాక్షరాలకు (పఫబభమ) పూర్వం వచ్చినపుడు 'న్' గా ఉచ్చరించబడుతుంది. ఉదా : గంప అంబ. యకారానికి పూర్వం వచ్చినపుడు అర్ధానుస్వారం లాగా ఉచ్చరించబడుతుంది. ఉదా: సంయమి, సంయోగం.

4. దంత్య తాలవ్య చజలు సంస్కృత పదాల్లో రావు.

5. " ఎప్పుడూ ఒంటరిగా రాదు. 'జ' కిందనే వస్తుంది.

6. శకట రేఫ (ఱ), అరసున్న (ఁ) వ్యవహార భ్రష్టమయ్యాయి. వాటిని ఉపయోగించడం వృథా.

7. 'హ' కారం కొన్ని సార్లు 'ఫ' గా ఉచ్చరించబడుతుంది. ఉదా : జిహ్వ (jihva Pronounced jifva), కొన్ని సార్లు పదంలో హకారం స్థానమార్పిడి పొందుతుంది. ఉదా: బ్రహ్మ Brahma - Bramha గా ఉచ్చరించబడుతుంది.

8. 'హ' కారంపై అచ్చులేనప్పుడు దాన్ని విసర్గ (ః)తో సూచిస్తారు. ఉదా: రామః (Ramah).

9. 'శ'కారం కేవలం సంస్కృత పదాలకు మాత్రమే పరిమితమైనది. తెలుగు పదాలనుండి దీన్ని తొలగించాలని, పండితులంటారు. కానీ ఈ విషయంలో ప్రజాభిప్రాయం ఇందుకు వ్యతిరేకంగా ఉంది. ఈ

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 3  హైదరాబాద్ జనవరి : 2026

విషయంలో ప్రజల వాడుకే మార్గదర్శి. చేశి–చేసి, వ్రాశిన–వ్రాసిన (ఆ కాలంలో ఈ పదాల్లో శకారాన్ని ఉచ్చరించేవారని, బ్రౌన్ వాక్యాలను బట్టి మనకు తెలుస్తుంది.)

10. దుఃఖం (duhkam) దుఖం (dukham) గా ఉచ్చరించ బడుతుంది.

**నిఘంటువులు**

తెలుగునాడులో బ్రౌన్కు బాగా పేరు తెచ్చి పెట్టినవి ఆయన కూర్చిన తెలుగు ఇంగ్లీషు (1852), ఇంగ్లీషు తెలుగు (1853), మిశ్ర భాషా నిఘంటువు (1854)ను తెలుగు – ఇంగ్లీషు నిఘంటువు లో భాగంగానే (అనుబంధంగా) అనే ఆయన భావించాడు. జిల్లా నిఘంటువు (1854), ఆ తరువాత Wilson కూర్చిన Glossary of Judicial and Revenue Terms అనే నిఘంటువులో కల్సిపోయింది. బ్రౌన్ తాను కూర్చిన బృహన్నిఘంటువులలో కొన్ని నూతన విషయాలు ప్రవేశపెట్టారు. ఆరోపాల ఎంపికలోనూ, అర్థ వివరణలోనూ, శాస్త్రీయ పద్ధతులను అనుసరించారు. ఆయన తన నిఘంటువులో ఎక్కడా కల్పిత పదాలనుగానీ, అర్థాలనుగానీ ఇవ్వలేదు. పదాలను సృష్టించడం తేలికే కానీ, ఏ విదేశీయుడికీ వాటికి వ్యాప్తిని కల్గించే శక్తి లేదు. భారతీయ భాషలను మార్చగలను, అభివృద్ధి చేయగలను అనే భ్రమ ఉన్నటువంటి వాణ్ణి కాను అని ఆయన అన్నారు (Brown 2000:x). హిందుస్తానీ, ఇంగ్లీషు లాంటి అన్యదేశ్యాలను ఇచ్చినా వాడుకలో లేని పదాలను ఆయన ఆరోపాలుగా ఇవ్వలేదు. కావ్యభాషలోని పదాలకు అర్థ వివరణలో కావ్య ప్రయోగాలను, విరివిగా ఇవ్వడం బ్రౌన్ ప్రవేశ పెట్టిన నూతన ఒరవడి. రెండువందల పైచిలుకు కవుల రచనల్లోంచి ఆయన కావ్య ప్రయోగాలు ఇచ్చారు. కొన్ని పదాల అర్థ వివరణకు సమకాలిక రచనల్లోంచి, నాటి పత్రికల్లోంచి కూడా ప్రమాణాలను ఇచ్చారు. (వీరభద్రరావు 1988: 346)

కొన్ని నిఘంటువుల్లో అర్థాలను వివరించడం కష్టమైన పదాలను వదిలేశారు. కానీ ఇలా వదిలేయడం పాఠకులకు అన్యాయం చేయడమే అని బ్రౌన్ అన్నాడు (Brown 2000: viii). కఠినమైన పదాలకు అర్థాలు తెలియకపోతే ఆయన పండితులకు ఉత్తరాలు రాసి తెలుసుకునేవాడు. పండితులు చెప్పిన అర్థాలను కూడా గుడ్డిగా నమ్మేవారు కాదు. కొన్ని వృత్తిపదాల అర్థాల కోసం గ్రామాలకు వెళ్ళి, ఆయా వృత్తికారులను అడిగి తెలుసుకునేవాడు (బంగోరె 1977:...). కొన్ని పదాలకు సామెతల, చాటువుల సహాయంతో అర్థ నిర్ణయం చేసేవాడు. కొన్ని మొక్కల పేర్లను ఇతర నిఘంటువులలో లాగా 'ఒక వృక్ష విశేషము' అని కాకుండా నాటి శాస్త్రీయ నామాలను ఇచ్చాడు. ఆరోపాల ఎంపికకూ, అర్థ వివరణకూ ఇతర నిఘంటువులపై ఆధారపడినా ఎక్కువగా కావ్య పఠనం ద్వారానే సేకరించాడు. అసలు ఆయన నిఘంటువులే వేమన పద్యాలకు అర్థాలను వెతకడంతో ప్రారంభమయ్యాయి. బఱ్ఱె, గేదె, ఎనుము లాంటి మాండలిక భేదాలను కూడా బ్రౌన్ ఆనాడే సేకరించి తన నిఘంటువులో ఇచ్చాడు. తల్లి, తండ్రి అనే సామాన్య పదాలకు కూడా వ్యుత్పత్తిని చెప్పడం ఆయన సూక్ష్మ పరిశీలనకు నిదర్శనం (Brown 1999:v). జీవద్భాషలో మార్పులు సహజం అని గ్రహించినవాడు కాబట్టి ఆయన తన జీవితాంతం వాటిలో మార్పులూ, చేర్పులూ చేస్తూనే ఉన్నాడు. అన్నిటికంటే ముఖ్యమైనది తన రెండు బృహన్నిఘంటువులను పూర్తిగా ఆయన స్వదస్తూరితో రాశాడు. (బంగోరె 1977:66) ఛందస్సు వేమన పద్యాలను ఆంగ్లంలోకి అనువదిస్తున్న తరుణంలో ఆ పద్యాల తాళపత్రాల్లో పాఠభేదాలు ఉండడం, కొన్ని పద్యపాదాలు శిథిలమైపోవడం, ప్రక్షిప్తాలుండడం, లేఖక దోషాలుండడం వంటి సమస్యలు The Prosody of the Telugu and Sanscrit Languages Explained (ఆంధ్ర గీర్వాణ ఛందము) అనే


A GRAMMAR
OF THE
TELUGU LANGUAGE
BY
CHARLES PHILIP BROWN,
SECOND EDITION.
Much Enlarged and Improved.
MADRAS:


REMEMBERING A LUMINARY: A photograph of the legendary British Collector of Kadapa, C.P.Brown (sitting middle), taken about 175 years ago during his visit to Gurramkonda in Chittoor district.

గ్రంథ రచనకు పురికొల్పాయి. ఛందోజ్ఞానంతో ఈ దోషాలను పరిష్కరించవచ్చనే ఉద్దేశంతో ఆయన ఈ గ్రంథం రాశాడు. 1827లో దీన్ని మొదటి సారి అచ్చువేయించాడు. ఈ గ్రంథంలో తెలుగు సంస్కృత ఛందస్సులను పోల్చి ఆయన తెలుగులో తులనాత్మక పరిశోధనకు ఆద్యుడయ్యాడు. (G.N. Reddy 1977:vi). తెలుగు – సంస్కృత ఛందస్సులను గ్రీకు లాటిన్ ఛందస్సులతో పోల్చి ఆయన బహుభాషా జ్ఞానాన్ని నిరూపించుకున్నాడు. సంస్కృతంలోని ద్వ్యక్షర గణాలనూ, త్ర్యక్షర గణాలనూ గ్రీకులోని ద్వ్యక్షర, త్ర్యక్షర గణాలతో పోల్చుతూ పట్టిక ఇచ్చాడు (Brown 1977:11). తెలుగులోని కందపద్యం, సంస్కృతంలోని ఆర్యాగీతి భేదమేనని తెలిపాడు.

**2. గ్రంథ పరిష్కరణ**

**1.గ్రంథ సేకరణ** బ్రౌన్ 1825 లో వేమన పద్యాలను చదివేటప్పుడు తెలుగులో ఒక ముద్రితప్రతిగానీ, శుద్ధప్రతిగానీ లేవు. ఉన్న తాళపత్రాలు కూడా నశించిపోయే స్థితిలో ఉన్నాయి. మనుచరిత్ర ఆరు ఆశ్వాసాల్లో మొదటి మూడు ఆశ్వాసాలు విరివిగా లభించాయి. కానీ చివరి మూడు ఆశ్వాసాల నాలుగు ప్రతులు సేకరించడానికి ఎంతో కష్టమైంది అన్నారాయన (Brown 1978: 78). బ్రాహ్మణులు తమ గ్రంథాలను ఇతరులకు ఇవ్వడానికి ఇష్టపడేవారు కాదు. కానీ, మర్యాద పూర్వకంగా అడిగి సేకరించే వాడిని. అది ఎంత పవిత్రమైనదైనా, ఎంత రహస్యమైనదైనా. వాళ్ళ దగ్గర డబ్బు పనిచేయదు. కానీ చెప్పిన సమయానికి తిరిగి ఇచ్చేట్లయితే తమ గ్రంథాలు ఇచ్చేవారు. ఆకాలంలో గ్రంథాలు ఎక్కువగా రాజులూ, జమీందార్లూ, దుబాసీలూ, కరణాలూ, వకీళ్ళూ మొదలైన గొప్పవాళ్ళ ఇళ్ళల్లో ఉండేవి. వాళ్ళ వివరాలను సేకరించి వాళ్ళ వద్ద నుంచి మిత్రుల ద్వారా వాటిని సంపాదించేవాడు. కంపెనీ ఉద్యోగులకు లేఖలు రాసి తెప్పించుకునేవారు. మచిలీపట్నంలో ఒక గృహిణి అమ్మజూపిన గ్రంథాలను అప్పట్లోనే 370 రూపాయలు ఇచ్చి కొన్నారు. అలాగే రాజమండ్రిలోని ఒక న్యాయవాది గ్రంథాలయాన్ని మొత్తం కొన్నాడట (ఇంకా వివరాలకు చూ. ఆరుద్ర 1990:172-177. పద్మావతి 1986: 28, 29). ఆరోజుల్లోనే 30,000 రూపాయల సొంత డబ్బును ఖర్చు పెట్టి సేకరించిన 2440 తాళపత్ర గ్రంథాలనూ, రాతప్రతులనూ 1855లో ఇంగ్లండుకు వెళ్ళేముందు మద్రాసు ప్రాచ్య లిఖిత భాండాగారానికి దానం చేశాడు. అలాగే తాను సేకరించిన 20 సంపుటాల లేఖలనూ, అర్జీలనూ, పత్రికలనూ కూడా ఆ భాండాగారానికి దానం చేశాడు. (బ్రౌన్ సేకరించిన ఈ లేఖలూ, అర్జీలూ, పత్రికలూ తెలుగు భాష, సాహిత్య చరిత్ర పరిశోధనకు గనులు. ఈ గనుల్లోంచి బంగోరె బ్రౌన్ జాబులు: తెలుగు జర్నలిజం చరిత్ర (1973), బ్రౌను జాబుల్లో స్థానిక చరిత్ర శకలాలు: కడప జాబుల సంకలనం (1977 డిసెంబర్), బ్రౌన్ లేఖలు ఆధునికాంధ్ర సాహిత్య చరిత్ర శకలాలు అనే రత్నాలను వెలికి తీశారు. ఇంకా ఎన్నో రత్నాలను వీటినుంచి వెలికి తీయవచ్చు.)

**పాఠ పరిష్కరణ...**

బ్రౌన్ సేకరించిన తాళపత్రాల్లో శిథిల భాగాలూ, ప్రక్షిప్తాలూ, పాఠ భేదాలూ, లేఖక దోషాలూ ఉండేవి. రాయసగాళ్ళను నియమించి మొదట తాళపత్రాలను తెల్లకాగితాలపై ఎత్తిరాయించేవాడు. ఎప్పుడూ పది నుండి ఇరవై మందికి తగ్గకుండా తెలుగు పండితులకు జీతాలిచ్చి, వారిచేత పాఠ భేదాలను పరిష్కరింపచేసి శుద్ధ ప్రతిని తయారు చేయించేవారు. మొదట్లో ఈ పండితులు పాఠంలోని లోపాలను తమకు తోచిన విధంగా దిద్దేవారు. కానీ, బ్రౌన్ Lambinus, Erasmus, Heinsius, Casaubon, Kennicott మొదలైన పండితుల పాఠ పరిష్కరణ పద్ధతిని చదివి ఆ పద్ధతుల్లో తెలుగు గ్రంథాలను పరిష్కరింపచేశాడు. ఇటలీ, జర్మనీ దేశీయుల గ్రంథ పరిష్కరణ పద్ధతిని ఆయన తెలుగులో తొలిసారిగా ప్రవేశ పెట్టారు. నేటికీ గ్రంథ పరిష్కరణలో ఆయన పద్ధతులనే తెలుగువారు అనుసరించడం విశేషం.

**వ్యాఖ్యానాలు...**

**'పాఠ పరిష్కరణ సమయంలో పదాలకు గానీ, పద్యానికి గానీ అర్థ నిర్ణయంలో సందేహం వస్తే అక్కడి పండితుల మధ్య చర్చ జరిగేది. అట్లా జరిగిన చర్చనంతా బ్రౌన్ రికార్డ్ చేయించేవాడు. ఈ రికార్డులే వ్యాఖ్యానాలకు దారితీశాయి. సంస్కృత కావ్యాలను చదవడానికి వ్యాఖ్యానాలు లభించేవి. కాని ఆయనకు తెలుగులో రెండు మాత్రమే లభించాయి. ఇవి పాఠకునికి ఉపయోగపడడం కంటే వ్యాఖ్యాత పాండిత్యాన్ని ప్రదర్శించడానికే ఎక్కువ ఉపయోగపడే విధంగా ఉన్నాయి'** (Brown 1978:39) అని బ్రౌన్ పేర్కొన్నారు. ఇట్లా పండితులకే పరిమితమైన తెలుగు కావ్యాలు పామరులకు కూడా అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో వాటికి ఆయన వాడుక భాషలో వ్యాఖ్యానాలు రాయించాడు. వసుచరిత్రకు ముందుగా ములుపాక బుచ్చయ్య శాస్త్రిచేత వ్యాఖ్యానాలు రాయించిన బ్రౌన్, అది కఠినంగా ఉందని భావించి, మళ్ళీ జూలూరి అప్పయ్య చేత సులభమైన వ్యావహారిక భాషలో వ్యాఖ్యానం రాయించాడు. ఇది ఆయన వాడుక భాషకు ఇచ్చిన ప్రాధాన్యానికి నిదర్శనం. మనుచరిత్ర, కళాపూర్ణోదయం, ఆముక్త మాల్యద, కవికర్ణ రసాయనం, రాఘవ పాండవీయం, విజయవిలాసం మొదలైన కావ్యాలకు ఆయన వ్యాఖ్యానాలు రాయించాడు. (ఇంకా వివరాలకు చూ. ఆరుద్ర 1990: అనుబంధం.)

**ముద్రణ...**

సి.పి. బ్రౌన్ కంటే ముందు విలియం బ్రౌన్, కాంబెల్ మొదలైన వారి గ్రంథాలు అచ్చయినప్పటికీ తెలుగు నాడులో ముద్రణను అభివృద్ధి చేసిన ఘనత బ్రౌన్‌దే. తెలుగులో అచ్చయిన మొట్టమొదటి కావ్యం ఆయన అనువదించిన వేమన పద్యాలు (The Verses of Vemana). ఇది 1829 లో అచ్చయింది. అంతకు పూర్వం తాళపత్రాల్లో పదాలన్నీ గొలుసుకట్టు లాగా ఉండేవి. పాదాల మధ్య / వాక్యాల మధ్య చోటు ఉండేది కాదు. విరామ చిహ్నాలు ఉండేవి కావు. పద్య సంఖ్య గానీ, ఆశ్వాస విభజన గానీ, అవతారికా విభాగం గానీ ఉండేవి కావు. 1827 లో బ్రౌన్ ప్రచురించిన ఆంధ్ర గీర్వాణ ఛందంలో ఆయన మొదటిసారిగా పద్యానికి పాద విభజన చేసి, నక్షత్రపు గుర్తుతో యతిస్థానాన్ని సూచించి అచ్చు వేశారు. వేమన పద్యాల గ్రంథంలో పద్య సంఖ్య వేసి ప్రచురించారు. ఆ తర్వాత ప్రచురించిన ఆంధ్ర మహాభారతాది గ్రంథాల్లో ఆశ్వాస విభజన, కథా సంగ్రహం, ఉపాఖ్యానాల పేర్లు, మొదలైన ముద్రణా పద్ధతులను

ఆయన వెలుగులోకి తెచ్చారు. ముద్రణలో హల్లుల కింద రాసే 'ౘావడి'ని ముద్రించడం కష్టంగా ఉండడం వల్ల దానికి బదులుగా ' ' అనే గుర్తును ఆయన ప్రవేశపెట్టాడు. ఈ గుర్తునే ఆనాడు 'బ్రౌన్ రకారం' అనేవారు (వీరభద్రరావు 1986 :). పుస్తక ప్రచురణ విరివిగా జరిగితే తప్ప తెలుగు సాహిత్యం అభివృద్ధి చెందదని భావించిన బ్రౌన్ ముద్రాపకులను ప్రోత్సహించాడు. కొన్ని వేల రూపాయలు ఖర్చు చేసి సేకరించి పరిష్కరింపజేసి తయారు చేసిన శుద్ధ ప్రతులను ముద్రాపకులకు ఉచితంగా ఇచ్చి, తాను నష్టపోయినా, తెలుగు కావ్యాలు విరివిగా అచ్చు కావడం చూసి '.. I lost the sum I expended: but I looked for this result and was satisfied (Brown 1978: 62) అని సంతోషించిన మహానుభావుడు బ్రౌన్. కొత్తపల్లి వీరభద్రరావు గారు అన్నట్లు **'కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు'** అనే గీతావాక్యానికింత కంటే మంచి ఉదాహరణ ఎక్కడ లభించును? (వీరభద్రరావు 1988:158). విదేశీయుడైనా తెలుగు భాషకు ఇంత నిస్వార్థంగా సేవ చేసిన బ్రౌన్ ఋణం ఎలా తీర్చుకోవాలి? వర్తమాన తరంగిణిలో ఆ పత్రికా సంపాదకుడు చెప్పినట్లు **"...యీ మహోపకారుని మనమున్నూ మన కుటుంబాల వారున్నూ అహోరాత్రముల యందు సువిశేషమైన వాక్యముల చేత తలంచుచుండవలెను"** (బంగోరె 1973:101), అంతకంటే ముఖ్యమైనది జి.ఎన్.రెడ్డిగారు చెప్పిన ఈ కింది మాట: The best tribut that the Telugu people could pay Brown and a fitting memorial that they could think of raising for him is to continue the great fredition he established and to carry on research along the avenues he opend up in the Telugu studies (G.N. Reddy 1977: )

**ఉపయుక్త గ్రంథాలు :**

1. బంగోరె. అక్టోబర్, 1973. బ్రౌన్ జాబులు: తెలుగు జర్నలిజం చరిత్ర (1835 నుంచి 1857 వరకు). నెల్లూరు: బంగోరె

2. బంగోరె. డిసెంబర్, 1977. బ్రౌను జాబుల్లో స్థానిక చరిత్ర శకలాలు : కడప జాబుల సంకలనం. తిరుపతి: శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం.

3. Brown, Charless philip. 1981. Second edition A Grammar of The Telugu Language. New Delhi: Asian Educational Series.

4. పద్మావతి, ఆర్. మే, 1986. బ్రౌను - తెలుగు కావ్య సముద్ధరణము. తిరుపతి: నవ్య పరిశోధన ప్రచురణ.

❖ ❖ ❖ ❖ ❖

## తరగతిలో బల్ల

తరగతిలో అడుగు పెట్టిన
మొదటిసారి లోపలికి రమ్మని
తన ఒళ్లో కూర్చోబెట్టుకున్న
నా మొదటి స్నేహితురాలు...

ప్రతిరోజు నడుస్తూనో.. బస్సులోనో
ప్రయాణం చేసొచ్చిన నేను
చివరికి చేరే గమ్యం తనే కదా...

సెలవులున్నప్పుడో, ఆలస్యమైనప్పుడో
ఒంటరిగా ఉంటూ... నాకోసం ఎదురుచూపుల్లో
కాలంగడిపిన .. రోజులెన్నో తనకి..

గురువు చెప్పిన పాఠాలను
శ్రద్ధగా వినాలని, గంటల తరబడి
నన్ను మోస్తూ కూర్చుంటుంది.

అమ్మ పొట్టలోంచి వచ్చిన నన్ను
మట్టి పొరల్లోంచి వచ్చిన
తను మళ్ళీ మళ్ళీ మోస్తుంది ఇక్కడ...

తరగతిలో ఆప్తమిత్రులు నాకెందరున్నా
ఖనిజ సంపదైన నా
పుస్తకాల సంచి చెయ్యి జారేది
తన మీద నమ్మకం తోనే ...




తనను విడి వెళ్ళి
ఎప్పుడైతో తిరిగి వస్తానో
అప్పుడప్పుడూ
కొన్ని దెబ్బలు తగిలించి
నోటినిండా "అమ్మా" అని పిలిపించుకుంటుంది..



తరతరాలుగా
తను ఎందర్ని మోస్తున్నా
ఈ తరంలో నేనే నట
ఈ ఆసనానికి యువరాణిని...

పి. సువర్ణ
81793 19902

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 3  హైదరాబాద్ జనవరి : 2026

# సప్త పది...!

డా. గన్నోజు శ్రీనివాసాచారి
ఫోన్ : 8555 899 493

మేలిమి
తాలిమి

మానవసంబంధాలలో
ఉండాలెప్పుడు
మిత్రుత్వభావనల
మనముల
మాలిమి!

కాలము
చేలము

పెళ్ళైన తర్వాత
కోర్కెలకు భార్యదే
గాలము!

నెగ్గాలి
తగ్గాలి

ఆటల్లో విజయం
సాధించిన వినమ్రతతో
తలొగ్గాలి!

సిద్ధాంతాలు
రాద్ధాంతాలు

ప్రతీది నెగ్గాలంటే
ఉండకూడదు
ఎవ్వరికి పంతాలు!

కారుణ్యమే
కార్పణ్యమే

ఎప్పుడు ఏది
చూయించాలో
తెలియకుంటే
దానవుల
కీకారణ్యమే!

అరుణ
తరుణ

బీదసాదలపై మనస్సుల్లో
ఉండాలి ఆదరించే
కరుణ!

మాటలు
పాటలు

రక్తశుద్ధికి వంటకాలలో
వాడితే ఆరోగ్యదాయినీ
టమాటలు!








# శిలాక్షరం

(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.

సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి




సంప్రదించండి.
మూసీ మాసపత్రిక

# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్: 934 7971177

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 3  హైదరాబాద్ జనవరి : 2026

# తెలుగు సాహిత్య పరిశోధన – విషయ విశ్లేషణ పద్ధతి

**ఆచార్య వెంకటరామయ్య గంపా,** భారతీయ భాషలు మరియు అధ్యయన శాఖ, ఢిల్లీవిశ్వవిద్యాలయం.
ఫోన్ : 9958607789

తెలుగు సాహిత్యంలో పరిశోధనల సంఖ్య ఎంత విస్తృతంగా పెరుగుతుందో, ప్రామాణికత అంతే స్థాయిలో తగ్గుతుంది. ఇందుకు కారణాలు చాలా ఉన్నాయి. అన్ని విశ్వవిద్యాలయాల వారికి అంగీకారయోగ్యమైన, కాలానుగుణమైన మార్పులతో కూడిన ఆమోద యోగ్యమైన 'తెలుగు పరిశోధన పద్ధతులు' పై పుస్తకాలు కొన్ని ఉన్నప్పటికీ, వాటిని విశ్వవిద్యాలయాల వారు పూర్తిస్థాయిలో అనుసరించడం లేదు. దానితో తెలుగు పరిశోధనల మధ్య అనేక వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. ఇతర భాషలలో మాత్రం ఎప్పటికప్పుడు పరిశోధన పద్ధతులలో మార్పులు జరుగుతున్నాయి. కొన్ని సంస్థల వారు చేస్తున్న చేర్పులను చాలావరకు ఇతర భాషలవారు అంగీకరిస్తున్నారు కాని తెలుగులో అది జరగడం లేదు. ఇదివరకు తెలుగులో వచ్చిన పుస్తకాలలో ఉన్న సమాచారంతో పాటు ఆంగ్లంలో వస్తున్న మార్పులను గమనిస్తూ మనం ఇప్పుడు కొత్తగా పరిశోధన పద్ధతులను నిర్మించుకోవాల్సిన అవసరం ఉన్నది. దానికోసం మూసీ మాసపత్రిక తనవంతు బాధ్యతగా ఒక ప్రయత్నాన్ని మొదలుపెట్టింది. ప్రతి వ్యాసాన్ని పాఠకులు చదివిన వెంటనే ఇంకేమైనా మార్పులు, చేర్పులు అవసరం అనుకుంటే మాకు తెలియజేయ మనవి. **చర్చను కూడా స్వాగతిస్తున్నాం.** **– సంపాదకులు.**

పరిశోధన రంగంలో, ముఖ్యంగా సామాజిక శాస్త్రాలు, సమాచార అధ్యయనాలలో, విషయ విశ్లేషణ అనేది సమర్థవంతమైన, అత్యంత ఉపయోగకరమైన పరిశోధన పద్ధతి. ప్రస్తుత సమాజం సమాచారంతో, సందేశాలతో నిండి ఉంది. పత్రికలు, టీవీ కార్యక్రమాలు, సామాజిక మాధ్యమాల పోస్టులు, ప్రభుత్వ పత్రాలు (Documents), ప్రసంగాలు--- ఇవన్నీ సందేశాలే. ఈ సందేశాలను క్రమబద్ధంగా, లక్ష్యంతో విశ్లేషించి, వాటి వెనుక ఉన్న అర్థాలను, పోకడలను, ఉద్దేశాలను అర్థం చేసుకోవడానికి పరిశోధకులకు విషయ విశ్లేషణ సహాయపడుతుంది. క్లుప్తంగా చెప్పాలంటే, విషయ విశ్లేషణ అంటే **'అంశం ఏమిటి, ఎవరు, ఎవరి కోసం, ఏ లక్ష్యంతో ఒక సందేశాన్ని ఇచ్చారో తెలుసుకోవడానికి, ఆ సందేశాన్ని శాస్త్రీయంగా పరిశీలించడం'**. ఈ పద్ధతిని వివిధ విభాగాలకు, శాస్త్రాలకు అన్వయం చేయవచ్చు. ఇది ముఖ్యంగా పరిశోధనలో భాషా సాహిత్యాలకు అత్యంత అవసరమైన పరిశోధన పద్ధతి.

ప్రజల సంస్కృతి, సామాజిక జీవితం, రాజకీయ, ఆధ్యాత్మిక భావజాలాలకు అద్దం పట్టే అపారమైన నిధి సాహిత్య రూపంలో తెలుగులో ఉంది. తాళపత్ర గ్రంథల నుండి ఆధునిక డిజిటల్ సాహిత్యం వరకు విస్తరించిన ఈ సంపదను లోతుగా, శాస్త్రీయంగా విశ్లేషించడానికి విషయ విశ్లేషణ అనే పరిశోధన పద్ధతి అత్యంత కీలకమైన సాధనంగా ఉపయోగపడుతుంది. విషయ విశ్లేషణ అనేది ఒక గ్రంథం, సంభాషణ, దృశ్యం లేదా మరేదైనా సమాచార మాధ్యమం లోని అంతర్లీనంగా దాగి ఉన్న లేదా బయటకు కనిపించే అంశాలను క్రమబద్ధంగా, సంఖ్యాపరంగా (పరిమాణాత్మకంగా) లేదా గుణపరంగా (నాణ్యతాపరంగా) విశ్లేషించే పద్ధతి. ఇది సాధారణ విమర్శనాత్మక అధ్యయనం కంటే భిన్నంగా, ఒక సందేశం గురించి లేదా ఆ సందేశాన్ని సృష్టించిన సందర్భం గురించి నిరూపించదగిన ఊహలు/అంచనాలు రూపొందించడానికి ఉపకరిస్తుంది.

తెలుగు సాహిత్యంపై పరిశోధన అంటే కేవలం ఒక కవి లేదా ఒక రచన గురించి వివరించడం కాదు, ఆ రచన ద్వారా ఆ కాలపు సమాజం, సంస్కృతి గురించి కొత్త విషయాలను వెలికి తీయడం. ఈ పనిలో విషయ విశ్లేషణ ఒక దృఢమైన పునాదిని అందిస్తుంది. ఒక కవి రాసిన పద్యం, రచయిత రాసిన నవల, లేదా నాటకకర్త రూపొందించిన నాటకం మొదలైనవి ఆ కాలపు సామాజిక పరిస్థితులు, రచయిత మనోభావాలు, సాంస్కృతిక విలువలు, రాజకీయ ధోరణులను ప్రతిబింబించే 'సందేశాలు'. నన్నయ కాలం నుండి నేటివరకు ఉన్న ఈ విస్తారమైన సాహిత్య సముద్రాన్ని లోతుగా అర్థం చేసుకోవడానికి, కేవలం పైపైన చదవడం సరిపోదు. ఒక శాస్త్రీయమైన, వ్యవస్థీకృతమైన పద్ధతి అవసరం. ఆ పద్ధతే **'విషయ విశ్లేషణ'** (Content Analysis).

సాధారణంగా పాఠకుడు ఒక పుస్తకాన్ని చదివినప్పుడు అతనికి కలిగే అనుభూతి వ్యక్తిగతమైనది. కానీ పరిశోధనలో వ్యక్తిగత అభిప్రాయాలకు తావుండదు. అక్కడ కావాల్సింది నిరూపణ చేయగలిగే సత్యాలు. విషయ విశ్లేషణ అనే పద్ధతి, సాహిత్యాన్ని ఒక **'సమాచారం'** లాగా చూస్తుంది.

ప్రఖ్యాత పరిశోధకుడు క్లాస్ క్రిప్పెండోర్ఫ్ తన పుస్తకంలో ఈ పద్ధతి గురించి ఇలా వివరిస్తారు. **"విషయ విశ్లేషణ సమాచారాన్ని కేవలం భౌతిక విషయాలుగా చూడదు; అది వాటిని అర్థం చేసుకోవడానికి, వివరించడానికి ఉద్దేశించిన సందేశాలుగా చూస్తుంది."** (Krippendorff. Content Analysis: An Introduction to Its Methodology. p.12). ఈ నిర్వచనం ప్రకారం పరిశోధకుడు విశ్లేషించే సమాచారం (ఉదాహరణకు ఒక తెలుగు నవల) భౌతికమైన వస్తువు కాదు, అది ఒకరితో ఒకరు జరిపే సంభాషణ. ఆ సంభాషణను అర్థం చేసుకోవడానికి, వ్యాఖ్యానించ

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 3  హైదరాబాద్ జనవరి : 2026



దానికి అది సృష్టించబడింది. కాబట్టి, తెలుగు సాహిత్యాన్ని పరిశోధించేటప్పుడు, పరిశోధకుడు ఆ రచన వెనుక ఉన్న ఉద్దేశాన్ని, అది చెప్పే అంతరార్థాన్ని పట్టుకోవాలి. అందుకు విషయ విశ్లేషణ ఒక బలమైన సాధనం.

**విషయ విశ్లేషణ : నిర్వచనం- స్వభావం**

విషయ విశ్లేషణ అంటే ఏమిటి? ఇది కేవలం పదాలను లెక్కించడమా? లేక భావాలను వెతకడమా? దీనికి సమాధానం రెండు రకాలుగా ఉంటుంది. ఇది ఒక వైపు సంఖ్యాత్మకమైనది (Quantitative), మరొక వైపు గుణాత్మకమైనది (Qualitative).

కింబర్లీ ఎ. న్యూయెండార్ఫ్ (Kimberly A. Neuendorf) తన పుస్తకంలో ఇలా నిర్వచించారు: **"సందేశ లక్షణాలను క్రమబద్ధంగా, నిష్పాక్షికంగా, సంఖ్యాపరంగా, గుణాత్మకంగా విశ్లేషించే పద్ధతే విషయ విశ్లేషణ."** (Neuendorf. The Content Analysis Guidebook. p.1)

ఈ నిర్వచనం ద్వారా పరిశోధకుడు మూడు ముఖ్యమైన లక్షణాలను గమనించవచ్చు :

**క్రమబద్ధత :**

పరిశోధన అనేది ఒక పద్ధతి ప్రకారం, నిర్ణీత నియమావళి ప్రకారం జరగాలి. పరిశోధకుడు తన ఇష్టానుసారం కాకుండా, ఒక పకడ్బందీ విధానాన్ని అనుసరించాలి.

పరిశోధన మొదలుపెట్టడానికి ముందుగానే, ఏ గ్రంథలను లేదా పత్రాలను అధ్యయనం చేయాలి? ఏ కీలక పదాలను ఉపయోగించి సమాచారాన్ని శోధించాలి? ఎంత సమయాన్ని కేటాయించాలి? వంటి అంశాలను స్పష్టంగా నిర్ణయించుకోవాలి.

ఈ క్రమబద్ధత వల్ల, పరిశోధన విశ్వసనీయంగా ఉంటుంది, వేరే ఏ పరిశోధకుడు చేసినా అదే ఫలితం రావడానికి అవకాశం ఉంటుంది.

**నిష్పాక్షికత :**

పరిశోధన ఫలితాలు, విశ్లేషణలు అనేవి పరిశోధకుడి వ్యక్తిగత అభిప్రాయాలు, ఇష్టాయిష్టాలు లేదా దురభిమానం/పక్షపాతం చూపు ద్వారా ప్రభావితం కాకుండా ఉండాలి.

పరిశోధకుడు తాను అధ్యయనం చేస్తున్న విషయంలో ఉన్న వాస్తవాన్ని మాత్రమే చూడాలి, తన మనసులో ఉన్న ఊహలను లేదా కోరికలను కాదు.

ఉదాహరణకు పరిశోధకుడికి ఒక కవి కవిత్వం అంటే ఎంత ఇష్టం ఉన్నప్పటికీ, ఆ కవితలో నిజంగా ఏమి ఉంది? దాని సాహిత్య విలువ ఏమిటి అనే అంశాలను తటస్థంగా విశ్లేషించాలి. అప్పుడే అది నిష్పక్షపాతమైన పరిశోధన అవుతుంది.

**సందేశ లక్షణాలు :**

పరిశోధన చేసేటప్పుడు, ఆ సందేశం లేదా పాఠ్యగత అంతర్గత లక్షణాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి.

ఇవి ముఖ్యంగా సందేశం వివిధ అంతర్గత భాగాలను తెలియజేస్తాయి :

ఉపయోగించిన భాష తీరు, పదజాలం, వాక్య నిర్మాణ విధానం, ఇతివృత్తం (ప్రధాన కథాంశం, ఉప-కథాంశాలు) వాటి ప్రాధాన్యత, పాత్రల చిత్రీకరణ (పాత్రల స్వభావం, వారి సంభాషణలు, చిత్రించిన విధానం) మొదలైనవి సునిశితంగా పరిశీలించాలి.

ఇక, సామాజిక పరిశోధనలో నిష్ణాతులైన డ్రిస్కో & మాస్చి విషయ విశ్లేషణను ఇలా నిర్వచించారు : **"విషయ విశ్లేషణ అనేది ప్రస్ఫుటమైన** (manifest) **లేదా అంతర్లీన** (latent) **విషయాలపై దృష్టి సారించే విధానాలను కలిగి ఉంటుంది."** (Drisko & Maschi. Content Analysis. p.ix)

ఈ నిర్వచనం తెలుగు సాహిత్య పరిశోధనకు చాలా కీలకం. ఇందులో రెండు రకాల విషయాలు ఉన్నాయి :

**ప్రస్ఫుటమైన విషయం :** ఇది నేరుగా కంటికి కనిపించేది. ఉదాహరణకు, ఒక కథలో 'రైతు', 'అప్పు', "వర్షం" అనే పదాలు ఎన్నిసార్లు వచ్చాయో లెక్కించడం. ఇది ఉపరితల స్థాయి విశ్లేషణ.

అంతర్లీన విషయం (Latent Content) : ఇది పాఠ్యం లోపల దాగి ఉన్న అర్థం. ఉదాహరణకు, గురజాడ అప్పారావు గారి **'కన్యాశుల్కం'** నాటకంలో గిరీశం పాత్ర మాట్లాడే మాటలు పైకి హాస్యం లాగా అనిపించవచ్చు. కానీ, లోతుగా విశ్లేషిస్తే, ఆ కాలపు సామాజిక డొల్లతనాన్ని ఎత్తిచూపే వ్యంగ్యం అందులో కనిపిస్తుంది.

కాబట్టి, తెలుగు సాహిత్యంలో విషయ విశ్లేషణ చేసే పరిశోధకుడు కేవలం పదాలనే కాకుండా, వాటి వెనుక ఉన్న భావాలను కూడా అర్థం చేసుకోవాలి.

తెలుగు సాహిత్య పరిశోధనకు విషయ విశ్లేషణ ఎందుకు అవసరం?

తెలుగు సాహిత్యంలో దాదాపు 80 పైగా సాహితీ ప్రక్రియలు (నన్నయ, తిక్కనల పద్యాల నుండి, ప్రబంధ యుగపు శృంగార కావ్యాలు, ఆధునిక యుగపు వచన కవితలు, నవలలు, కథలు, నాటకాలు...) ఉన్నాయి. వీటిని అధ్యయనం చేయడానికి సంప్రదాయ పద్ధతులు (కేవలం చదివి అర్థం చేసుకోవడం) ఒక స్థాయి వరకు ఉపయోగపడతాయి. కానీ, ఒక మంచి పరిశోధన చేయాలంటే అవి సరిపోవు.

ఉదాహరణకు, **'యాభై సంవత్సరాల తెలుగు నవలల్లో స్త్రీ పాత్రల చిత్రణ ఎలా మారింది?'** అనే అంశంపై పరిశోధన చేయాలనుకుందాం. పరిశోధకుడు వందల కొద్దీ నవలలను చదివి, ప్రతి రచనను గురించి విడివిడిగా రాయడం కంటే నవలలోని ఒక ప్రత్యేక అంశాన్ని విషయ విశ్లేషణ పద్ధతి ద్వారా, ఆ నవలల్లోని సమాచారాన్ని చిన్న చిన్న ముక్కలుగా విడగొట్టి, సులభంగా విశ్లేషించవచ్చు.

రాబర్ట్ ఫిలిప్ వెబర్ ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పారు: **"విషయ విశ్లేషణ విస్తారమైన పాఠ్యాన్ని, నిర్వహించడానికి వీలైన చిన్న చిన్న సమాచార భాగాలుగా మారుస్తుంది."** (Weber. Basic Content Analysis. p.5)

అంటే, విషయ విశ్లేషణ ద్వారా పరిశోధకుడు రచనలను చిన్న సమాచార భాగాలుగా మార్చుకోవచ్చు. తెలుగు సాహిత్యంలో దీని ఉపయోగాలు :

**ధోరణులను గుర్తించడం :** 2000 ల నుండి 2025 వరకు వచ్చిన కథల్లో 'పేదరికం' అనే అంశం ఎలా చిత్రీకరించబడిందో పోల్చవచ్చు.

**రచయితల శైలి :** స్త్రీల రచనల్లోని ఆంగ్ల పదాల వినియోగాన్ని, చలం రచనల్లోని సరళ భాషతో శాస్త్రీయంగా పోల్చవచ్చు.

**సామాజిక మార్పు :** సాహిత్యం సమాజాన్ని ఎలా ప్రతిబింబించిందో అంకెలతో సహా చెప్పవచ్చు.

**విషయ విశ్లేషణ రకాలు -- తెలుగు సాహిత్య పరిశోధనలో వినియోగం**

డ్రిస్కో & మాస్చి (Drisko & Maschi) ప్రకారం, విషయ విశ్లేషణ ప్రధానంగా మూడు రకాలుగా ఉంటుంది:

1. ప్రాథమిక విషయ విశ్లేషణ (Basic Content Analysis)
2. వ్యాఖ్యాన సహిత విశ్లేషణ (Interpretive Content Analysis)
3. గుణాత్మక విషయ విశ్లేషణ (Qualitative Content Analysis) (Drisko & Maschi. Content Analysis. p.viii)

వీటిని తెలుగు సాహిత్యానికి ఎలా అన్వయించవచ్చో వివరంగా చూద్దాం.




**ప్రాథమిక విషయ విశ్లేషణ :** ఇది పూర్తిగా అంకెలు గణాంకాలపై ఆధారపడి ఉంటుంది. దీనినే Quantitative Content Analysis అని అంటారు. ఇందులో పరిశోధకుడు వచనంలో ఉన్న పదాలను, భావాలను లెక్కించి, వాటి ఆవృత్తి (Frequency) ని కనుగొంటారు.

వెబర్ (Weber) ఈ పద్ధతి గురించి ఇలా అంటారు: **"పదాల ఫ్రీక్వెన్సీ జాబితాలు మరియు వర్గాల గణనలు అనేవి ప్రాథమిక విషయ విశ్లేషణలో అత్యంత కీలకమైన అంశాలు."** (Weber. Basic Content Analysis. p.49)

తెలుగు ఉదాహరణ : విప్లవ కవులు రాసిన కవితలను తీసుకున్నారు అనుకోండి. అందులో 'అగ్ని', 'జ్వాల', 'రక్తం', 'శ్రమ', 'విప్లవం' అనే పదాలు ఎన్నిసార్లు వచ్చాయో లెక్కించవచ్చు. ఉదాహరణకు

- అగ్ని/నిప్పు: 25 సార్లు
- రక్తం: 18 సార్లు
- విప్లవం: 15 సార్లు వచ్చాయి అనుకుంటే, ఈ గణాంకాలు, విప్లవ కవుల కవిత్వంలో 'ఆవేశం', 'పోరాటం' అనేవి ప్రధాన అంశాలని పరిశోధకుడు శా%స్త్రీయంగా నిరూపించవచ్చు. ఇది కేవలం అభిప్రాయం కాదు, ఆధారాలతో కూడిన నిజం.

అలాగే, 1980ల నాటి పత్రికా శీర్షికలను, 2020ల నాటి శీర్షికలతో పోల్చి, 'రాజకీయం', 'సినిమా', 'సాంకేతికత' అనే పదాల వినియోగం ఎలా మారిందో చూడవచ్చు.

**వ్యాఖ్యాన సహిత విశ్లేషణ**

ఇది అంకెల కంటే అర్థంపై ఎక్కువ దృష్టి పెడుతుంది. కేవలం ఒక పదం ఎన్నిసార్లు వచ్చిందనేది కాకుండా, ఆ పదం ఏ సందర్భంలో వాడబడింది? దాని వెనుక రచయిత ఉద్దేశం ఏమిటి? అనే అంశాలను ఇది పరిశీలిస్తుంది. ఇది ప్రస్ఫుటమైన విషయంతో పాటు అంతర్లీన విషయాన్ని కూడా పరిశీలిస్తుంది.

Drisko & Maschi దీని గురించి ఇలా చెప్పారు : **"వ్యాఖ్యాన**




**సహిత విషయ విశ్లేషణ, ప్రస్ఫుటమైన మరియు అంతర్లీన విషయాలు రెండింటిపై దృష్టి సారిస్తుంది."** (Drisko & Maschi. Content Analysis. p.viii)

**తెలుగు ఉదాహరణ :** దిగంబర కవులు తరచుగా వాడిన 'కుష్టు వ్యవస్థ' అనే పదం.

ఈ పదాన్ని వ్యాఖ్యాన సహిత విశ్లేషణ ద్వారా పరిశీలిస్తే :

**పైకి కనిపించే అర్థం:** సాధారణంగా 'కుష్టు' అనేది ఒక అంటువ్యాధి (Leprosy). ఈ పదాన్ని చూసినప్పుడు పాఠకుడికి వెంటనే ఒక జబ్బు, శారీరక వైకల్యం లేదా పుండ్లు గుర్తుకు వస్తాయి. పైకి ఇది కేవలం ఒక అనారోగ్య స్థితిని సూచించే పదంలా కనిపిస్తుంది.

**నిగూఢ అర్థం/ రచయిత ఉద్దేశం :** కానీ, దిగంబర కవులు ఈ పదాన్ని వైద్యపరమైన అర్థంలో వాడలేదు. ఆనాటి సామాజిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో దీనిని విశ్లేషిస్తే :

**నైతిక పతనం :** ప్రజల అజ్ఞానాన్ని, నిస్సహాయతను ఆసరాగా చేసుకుని దేశాన్ని దోచుకుతింటున్న పాలకులు, స్వార్థపరులతో నిండిన సమాజం కుళ్ళిపోయిందని చెప్పడం వారి ఉద్దేశం.

**చికిత్స లేని స్థితి :** వ్యవస్థ ఎంతగా చెడిపోయిందంటే, దానికి సాధారణ సంస్కరణలు పనిచేయవు. కుష్టు రోగంలా అది అన్ని అంగాలకూ (వ్యవస్థలోని అన్ని విభాగాలకు) పాకింది. అందుకే వారు దీనికి 'షాక్ ట్రీట్‌మెంట్' లేదా తీవ్రమైన చికిత్స అవసరమని భావించారు.

**అసహ్యం మరియు ఆగ్రహం:** సమాజంలో పేరుకుపోయిన అవినీతి, కపటత్వం పట్ల తమకు ఉన్న తీవ్రమైన అసహ్యాన్ని, ఆగ్రహాన్ని వ్యక్తం చేయడానికి వారు ఈ 'హేయమైన' పదాన్ని ప్రతీకగా వాడారు.

**గుణాత్మక విషయ విశ్లేషణ** (Qualitative Content Analysis)

ఇది చాలా ఆధునికమైన లోతైన పద్ధతి. ఇందులో సంఖ్యాత్మక పద్ధతిలోని క్రమబద్ధత (Systematic nature) వ్యాఖ్యాన పద్ధతిలోని లోతు (Depth) రెండూ కలగలిసి ఉంటాయి. మార్గ్రిట్ ష్రైయర్ (Margrit Schreier) ఈ పద్ధతిని ఇలా నిర్వచించారు : **"గుణాత్మక విషయ విశ్లేషణ అనేది గుణాత్మక సమాచారం యొక్క అర్థాన్ని, ఒక క్రమబద్ధమైన విధానంలో వివరించే పద్ధతి."** (Schreier. Qualitative Content Analysis in Practice. p.1)

గుణాత్మక విషయ విశ్లేషణలో ముఖ్యమైనది 'కోడింగ్ ఫ్రేమ్'. పరిశోధకుడు పరిశోధన చేయాలనుకుంటున్న అంశాలను ముందుగానే వర్గీకరించుకుని, వాటిని సాహిత్యంలో వెతకడం దీని ప్రత్యేకత.

తెలుగు ఉదాహరణ:

దిగంబర కవుల ఉద్దేశాలను, వారి కవిత్వంలోని అంతరార్థాన్ని అర్థం చేసుకోవడానికి, కోడ్స్ ఆధారంగా కవితలను విశ్లేషించడం

**కోడ్ : కుష్టు వ్యవస్థ**

• సమాజం, నగరాలు, పాలన కుళ్లిపోయిన వ్రణాల్లా ఉన్నాయని, వ్యవస్థ రోగగ్రస్తమైందని చెప్పే భావన.

• కవితా ఉదాహరణ: నగ్నముని రాసిన "దాహం" (మొదటి సంపుటి).

• పంక్తులు: **"నగరం మూపు మీద వాపు మీద పెద్దల విగ్రహాలు... నీచం జారత్వం పశుత్వం ప్రవహిస్తాయి సైడు కాలువలు / అవి చివరికి ఆక్రమిస్తాయి విగ్రహాలు కాబోయే రక్తనాళాలు".**

• **విశ్లేషణ :** ఈ కవితలో కవి నగరాన్ని ఒక నాగరిక ప్రదేశంగా కాకుండా, ఒక 'వాపు' గా వర్ణించారు. పైకి కనిపించే అర్థం నగరం యొక్క భౌతిక స్థితి అయినప్పటికీ, అంతరార్థం మాత్రం సమాజంలోని నైతిక పతనం. పెద్దల విగ్రహాల వెనుక ఉన్న అవినీతి, కాంట్రాక్టుల లొసుగులు వ్యవస్థను ఎలా కుళ్ళింపజేస్తున్నాయో ఇందులో విశ్లేషించవచ్చు.

**కోడ్ :** ముసుగులు తొలగించడం

• సభ్యత పేరుతో సమాజం కప్పుకున్న ముసుగులను తొలగించి, నిజాన్ని నిర్భయంగా చెప్పడం.

• కవితా ఉదాహరణ: భైరవయ్య రాసిన "దిగంబరి" (మొదటి సంపుటి).

• పంక్తులు: "నిజాన్ని నిజంగా నగ్నంగా చెప్పడం... మనిషిలో అట్టడుగున బురదగుంట్లో పడివున్న మనీషిని లేవదియ్యడం".

• విశ్లేషణ : **'దిగంబరత్వం అంటే బట్టవిప్పి గంతులేయడం కాదు'** అని కవి ఇందులో స్పష్టంగా చెప్పారు. ఇక్కడ 'నగ్నత్వం' అనే కోడ్ ద్వారా కవి ఉద్దేశం అశ్లీలత కాదు. మనిషి తనలోని కృత్రిమత్వాన్ని వదిలేసి, కళ్ళ వెనుక దాగివున్న సిసలైన కన్నీళ్ళను, సహజమైన భావాలను బయటకు తీయడమే అసలైన దిగంబరత్వం అని విశ్లేషించవచ్చు.

కోడ్ : నగ్న మనిషి / నూతన మానవుడు

• పాత వ్యవస్థను ధ్వంసం చేసి, ఒక కొత్త శక్తిగా, దిగంబర కవిగా లేదా నూతన మానవుడిగా అవతరించడం.

• కవితా ఉదాహరణ: మహాస్వప్న రాసిన "గ్లానిర్భవతి భారత" (మొదటి సంపుటి).

• పంక్తులు : **"చరిత్ర నిద్రా సముద్రం మీద తుపానునై / నేను వస్తున్నాను దిగంబరకవిని... స్తంభించిన కవితా స్తంభం బ్రద్ధలై పుట్టుకొస్తున్న ఉగ్రనగ్న నరకేసరిని".**

• విశ్లేషణ: ఇక్కడ "నగ్న నరకేసరి" అనేది నూతన మానవుడికి ప్రతీక. సమాజం నిద్రపోతున్నప్పుడు (అజ్ఞానంలో ఉన్నప్పుడు), దాన్ని మేల్కొల్పడానికి తుఫానులా వస్తున్నానని కవి ప్రకటించుకున్నారు. పాతేసిన రాళ్ళను పలికించడానికి, చచ్చిన శవాలకు ప్రాణం పోయడానికి ఒక కొత్త శక్తిగా కవి తనను తాను ఆవిష్కరించుకున్నారు.

**సారాంశం :** ఈ ఉదాహరణలను గుణాత్మక విషయ విశ్లేషణ పద్ధతిలో పరిశీలిస్తే, దిగంబర కవులు కేవలం వ్యవస్థను నిందించడమే కాకుండా మనిషి తన నిజ స్వరూపాన్ని తెలుసుకోవాలని, తద్వారా ఒక కొత్త శక్తిగా ఎదగాలని బలంగా ఆకాంక్షించినట్లు అర్థమవుతుంది.

**విషయ విశ్లేషణ దశలు -- తెలుగు సాహిత్యంలో అమలు**

ఏదైనా పరిశోధన విజయవంతం కావాలంటే దానికి ఒక స్పష్టమైన ప్రణాళిక ఉండాలి. క్రిప్పెండోర్ఫ్ విషయ విశ్లేషణకు ఒక అద్భుతమైన ఫ్రేమ్‌వర్క్‌ను అందించారు. అది ఆరు దశల్లో ఉంటుంది. (Krippendorff. Content Analysis: An Introduction to Its Methodology. p.86)

**ఈ దశలను తెలుగు సాహిత్య పరిశోధనకు అన్వయించే విధానం:**

**దశ 1 : పాఠ్యాలు/రచనల ఎంపిక :** ముందుగా పరిశోధకుడు వేటిని విశ్లేషించాలో నిర్ణయించుకోవాలి. తెలుగులో ఇది చాలా ముఖ్యం ఎందుకంటే ఇక్కడ వేల కొద్దీ పుస్తకాలు ఉన్నాయి.

• నవలలా? కథలా? కవిత్వమా?

• ఏ కాలానికి చెందినవి? (ఉదా: 1950-1970 మధ్య వచ్చిన నవలలు)

• ఏ రచయితవి? (ఉదా: రంగనాయకమ్మ గారి నవలలు) ఈ దశలో పరిశోధకుడు 'సమాచారాన్ని' సేకరిస్తారు.

**దశ 2 : పరిశోధన ప్రశ్నలు :** పరిశోధకుడు ఈ విశ్లేషణ ద్వారా ఏం తెలుసుకోవాలనుకుంటున్నాం? ప్రశ్నలు స్పష్టంగా ఉండాలి.

• 'తెలుగు నవలల్లో మధ్యతరగతి కుటుంబాల్లోని ఆర్థిక సమస్యలు ఎలా చిత్రీకరించబడ్డాయి?'

• 'రాయలసీమ కథల్లో మాండలిక భాషా ప్రయోగం ఎలా ఉంది?'




• 'స్వాతంత్ర్యానికి ముందు తర్వాత వచ్చిన దేశభక్తి గేయాల్లో తేడా ఏమిటి?'

**దశ 3 : సందర్భం :** రచనలను వాటి 'నేపథ్యం' నుండి వేరు చేసి చూడకూడదు. క్రిప్పెండోర్ఫ్ ప్రకారం, **"సందర్భం అంటే ఒక రచన చుట్టూ ఉండే భావనాత్మక వాతావరణం"** (జూ. 40). ('భావనాత్మక వాతావరణం' అంటే ఆ రచన ఏ ఆలోచనల మధ్య, ఏ భావజాలం మధ్య పుట్టిందో తెలిపేది) ఉదాహరణకు, 1930లలో వచ్చిన 'మాలపల్లి' నవలను చదివేటప్పుడు, ఆనాటి జాతీయోద్యమం, గాంధేయ వాదం, హరిజన ఉద్ధరణ వంటి సామాజిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకోవాలి. లేకపోతే విశ్లేషణ తప్పుదారి పట్టే అవకాశం ఉంది.

**దశ 4 : విశ్లేషణాత్మక నిర్మాణాలు / కోడింగ్ :** ఇది విషయ విశ్లేషణలో అతి ముఖ్యమైన దశ. మన ప్రశ్నలకు సమాధానం దొరకాలంటే, పాఠ్యాన్ని ఎలా విడగొట్టి చూడాలో నిర్ణయించుకోవాలి. దీనినే 'Coding Scheme' అంటారు. ష్రైయర్ చెప్పినట్లుగా: **"గుణాత్మక విషయ విశ్లేషణకు 'కోడింగ్ ఫ్రేమ్' (Coding Frame) గుండెకాయ వంటిది."** (Schreier. Qualitative Content Analysis in Practice. p.58)

ఉదాహరణకు, మీరు **'సినిమా పాటల్లో స్త్రీల పట్ల దృక్పథం'** పరిశోధిస్తుంటే, ఇలాంటి కేటగిరీలు పెట్టుకోవచ్చు :

• వర్ణన : (అందాన్ని మాత్రమే వర్ణించడం)

• గౌరవం : (మేధస్సును లేదా వ్యక్తిత్వాన్ని పొగడడం)

• వస్తువుగా చూడడం : ప్రతి పాటనూ చదివి, అది ఏ కేటగిరీ లోకి వస్తుందో నిర్ణయించాలి.

**దశ 5 : అంచనాలు/నిర్ధారణలు :** విశ్లేషణ పూర్తి అయిన తర్వాత, దొరికిన సమాచారం ఆధారంగా పరిశోధకుడు కొన్ని నిర్ధారణలకు రావాలి. **'పరిశోధన ప్రకారం, 2000ల తర్వాత వచ్చిన తెలుగు కథల్లో ఐటీ రంగం ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది'**అని చెప్పగలగాలి.

ISSN 2457-0796





ఇది కేవలం ఊహ కాదు, పరిశోధకుడు చేసిన కోడింగ్ గణాంకాల ఆధారంగా చేసే శాస్త్రీయ ప్రకటన.

**దశ 6 : సాక్ష్యాలతో సరిచూడడం** : మన ఫలితాలు ఎంతవరకు నిజం? దీన్ని నిర్ధారించుకోవడానికి ఇతర ఆధారాలతో సరిపోల్చాలి. ఉదాహరణకు, '**స్త్రీవాద సాహిత్యంలో ఆక్రోశం ఎక్కువ**' అని పరిశోధకుడి విశ్లేషణ చెబితే, ఆ కాలంలో జరిగిన సామాజిక ఉద్యమాలు (ఉదా: వరకట్న వేధింపులు, స్త్రీలపై జరిగే వివిధ రకాల అఘాయిత్యాలు మొదలైనవి) ఈ ఆక్రోశానికి కారణమని ఇతర (చారిత్రక) ఆధారాలతో సరిచూసుకోవాలి.

విషయ విశ్లేషణను తెలుగు సాహిత్య ప్రక్రియలకు అన్వయించడం

తెలుగులో ఉన్న వైవిధ్యభరితమైన ప్రక్రియలకు ఈ పద్ధతిని ఎలా వాడవచ్చో కొన్ని ఉదాహరణలు .

**కవిత్వం** : కవిత్వం భావోద్వేగాలతో కూడుకున్నది. దీనికి వ్యాఖ్యాన సహిత విశ్లేషణ (Interpretive Analysis) బాగా సరిపోతుంది.

• అంశం: భావకవిత్వంలో ప్రకృతి ఆరాధన.

• విధానం: కృష్ణశాస్త్రి, రాయప్రోలు వంటి కవుల పద్యాలను తీసుకుని, అందులో 'పూలు', 'వెన్నెల', 'నదులు' వంటి ప్రకృతి సంబంధిత పదాలు వాటి ద్వారా వారు చెప్పదలచుకున్న ప్రణయ భావన లేదా ఆధ్యాత్మిక భావన విశ్లేషించవచ్చు.

• **వెబర్ సిద్ధాంతం : "వర్గాల గణనలు, పాఠ్యాలలో ప్రాధాన్యత పోకడలను వెల్లడిస్తాయి."** (Weber. Basic Content Analysis.p.56). దీని ప్రకారం, ఏ కవి ఏ భావానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారో పరిశోధకుడు లెక్కలతో సహా చూపించవచ్చు.

**కథలు** : కథలు సమాజానికి అద్దం పడతాయి.

• అంశం: స్త్రీల సమస్యలు.

• విధానం: అబ్బూరి ఛాయాదేవి, ఓల్గా, పి. సత్యవతి వంటి రచయిత్రుల కథలను ఎంచుకుని, అందులో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను (గృహహింస, ఉద్యోగ సమస్యలు, అస్తిత్వ పోరాటం) కోడింగ్ చేయవచ్చు.

• **గుణాత్మక విషయ విశ్లేషణ వినియోగం** : ష్రైయర్ చెప్పినట్లుగా (Schreier. Qualitative Content Analysis in Practice. p.20), ఉపరితలంపై కనిపించని అర్థాలను వెలికితీయడానికి ఇది ఉపయోగపడుతుంది. ఉదాహరణకు, ఒక కథలో స్త్రీ పాత్ర నవ్వుతూనే ఉండవచ్చు, కానీ ఆ నవ్వు వెనుక ఉన్న విషాదాన్ని గుణాత్మక విశ్లేషణ ద్వారా గుర్తించవచ్చు.

**నవలలు** : నవలలు పెద్దవి కాబట్టి, నమూనా ఎంపిక చాలా ముఖ్యం.

• అంశం : నవలల్లో సామాజిక వాస్తవికత.

• విధానం : అరుణ రాసిన 'ఎల్లి' వంటి నవలలను తీసుకుని, అందులోని పాత్రల సంభాషణలు, వారి ఆర్థిక స్థితిగతులు, కుల సంబంధాలను విశ్లేషించవచ్చు.

• క్రిప్పెండోర్ఫ్ సూచన ప్రకారం, **"సంస్థాగత ప్రక్రియలు, సామాజిక మార్పులను లోతుగా పరిశీలించడానికి విషయ విశ్లేషణ ఎంతో అనువైనది."** (Krippendorff. Content Analysis: An Introduction to Its Methodology. p.51) సమాజంలో వచ్చిన మార్పులను అర్థం చేసుకోవడానికి నవలలు ఉత్తమమైన వనరులు.

**నాటకాలు** : నాటకాల్లో సంభాషణలు ముఖ్యం.

• **అంశం** : భాషా ప్రయోగం.

• **విధానం** : పౌరాణిక నాటకాలు, సాంఘిక నాటకాలు మధ్య భాషా వ్యత్యాసాన్ని విశ్లేషించవచ్చు. పౌరాణికాల్లో గ్రాంథిక భాష, సాంఘికాల్లో వాడుక భాష లేదా మాండలికం ఎలా వాడారో పరిశీలించవచ్చు.

**సాహిత్య విమర్శ** : విమర్శక వ్యాసాలను కూడా విశ్లేషించవచ్చు.

• **అంశం** : విమర్శకుల దృక్పథాలు.

• **విధానం** : రారా, చేకూరి రామారావు, ముదిగొండ వీరభద్రయ్య వంటి విమర్శకుల రచనలను తీసుకుని, వారు సాహిత్యాన్ని ఏ కోణంలో (మార్క్సిస్ట్, సౌందర్యవాద, నిర్మాణాత్మక) చూశారో వర్గీకరించవచ్చు.

**విషయ విశ్లేషణ ద్వారా కలిగే ప్రయోజనాలు**

ఈ పద్ధతిని తెలుగు సాహిత్యంలో వాడటం వల్ల అనేక లాభాలు ఉన్నాయి.

**1. సాహిత్య చరిత్ర నిర్మాణం** : కేవలం ఊహల ఆధారంగా కాకుండా, గణాంకాల ఆధారంగా సాహిత్య చరిత్రను రాయవచ్చు. ఏ దశాబ్దంలో ఏ వాదం బలంగా ఉందో స్పష్టంగా చెప్పవచ్చు.

**2. నిష్పాక్షికత** : ఆబ్జెక్టివ్ పద్ధతి కాబట్టి, పరిశోధకుడి సొంత ఇష్టాయిష్టాలు ఫలితాలను మార్చలేవు.

**3. శైలీ విశ్లేషణ** : వెబర్ చెప్పినట్లుగా, **"సందర్భ సహిత కీలక**

**పదాల జాబితాలు రచయితలు అర్థాన్ని ఎలా నిర్మిస్తారో వెల్లడిస్తాయి."** (Weber, Basic Content Analysis. p.44) ఒక రచయిత ఒక పదాన్ని ఏ సందర్భంలో వాడుతున్నారో చూడటం ద్వారా వారి శైలిని లోతుగా అర్థం చేసుకోవచ్చు.

**4. దాగి ఉన్న సత్యాల వెలికితీత :** కొన్నిసార్లు రచయితలు తమ భావాలను నేరుగా చెప్పరు. ప్రతీకల ద్వారా చెబుతారు. వ్యాఖ్యాన సహిత విశ్లేషణ (Interpretive analysis) ద్వారా ఈ అంతర్లీన సత్యాలను వెలికితీయవచ్చు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు :**

విషయ విశ్లేషణలో రెండు ప్రధాన సవాళ్లు ఉన్నాయి: విశ్వసనీయత, ప్రామాణికత.

**విశ్వసనీయత :** ఒక పరిశోధనను ఎవరు చేసినా ఒకే ఫలితం రావాలి. న్యూయెండార్ఫ్ ఇలా హెచ్చరిస్తారు : **"విషయ విశ్లేషణలో 'విశ్వసనీయత' అనేది అత్యంత ప్రధానమైన అంశం."** (Neuendorf. The Content Analysis Guidebook. p.141)

తెలుగులో ఒక పదానికి అనేక అర్థాలు ఉండవచ్చు. ఉదాహరణకు 'మంట' అంటే నిప్పు అని అర్థం రావచ్చు, లేదా మనసులో బాధ అని కూడా రావచ్చు. కోడింగ్ చేసేటప్పుడు ఒక వ్యక్తి దాన్ని నిప్పుగా, మరొకరు బాధగా పరిగణిస్తే ఫలితాలు తప్పు అవుతాయి. దీని కోసం స్పష్టమైన నియమాలు రాసుకోవాలి.

**ప్రామాణికత :** పరిశోధకుడు దేనినైతే కొలవాలనుకుంటున్నాడో, దాన్నే కొలుస్తున్నాడా? ఉదాహరణకు, పరిశోధకుడు ఒక నవలలో 'భక్తి'ని కొలవాలనుకుంటున్నాం. కేవలం 'దేవుడు' అనే పదం ఎన్నిసార్లు వచ్చిందో లెక్కపెడితే అది సరైన పద్ధతి కాకపోవచ్చు. ఒక నాస్తికుడు దేవుడిని విమర్శించడానికి కూడా ఆ పదాన్ని వాడవచ్చు. కాబట్టి, పరిశోధకుడు ఎంచుకున్న పద్ధతి తన లక్ష్యానికి సరైనదేనా అని చూసుకోవడమే ప్రామాణికత.

ష్రైయర్ (Schreier) చెప్పినట్లు : **"ప్రయోగాత్మక దశలలోనే కోడింగ్ ఫ్రేమ్‌లను సరిచూసుకుని, వాటిని సవరించుకోవాలి."** (Schreier. Qualitative Content Analysis in Practice. p.166) ప్రధాన పరిశోధన మొదలుపెట్టే ముందే, చిన్న స్థాయిలో పరీక్షించి, పరిశోధన పద్ధతి సరిగ్గా పని చేస్తుందో లేదో చూసుకోవాలి.

**ముగింపు :**

తెలుగు సాహిత్యంలో జరిగిన పరిశోధనలు చాలా వరకు వివరణాత్మకంగానే ఉన్నాయి. శాస్త్రీయ పద్ధతులను ఉపయోగించడం ఇంకా విస్తృతం కావాలి.

విషయ విశ్లేషణ అనేది తెలుగు సాహిత్య పరిశోధకులకు ఒక వరం లాంటిది. ఇది :

• సాహిత్యాన్ని కేవలం చదవడమే కాకుండా, కొలవడానికి ఉపయోగపడుతుంది.

• రచయితల మనోభావాలను, సామాజిక పరిస్థితులను అంకెలతో సహా వివరిస్తుంది.

• ప్రాథమిక విశ్లేషణ నుండి లోతైన గుణాత్మక విశ్లేషణ వరకు అనేక అవకాశాలను ఇస్తుంది.

క్రిప్పెండోర్ఫ్ చెప్పినట్లు, **"మానవ సంభాషణలను అర్థం చేసుకోవడంలో విషయ విశ్లేషణ పాత్ర ముఖ్యమైనది."** (Krippendorff. Content Analysis: An Introduction to Its Methodology. p.1) తెలుగు సాహిత్యం కూడా తెలుగు వారి సంభాషణే. మన జాతి చరిత్ర, సంస్కృతి, ఆశలు, ఆశయాలు అన్నీ అందులోనే ఉన్నాయి. వాటిని సరిగ్గా అర్థం చేసుకోవడానికి, భవిష్యత్ తరాలకు పరిశోధనలో విషయ విశ్లేషణ అత్యంత సరైన, శాస్త్రీయమైన మార్గం.

*******

**ఉపయోగించుకున్న పుస్తకాలు**

**తెలుగు**

దిగంబర కవులు. దిగంబర కవిత్వం (మూడు కవితా సంకలనాల ఏకైక సంపుటి). విజయవాడ: సాహితీమిత్రులు, 2016.

English

Krippendorff, Klaus. Content Analysis: An Introduction to Its Methodology. Thousand Oaks: Sage Publications, 2004.

Neuendorf, Kimberly A. The Content Analysis Guidebook. Thousand Oaks: Sage Publications, 2002.

Risko, James W., and Tina Maschi. Content Analysis. New York: Oxford University Press, 2015.

Schreier, Margrit. Qualitative Content Analysis in Practice. London: Sage Publications, 2012.

Weber, Robert Philip. Basic Content Analysis. Newbury Park: Sage Publications, 1990.



ISSN 2457-0796




# సత్సంగం



## తపస్సు

సత్యజ్ఞాన ప్రాప్తికోసం సాధకుడు చేసే కృషి తపస్సు. సిద్ధ శక్తులను పొందడం కోసం ఒక నిర్ణీత ధ్యాన సాధనను అవలంబించే యోగి కృషి కూడా తపస్సే అని మరొక భావన.

సాంప్రదాయకులైన సాధకుల లక్ష్యం ఈశ్వర దర్శనం. ఈశ్వరుణ్ణి చూడడం. ఈ లక్ష్యంలో ఇమిడి ఉన్న విషయం భగవంతునిలో కలిసిపోవడమే. ఈ లక్ష్యంలో ఇమిడి ఉన్న విషయం భగవంతునిలో కలిసిపోవడమే. యోగ శబ్దానికి అర్థం కూడా ఇదే. వేదాలు, తర్వాత వచ్చిన శాస్త్రాలు నిర్దేశించిన రీతిలో యోగ సాధనను లేక తపస్సుని చేసే సాధకులు సాధారణంగా ఒక గురువు మార్గదర్శనంలో ఉంటుంటారు.

భగవాన్ శ్రీ రమణ మహర్షి విలక్షణులు, విశిష్టులు. వారే శాస్త్రాలు చదువలేదు. వారికి మానవ గురువు యొక్క అవసరమూ రాలేదు. వారు క్షణమాత్రంలో విచారణలో నిమగ్నమయిపోయి, ఇతరులకు ఒక జీవితకాలమో, అంత కన్నా ఎక్కువ కాలమో పట్టే తప్ప పొందలేని దాన్ని, కొన్ని క్షణాలలో సాధించగలిగారు. సాధన, అనుభవాల పునాది ఉండడం చేత, వారి బోధనలు హేతుబద్ధంగా ఉంటాయి. సాంప్రదాయిక శాస్త్రాలు 'విచారణ'ను గురించి కొన్ని పరిమితమైన సూచనలు ఇచ్చాయి. కాని విచారము, తపస్సులపై భగవాన్ అవగాహన మౌలికంగా సాంప్రదాయిక శాస్త్రాలకన్నా మనకది ఆత్మజ్ఞానానికి రాచమార్గాన్ని చూపుతున్నది.

తమిళంలో ఉపదేశ ఉందియార్ అనబడే ఉపదేశ సారంలో తపస్సుని గురించిన భగవాన్ యొక్క భిన్నాభిప్రాయాన్ని చూడవచ్చును. సిద్ధులను సాధించుకోవడం కోసం ఋషులు దారుకావనంలో చేసిన తపస్సు లాంటిది. తమను తాము ఘనంగా భావించుకోవడానికి, తత్ఫలితంగా పతనానికి దారితీస్తుంది. కాని అదే సరయిన తపస్సు అవుతే అహంకార నాశనానికి – అది మోక్షానికి దారితీస్తుంది.

అన్ని రకాలయిన తపస్సులను గురించి భగవాన్ కుదిమట్టంగా ముప్పై పద్యాలు సరళంగానూ గంభీరంగానూ ఎంతో నైపుణ్యంతో రచించారు. మొదటి పదిహేను పద్యాలలో సాంప్రదాయికమైన నాలుగు రకాల యోగాన్ని గురించీ, తర్వాతి ద్వితీయార్థంలో విచారమూ దాని సైద్ధాంతిక, ఆచరణలను గురించీ రాశారు. ఉపదేశ ఉందియార్ (ఉపదేశ సారము) లో ముగింపుగా ఉన్న చివరి పద్యాన్ని మురుగనార్ రచిస్తూ తపస్సు మీద భగవాన్ యొక్క ఉపసంహార రూపమయిన అభిప్రాయాన్ని ఇట్లా పేర్కొన్నాడు.

"అహంకారం లేకుండా పోయాక, మిగిలి ఉన్న దానిని తెలిసికోవడమొక్కటే ఉత్తమోత్తమమైన తపస్సు". శాస్త్రాలు విధించిన రీతిలోనే గణపతి ముని అనేక తపస్సు యొక్క అసలయిన అర్థాన్ని తనకు తెలుపమనీ భగవాన్‌ని ప్రార్థించారు. దానికి భగవాన్ "నేను" అన్న భావం ఎక్కణ్ణుంచి ఉదయిస్తున్నదో గుర్తించి అందులో మనస్సును లయింపజేయడమే తపస్సు. మంత్రాన్ని జపిస్తున్నప్పుడు మంత్రధ్వని పుట్టుతున్నచోట మనస్సుని నిమగ్నం చేయడమే తపస్సు" అని అన్నారు.

భగవాన్ ఏ సాధనలను నిర్దేశించారు?

'నేను' యొక్క మూలాన్ని అన్వేషించినట్లయితే 'నేను' లేకుండా పోతుంది. ఇదే ఆత్మవిచారము.

మనయొక్క 'నేను'కి మూలాన్ని మనం వెదకినట్లయితే అది ఉండే ఖచ్చితమైన 'చోటు' ఒకటి లేదని తెలుస్తుంది. అది తప్పించుకొని పోతుంటుంది. పిడికిలిలో గాలిని బంధించడం వంటిదది. మనకు తెలిసిన స్థలమూ, కాలములపై ఆధారపడి ఉండే ఒక స్థిరమైన పదార్థం కాదది... అలాంటప్పుడు మనకు తెలిసిన ఒక స్థలమంటూ నేనుకి లేనప్పుడు మన మనస్సులో ఈ 'నేను' యొక్క మూలాన్ని పట్టుకోవడమెట్లా?

ఈ ప్రశ్న అడుగుతున్నదెవ్వరు? తనను వెదికే తాను ఎవ్వరు? ఈ ప్రశ్ననడిగే ఆ చైతన్యానికి మూలమైన దానిలో భగవాన్ మనల్ని ఉండమంటారు. మనస్సు యొక్క ధ్యాసను లోనికి తిప్పితే అది 'ఉనికి'కి మూలమైన దానిమీద స్థిరపడ్తుంది. ఇదే తపస్సు. సత్యాన్ని తెలిపేది ఆలోచనలు కావు. సత్ (ఉనికి) యొక్క సత్యత్వాన్ని తెలిపేది చిత్ మాత్రమే.

సత్‌ని తెలిసికోవడానికి చిత్ అంటూ వేరే ఒకటి లేదు. అందువల్ల సత్తు కూడా చిత్తే. మనం అదే. (సత్యమైన ఆత్మ).

ఆత్మ నిష్ఠయే తపస్సు. అంతే తప్ప మనస్సు ద్వారా ఆత్మలో బద్ధుడవడం కాదు. మనస్సూ, ఆత్మా ఒక్కటి కాదు. చిత్తులో ఉండటమే (తపస్సు). "ఆత్మ నిష్ఠితుడు కావడమంటే ఆత్మను తెలిసికోవడమే. కారణం ఆత్మ అన్నది ఒక్కటే తప్ప రెండు కాకపోవడమే. ఇదే ఆత్మనిష్ఠ."

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 3  హైదరాబాద్ జనవరి : 2026

ఆధ్యాత్మిక తత్త్వ దర్శిని శ్రీ కుందారపు మల్లయ్య గారి

# అమలిన భక్తి తత్త్వపు హేల - భగవత్ కీర్తన భజన మాల

**సుప్పని సత్యనారాయణ,** తెలుగు అధ్యాపకులు ఫోన్ : 9492626910

**"భజియించవే శివుని మనసా! - ఎంత పాపకారివే నీవు గడుస!"** అన్న మాటలు ఏ సందర్భంలో, ఏ మహనీయుని నోటి నుండి వెలువడ్డాయో తెలియదు. అది ఈ తెలుగు నేల అంత పులకించే విధంగా నేటికీ భక్తి పారవశ్యంతో తరిస్తున్నది అంటే మామూలు విషయం కాదు. ఆధ్యాత్మిక భావాలతో తులతూగే సామాన్యుడు సైతం, తాను నమ్మిన దైవాన్ని, తనకు జీవన మార్గదర్శకుడు అయిన గురువును ఏదో ఒక రకంగా స్తుతిస్తూ తనలోని సంవేదనను అక్షరబద్ధం చేసి చెప్పడం తేలిక. కానీ సాహిత్యాత్మక విలువలను మూటగట్టుకొని, తెలుగు సాహిత్య పదసంపదను పోగుచేసుకుని, అసమానమైన భావనస్ఫూర్తితో, అటు సాహిత్యానికి, ఇటు భాషకు సమపాళ్ళుగా న్యాయం చేస్తూ, పద సంకీర్తన సాహిత్యానికి అనగా భజన పరంపరకు పట్టం కట్టి, అందులో సంకీర్తనలను అల్లడం అంటే మాటలతో వర్ణించలేని విషయం. ఈ పరంపరలో ఈ తెలంగాణ నేలను పునీతం చేసిన వాగ్గేయకారులు ఎందరో వారి సంకీర్తనలలో నేటికీ సజీవంగా నిలిచి ఈ లోకము నుంచి నిష్క్రమించినారు.

ఇంతటి సారస్వత విలువలకు కేంద్రమైన పద సంకీర్తన సాహిత్యంలో పెద్దలు శ్రీ కుందారపు మల్లయ్య గారు కూడా తరించారు అని చెప్పక తప్పదు. వృత్తిరీత్యా చేనేత కుటుంబంలో జన్మించిన మల్లయ్య గారు జగిత్యాల జిల్లా, గొల్లపల్లి మండలం, శ్రీరాములపల్లి గ్రామ వాస్తవ్యులు. తండ్రి శ్రీ కుందారపు నరసయ్య, తల్లి రాజవ్వ. ఈ దంపతులకు కలిగిన సంతానమే శ్రీ మల్లయ్య గారు. చిన్ననాటి నుండి అనేక ఒడిదుడుకులను, కష్ట సుఖాలను ఎదుర్కొంటూ, పాఠశాలకు వెళ్ళి అక్షరాలు నేర్చుకోలేని దయనీయ స్థితిలో వారి జీవితాన్ని నెట్టుకుంటూ వచ్చినారు. ఇదే క్రమంలో ఆధ్యాత్మిక భక్తి మార్గంలో ముందుకు వెళ్లాలి అన్న ఒక తపన ఆ గ్రామంలో గల భజన మండలి భజన కేంద్రాల ద్వారా వారికి ప్రేరణ అందింది. తదనంతర కాలంలో గురుదేవులు శ్రీ స్వామి చిదానంద గారి యొక్క శిష్యరికం వలన, ఆధ్యాత్మిక తత్త్వ విషయాలను ఎన్నింటినో నేర్చుకొని మెలమెల్లగా అక్షరాలు రాయడం, ఆ తర్వాత వాటిని చదివి పదాలుగా కూర్చడం నేర్చుకున్నారు.

కాలక్రమంలో అది అనగా 2019 సంవత్సరం వచ్చేసరికి "భగవత్ కీర్తన భజనమాల" గా రూపాంతరం చెందింది. ఇది క్రమ వికాస పరిణామం అనడానికి ఒక సిసలైన వేదిక. రచయిత వారి నిజజీవితంలో చూసిన ఘట్టాలను, జీవితానుభవంలో నుంచి పొందిన







అనుభూతులను ఈ గ్రంథంలో మొత్తం 37 సంకీర్తనలుగా, నాలుగు మంగళహారతులుగా రచించి రసహృదయుల మనసులో చోటు సంపాదించుకున్నారు.

కావ్య ఆరంభంలో మొదట గురుదేవులు స్వామి చిదానంద గారిని స్మరిస్తూ కొన్ని పద్యాలు, ఆ తర్వాత తల్లిదండ్రులు, తనకు ప్రేరణ భరితులైన గురుతుల్యులు అందరిని స్మరించుకుంటూ కావ్య రచనకు శుభప్రదమైన శ్రీకారం చుట్టారు. ఈ ఒరవడి సంకీర్తన సాహిత్యంలో ఒక మేలిమి ప్రక్రియ. వందనమయ్య విఘ్నేశా - నీ పాద వందనం గణేశా! అని కీర్తన ఆదితాళంలో సాగుతూ భక్తి తత్త్వానికి ప్రతీకగా నిలిచింది. సామాన్యంగా కొందరు రచయితలలో కనిపించే ఒక ఒరవడి ఎలా ఉంటుంది అంటే రాముడిపైన ఒక కీర్తన, కృష్ణుడి పైన మరోకీర్తన, ఇలా రచయిత తన మదిలోని భావజాలాన్ని మొత్తం కీర్తనలో స్తుతి చేస్తూ ముందుకు వెళుతూ, అనేక చరణాలను పెంచుకుంటూ వెళతాడు. రచయితగా, అందున భజన సంకీర్తన కారునిగా మల్లయ్య గారు చేసిన ప్రయోగం ఎలా ఉంటుంది అంటే ఒకే కీర్తనలో రాముడిని, కృష్ణుడిని, శివుడిని ఇలా చరణానికి ఒక దైవాన్ని స్తుతి చేస్తూ ఒక నూతన ఒరవడిని సృష్టించినారు.

"రామ రామా యనుచు నిత్యము - రాముని దలువవే ఓ మనసా!, కృష్ణ కృష్ణ యనుచు నిత్యము - కృష్ణుని దలువవే ఓ మనసా!! శివ శివ శివ శివ యనుచు నిత్యము - శివునిదలువవే ఓ మనసా!!, ధరణిలోనను రుషికేషులోని - స్వామి చిదానందుని ఓ మనసా!, అవనిలోన శ్రీ రాములపల్లి - నీ వాసుడు మల్లయ్యకు ఓ మనసా!!" అంటూ సాగిన ఈ కీర్తనలో దైవభక్తికి, ఇటు గురుభక్తికి ప్రతీకగా ఈ గీతాన్ని చెప్పుకోవచ్చు. అంతేగాక చివరకు స్వామి చిదానందల వారిని కూడా స్మరిస్తూ, తనకు జన్మనిచ్చిన నేల శ్రీరాములపల్లె ను కూడా స్తుతి చేస్తాడు.

సంకీర్తన సాహిత్యానికి కంకణబద్ధులైన ఏ రచయితకు కూడా ముందుగా భజన పట్ల ఆసక్తి ఉండాలి. దైవం పట్ల అమితమైన భక్తి ఉండాలి. ఇక రచనలకు శ్రీకారం చుట్టినప్పుడు సంకీర్తనలోని ఎత్తుపల్లాలు తెలిసి ఉండాలి, తాళ ప్రమాణం కూడా గుర్తుండాలి. అన్నింటినీ మించి తాను కూడా వాగ్గేయకారుడై ఉండాలి. అలా అయినప్పుడే శంఖంలో పోసిన నీటి బిందువు ఎలాంటిదైనా అది తీర్థం అవుతుంది అని ఎలా పెద్దలు చెబుతారో, అలాగే ఈ లక్షణాలన్నీ మేళవించిన సంకీర్తనకారుడు ఎవరైనా వారు పలికే ప్రతి మాట ఒక సంకీర్తనగా, రసహృదయులను ఓలలాడించే ఒక తత్వగీతంగా పాఠక హృదయపేటికలకు సంతోషాన్ని, ఆనందాన్ని కలిగిస్తుంది. ఇందులో మరొక సూత్రం ఏమిటంటే భాషా పట్ల పట్టు ఉండడమే కాక, వ్యవహారిక భాషకు నడుంబిగించి రచనలో ఆ విధానాన్ని చూపుతూ ముందుకు వెళ్లాలి. ఇక్కడ పాట ఏదైనా, సంకీర్తన ఏదైనా అది పామరుడి వద్దకు చేరగలగాలి. అప్పుడే ఆ కీర్తనకు న్యాయం దక్కుతుంది. పామరుడిని రంజింప చేయకపోతే అది పాట కానే కాదు. పామరుడి వద్దకు ఏ రోజు వెళుతుందో ఆ రోజే ఆ పాటకు పరిపూర్ణత చేకూరుతుంది.

ఇలా సరళ సుందరమైన భాషా విధానంతో, చక్కటి పదజాలంతో రచయిత శ్రీ మల్లయ్య గారు ప్రతిపదంలో మొదట భక్తికి పెద్దపీట వేసి శివుడిని, శ్రీ మహావిష్ణువుని స్తుతిస్తూ తనలోని రచనా ప్రౌఢిమను బహిర్గతం చేస్తారు. **"నంది వాహన! నాగభూషణ! – నాగతి నీవేనురా! – కన్న తండ్రి వణుచువేడితి – కరుణచూపుమంటిరా!"** అంటూ ఒక పసి హృదయంతో కన్నతండ్రిని పలకరించిన విధం ఈ కీర్తనలో కనిపిస్తుంది. **"లింగ రూపమున ఉంటావో – శివ అంగములో ఉంటావో ! అందరందున ఉంటావో ! నీ వంతటా నీవే ఉంటావో!!"** అంటూ శివుడు సర్వంతర్యామి అన్న రచయిత, చివరకు తన వద్దకు వచ్చేసరికి **"ఎందునున్నను ఈశ్వరా! – నా ముందు నిలిచి బ్రోవరా! – అంత్యకాలమునందునన్నిక – ఆదుకో ప్రభు ఈశ్వరా!!"** అంటూ సింహాద్రి నారసింహ శతక కర్త అయిన శేషప్పను మన ముందు ఉంచుతాడు. మరణప్రాయంలో నా పరిస్థితి ఎలా ఉంటుందో తెలియదు. అలాంటి సమయంలో కూడా అందరినీ ఆదుకున్నావని బిరుదు నీకు ఉన్నది, అంతట ఉంటావు అని యశస్సు నీకు మాత్రమే దక్కింది. కాబట్టి నా చివరి క్షణంలో కూడా నువ్వు నా వద్దే ఉండాలి నన్ను ఆదుకోవాలి. అని ఒక సాధికారతతో కూడిన భక్తి తత్వం ఎవరికి దక్కుతుంది అంటే, భగవంతుడిని అమితంగా ఆరాధిస్తూ.. నమ్మిన దైవానికి ఎప్పుడైతే దాసోహం అవుతారో అప్పుడే, అలాంటి భక్తులకు మాత్రమే ఇలా భక్తి పూర్వకమైన వాదన చేసే హక్కు అధికారం ఉంటుంది.

కలియుగ ప్రత్యక్ష దైవం అయిన శ్రీ వేంకటేశ్వర స్వామిని స్తుతించని వారు ఎవరు ఉండరు. రచయిత శ్రీ మల్లయ్య గారు కూడా తనదైన శైలిలో శ్రీ వెంకటేశ్వర స్వామిని స్తుతిస్తూ **"ఏడుకొండలవాసుని ఎప్పుడు – మదిలో దలువవే ఓ మనసా! – మరువక మదిలో మారకదలచిన – మహనీయుడవయ్యేద వోమనసా!!"** ఇది సంకీర్తనలు కేవలం వెంకటేశ్వర స్వామిని స్తుతించడమే కాదు ఏడుకొండల లో గల వింత వింతలను అన్నింటిని ప్రతి చరణం లో చెబుతూ వాటి ప్రాశస్త్యాన్ని పాటకు హృదయులకు అందజేస్తారు. **పాతాళ గంగ స్నానము చేసిన – పాపములు బాయునే ఓ మనసా! – పాపము బాసిన పరలోకంబును – పయనంబయ్యెద ఓ మనసా!!** ఇక్కడ పరలోకం అంటే వేరే లోకం అనే అర్థం కాదు. ఇహము – పరము అని రెండు లోకాలలో అనునది భూలోకం అయితే, పరము అనునది దైవలోకం, అంటే ఆధ్యాత్మిక లోకం కూడా అనే అర్థం వర్తిస్తుంది.

కాబట్టి ఏడుకొండలలోని మహత్యాన్ని తెలియజేస్తూ, ఆకాశగంగా, వడ్డికాసులవాడైన గోవిందరాజుల మహిమ, ఏడుకొండల విశిష్టత.. ఇవన్నీ తనదైన శైలిలో భక్తితో జత చేసి కీర్తనగా మలిచాడు రచయిత. అంతేకాదు ఇద్దరూ భార్యల ముద్దుల స్వామి – నీ వద్దనే కొలువవే ఓ మనసా! హద్దు పద్దులనుటేమియు లేవు – హరిణి దలచుటకు ఓ మనసా! అని పంక్తి ద్వారా వ్యక్తికి, కవికి ఉన్న స్వేచ్ఛను తేటతెల్లం చేశారు. భగవంతుని ఆరాధించడానికి కులము మతము అనే భేదభావం ఎక్కడ కూడా అడ్డురాదు. అందరము దేవుని బిడ్డలమే అన్న భావజాలంతో దైవస్మరణకు హద్దు పద్దు లేదు అంటాడు.

లోకజ్ఞత నిండిన రచయితలకు మాత్రమే కొన్ని విషయాలు చెప్పడం సాధ్యమవుతుంది. అందులో ఈగబుచ్చిదాసు, జిల్లా వెంకటదాసు, కొంకనం సాధువు వంటి కొందరు సంకీర్తన కారులు, సిద్ధప్ప వరకవి, యోగి వేమన వంటి సుప్రసిద్ధ వాగ్గేయకారులు, భవిష్యత్తు నిర్దేశక కర్తలు కొన్ని ముందే చెప్పి జాతిని జాగృతం చేయడం చూస్తాం. ఇందులో భాగంగానే రచయిత మల్లయ్య గారు ఆదితాళంతో కూడిన ఒక సంకీర్తనలు **"దేవుడెంతో మంచి వాడన్న – తను తెలుసుకుంటే – చింతలన్నీ తీరునోయన్న! – దేవుడెంతో మంచివాడు – చింతలన్నీ తీరిపోవును – మరువకను మదిలోన దలచితె – మా ఆత్మదవుని వగదువన్నా!!"** అంటూ దైవం యొక్క నిజస్వరూపాన్ని చెబుతాడు. ఇంత తేటతెల్లంగా బహిర్గతం చేసి చెప్పడం అందరివల్ల అయ్యే పని కాదు. దీనికి సామాజిక దృష్టి కోణం, సామాజిక స్పృహ ఇవన్నీ మేళవించి, లోకజ్ఞానం కూడా ఎంతో అవసరం. ఎప్పుడైతే ఈ జగమంతా శూన్యం అంతా మిథ్య అని భావన ఎప్పుడైతే మనిషి లోపల దూరుతుందో అప్పుడే మనిషికి దేని పట్ల కూడా వ్యామోహం అనేది ఉండదు. ఈ గీతంలో రచయిత లోకనీతులను ఎన్నో తనదైన శైలిలో చెబుతూ చివరికి కూడా దేవుడు ఎంతో మంచివాడు అనే తీర్పుని ప్రకటించాడు. శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారు

చెప్పినట్లు **"చెప్పలేదంటనక పోయేరు - నరులార గురుని, జేరి మొక్కితే బ్రతుకనేర్చేరు"** అనే మాట ఈ సంకీర్తన ద్వారా గుర్తుకు వస్తుంది.

గురు స్తుతికి, గురువు చూపిన మార్గానికి కృతజ్ఞత పూర్వకంగా అల్లిన సంకీర్తనలే ఈ చిరు కావ్యం లో ఎక్కువగా కనిపిస్తాయి. అక్కడక్కడ వివిధ దేవి దేవతలకు సంబంధించిన స్థితులు కనిపిస్తాయి. ఇలా గురు స్తుతులు ఎక్కువగా రాయడం అనేది కొందరి విషయంలో గురువునే ప్రాతిపదికగా చేయడం అనేది ఒక విషయం అయితే, గురువు పట్ల అవ్యాజమైన భక్తి ఉండడం అనేది మరొక ఎత్తు. గురువే సర్వలోకానాం అన్న ఆర్యోక్తి అజరామరం. అంధకార బంధురం నుండి, వెలుగుల లోకాన్ని పరిచయం చేసేది, అజ్ఞాన తిమిరాలను తొలగించి, విజ్ఞాన వీచికలను పరిచయం చేసేది కేవలం గురువు మాత్రమే. గురువు లేకపోతే సర్వం శూన్యం. ఈ సత్యాన్ని గుర్తించిన రచయిత శ్రీ మల్లయ్య గారు. అందుకే ప్రధానంగా గురు స్తుతిని చేస్తూ, రచయిత గురువుగారి యొక్క గురువుగారు శ్రీ స్వామి శివానంద గారిని కూడా స్మరిస్తూ, గురుదేవుల పాదపద్మములకు ఎన్నో తత్వ కీర్తన పుష్పాలను అంకితం చేశారు.

ఇందాక చెప్పినట్లు గురు మర్మాన్ని గుర్తెరిగిన రచయిత కాబట్టి, ఒక కీర్తనలో **"దొరుకబోడిక ఇలలో గురువు - దొరికె ధన్యుడనైతయా! - మరువబోనిక గురుని మంత్ర - రహస్యమును తెలిపినయా!"** అంటూ జీవిత మర్మాన్ని గురు మంత్రం యొక్క సారాన్ని ఎరుకపరిచేవాడు కేవలం ఒక గురువు మాత్రమే. గురు కటాక్షం మేలిమివరం. గురువు దీవెన ఒక అదృష్టం. అందుకే **"ఎన్ని జన్మల పుణ్యమో - సద్గురుకు దాసుడైతిని! - మరువకను ధ్యానించి సద్గురు - మహిమ తెలుసు కుంటిని!!"** అంటాడు రచయిత. నిజంగా ఎన్నో జన్మల పుణ్యం ఉంటే కానీ గురువు యొక్క పాద తీర్థాన్ని పొందే అదృష్టం అందరికీ రాదు. అలాంటి అనుభూతిని నిజజీవితం లో పొందిన రచయిత శ్రీ మల్లయ్య గారు. కావునని గురువు మహిమను కూడా నేను తెలుసుకున్నాను అంటూ సగర్వంగా ప్రకటించిన భక్తి తత్పరుడు.

ఇలా కీర్తనలలోని పలు పార్శ్వాలు, మల్లయ్య గారి లోని భిన్న కోణాలు ప్రతి సంకీర్తనలు కనిపిస్తాయి. సరళ సుందరమైన భాష, వినసొంపైన రాగాలు, ఆదితాళం, ఆట తాళం, ఏకతాళం ఈ మూడు తాళ ప్రమాణాలతో ఈ పుస్తకంలోని కీర్తనలు కనిపిస్తాయి. చదువరులకు ఎవరికైనా అర్థమయ్యే రీతిలో అనగా పామర జన రంజకం గా ఈ భగవత్ కీర్తన భజనమాల అలరారుతోంది. అక్కడక్కడ కొన్నిచోట్ల పాత సినిమా పాటల బాణీలను కూడా రచయిత ఎక్కువగా ఆలపించేవాడు అని అర్థమవుతుంది. అందుకు తార్కాణంగా ఈ కావ్యం లో కొన్నిచోట్ల పాత సినిమా పాటలను గుర్తు చేస్తూ వాటికి తాళ ప్రమాణాన్ని చెప్పకుండా అనుమాదిరి.. అంటూ పాత పాటలు స్మరించే విధంగా, ఆ గీతాల మాదిరి కొన్ని కీర్తనలను రచించి అలనాటి పాత పాటల పట్ల తనకున్నటువంటి మక్కువను కూడా చాటుకున్నారు రచయిత. ఒకరకంగా ఇది వారి రస హృదయానికి ప్రతీక.

తాను పుట్టి పెరిగిన నేల శ్రీరాములపల్లె ను అంకితంగా చేసుకొని, ఈ కీర్తనలను శ్రీరాములపల్లె పురవాసుడైన రాముడిని స్తుతిస్తూ వివిధ దేవీ దేవతలను స్తుతిస్తూ కీర్తనలను అల్లడం మనం చూసాం. సాధారణంగా రచయిత పుట్టి పెరిగిన గ్రామం యొక్క రుణం తీర్చుకోవడమో, లేక తన జన్మ స్థలాన్ని ప్రకటించడమో సంకీర్తన సాహిత్యంలో కనిపిస్తుంది. అలాగే శ్రీరాములపల్లె పురాంకితం గా, ఆ గ్రామంలో గల హరిదాసు (అంటే తాను, కావ్యం అంతా ప్రథమ పురుషలో సాగుతుంది.) అయిన కుందారపు మల్లయ్య, అని తనను తాను హరిదాసునిగా పేర్కొన్నాడు. ఆ హరిదాసు చెప్పిన ఈ సంకీర్తనలు భగవద్భక్తులకు, భజన ప్రేమికులకు అందరికీ శ్రేయోదాయకంగా నిలుస్తాయి అని విశ్వసించాడు.

కావ్యం చివర నారాయణుని స్మరిస్తూ రెండు మంగళహారతులు, విఘ్నేశ్వర స్వామిని స్తుతిస్తూ, గురుదేవులను స్మరిస్తూ మరొకటి మంగళ హారతులు రచించి సంకీర్తన నీరాజనాలను అర్పించాడు రచయిత. తెలంగాణ నుడికారానికి ఒక ప్రత్యేక స్థానంగా నిలిచిన కావ్యం ఈ సంకీర్తనల యొక్క సమ్మిళితం. చూడడానికి చిన్న పొత్తమే అయినప్పటికీ ఆధ్యాత్మిక భావజాలం వెల్లువెత్తే విధంగా ప్రతి కీర్తనకు ప్రాణ ప్రతిష్ట చేశాడు రచయిత. ఇంతకుముందు గుర్తుచేసినట్లుగా పాట ప్రత్యేకత పామరున్ని తాకడం. అలా ఇటు పండిత అటు పామర జన ఈ కావ్యం తెలంగాణ పద సంకీర్తన సాహిత్యంలో ఒకటిగా వెలుగొందుతుంది అనడంలో ఎంత మాత్రమూ అతిశయోక్తి లేదు. ఇలా సరళ సుందరమైన భావజాలంతో వచ్చే పద సంకీర్తన గ్రంథాలు తెలంగాణ వ్యాప్తంగా లెక్కకు మిక్కిలి ఉన్నాయి అని చెప్పవచ్చు. అందులో సందేహం లేదు. నేటితరానికి వాటి గొప్పతనాన్ని తెలియజేసే విధంగా, విశ్వవిద్యాలయ స్థాయిలో ఇలాంటి కావ్యాలను గుర్తించి వాటిపైన పరిశోధనలు జరుగవలసిన అవసరం ప్రస్తుతం ఎంతైనా ఉన్నది. అప్పుడే తెలంగాణ పద సాహిత్యానికి ఒక విలువ చేకూరుతుంది.

**సమీక్షకులు :**

సుప్పని సత్యనారాయణ, తెలుగు అధ్యాపకులు,
అధ్యక్షులు భీమన్న సాహితీ పీఠం,
గ్రామం కోనాపూర్, మండలం బాన్సువాడ,
కామారెడ్డి జిల్లా - తెలంగాణ,
చరవాణి: 9492626910.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 3  హైదరాబాద్ జనవరి : 2026

# జనగామ జిల్లాలో బహుజన కవిత్వం

**అలంశెట్టి పర్శరాములు,** పరిశోధక విద్యార్థి, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్. ఫోన్ : 9704 899 162

**పరిచయం**

తెలుగు దళిత సాహిత్య ఆవిర్భావ కాలంలో ఒక విశాల ప్రాతిపదికన సంఘటితమైన ఎస్.సి. ఎస్.టి., బి.సి., మైనార్టీ కవులు ఆ తరువాత కాలంలో నిర్దిష్టతల వైపు విడిపోయి చైతన్యాలవైపు సొంత అస్తిత్వాలవైపు మళ్లాయి. ఇది మొత్తం దళిత సాహిత్యోద్యమానికి మేలే చేసింది. తెలుగులో తొలి దళిత కవితా సంకలనం “చిక్కనవుతున్న పాట’కు ఐ.లక్ష్మీనరసయ్య, ముందుమాట రాస్తూ కుల వ్యవస్థ, దానికి ఆలంబన అయిన హిందూయిజం, వీటివల్ల రోజువారీ జీవితంలోని పీడనను అనిశ్చితత్వాన్ని అభద్రతనూ అవమానాల్నీ ఎదుర్కొంటున్న పీడిత కులస్తుల నుంచీ, మైనార్టీల నుంచీ వచ్చిన కవులు రాసిన కవిత్వమే దళిత కవిత్వమే అని నిర్వచించారు. “చిక్కనవుతున్న పాటలో” ఎస్.సి.ల ఊచకోతల మీద అనేక మంది బి.సి.కవులు నిజాయితీగా స్పందించి కవిత్వం రాయడం గమనించవచ్చు. చిక్కనవుతున్న పాట పదునెక్కినపాట, చిత్తురువువంటి సంకలనాలు దళిత కవిత్వం పేరుతోనే వెలువడగా, బహువచనం, మేమే మంగి, వంటి సంకలనాలు దళిత బహుజన కవిత్వం పేరుతో వెలువడటం గమనించవచ్చు. అంటే అంతవరకూ ఎస్.సి.ల సమస్యలను తమ గొంతుతో పలికించిన బి.సి.లు, ఎస్.సి.లకే కాదు. తమకూ సమస్యలు ఉన్నాయనీ, వాటి గురించి కూడా తాము గానం చెయ్యవలసిన అవసరాన్ని గుర్తించారు.

**కీలక పదాలు :** పొంటెలు, పోగులు, పడుగు, పేకలు, గుజితాడు, సుర, బహుజనం, ముస్తాదు.

**ఉద్దేశం : “ఆయా ఉత్పత్తి కులాలలో పుట్టిన గర్భస్థ మేధావులు ఆ కుల పనితనాన్ని, ప్రకృతితో దానికుండే ఉత్పత్తి సంబంధాన్ని మానవ జాతికి ఆయా కూలీలు చేసే మేలును ప్రతినిత్యం ప్రతిరూపంలో నెమరువేసుకోవడం ఒక ప్రక్రియగా మారుతున్నది. అని కంచ ఐలయ్య అన్నట్టు ఆయా కులాల పనితనాన్ని కవిత్వపు పనితనం జోడించి మరీ బి.సి.కవులు అందించారు”**[1] (తెలుగులో కవిత్యోద్యమాలు - కె.యాదగిరి (సంపా) పుట-228)

కొత్తగా ఏర్పడిన జనగామ జిల్లాలో కూడా ఆయా సామాజిక వర్గాల బి.సి.కవులు తమ అస్తిత్వాన్ని వినిపించారు.

“నేను సందర్శించిన
గుళ్ళన్నింటిలో
మనిషినే స్మరించుకున్నాను
దైవానికి నగిషీ చెక్కిన చేతులకు
శిరసు వంచి నమస్కరించాను
గగనాన్ని తాకే
గోపురాల ముందు మోకరిల్లి
మనిషి విశ్వరూపాన్ని దర్శించాను
... ..... .... ....
మట్టి వంటికి బట్టలు తొడిగి
గాలి జడలో పువ్వులు తురిమి
కాంతి కళ్ళకు కాటుక పెట్టి
ఆకాశానికి హారతులిచ్చి
నిత్యం సలిపే ఆరాధన
సర్వ భూతాత్మకు ఆవాహన
అందుకే ఓ మనిషీ
నీవే నీవే అపర విశ్వకర్మ
నీదేనీదే అద్భుత విష్ణు జన్మ”[2] (వెలుగు రవ్వలు - మల్యాల మనోహరరావు -పుట-38)

చాలామంది భక్తులు దేవుళ్ళను దర్శించుకునేందుకు గుళ్ళకు వెళ్తుంటారు. కొందరేమో గుడి నిర్మాణాన్ని అందులోని శిల్పకళా సౌందర్యాన్ని చూసేందుకు వెళ్తుంటారు. నిజానికి గుడిలోని దైవాన్ని కూడా ఆ విశ్వకర్మనే తయారు చేశాడు. వారిది అద్భుత సృష్టి.

కులాలు, కులవృత్తులు, ఆ వృత్తులలో ఉన్న తమ తాతలు, తండ్రులు, తల్లులు పడిన బాధలకు తమ తరపున చైతన్యంతో పల్లవికట్టి ప్రయత్నం బి.సి.కవులు చేశారు. బిసి కవులకు అంతర్జాతీయ చైతన్యం ఉంది. బి.సి.కవులకు ఉన్న క్రమశిక్షణతో పాటు నిబద్ధత ఉంది. ఆ నిబద్ధతతోనే ఆత్మగౌరవం కేవలం రాజకీయ నినాదం కానక్కరలేదని అదోక జీవనవిధానంగా మారాలని ఆకాంక్షించారు. పోతులూరి వీరబ్రహ్మం ఏ రకంగా అట్టడుగు కులాలను కలుపుకుని దేశీయ మార్క్సిజాన్ని ఏ రకంగా పాదులు వేశారో నేటికీ విశ్వకర్మలు ఇతర బి.సి.కులాలతో అట్టడుగు జాతులతో కలిసిపోయి ఉంటారు.

“పూల పరిమళం” కవితా సంపుటిలో ‘నెమలి కన్ను’ కవితలో కోడం కుమారస్వామి పద్మశాలీల జీవితాలను చిత్రించాడు.

“కోడి కూయంగానే కన్నీటి వెతల
దారాలను కండెలుగా సుట్ట సుడుతూ
ఆలోచనల సుడిలో తిరిగె రాట్నం
పొంటెలు పొంటెలుగా తానే
పంటెయి తనచుట్టూ తాను తిరిగే భూమాత

చిక్కుబడ్డ బతుకు పోగులను
సుతారంగా సక్కపెడుతది
పాడుకాలం తెంపిన పోగు పేగు
బంధాలను గుండె తడిలో అద్ది
పడుగు పేకలను, సింగారిస్తుంది
పుట్టలో పుట్టిన గౌరమ్మ బిడ్డ
జరీపూల వెలుగు వాసన సాకని
ఆకుపచ్చ చీర ఒడిలో చిలకమ్మ
నెమలికన్ను చీర దుఃఖం చూపులో
పాత చింపుల చిరునామా ఆమె బతుకు"[3] (పూల పరిమళం - కోడెం కుమారస్వామి - పుట- 102, 103)

సాలెల మగ్గం శరీర కష్టాన్ని స్ఫురింప చేస్తున్నా కడుపు నిండక, తన కళా కౌశలాన్నంతా మగ్గం ముడి చుట్టూ తిప్పుకున్న బతకలేక నేడు ఆత్మహత్యలకు పాల్పడే దుస్థితి నెలకొన్నది.

ఈ కవిత వాళ్ళ వస్త్ర జీవితాన్ని వస్త్రం కావ్యంగా మలిచివేసింది. వస్త్రం చేసేటప్పుడు, మగ్గాన్ని పట్టుకుని ఆ గోతిలో కూర్చొని నూలు ఒడుకుతున్నప్పుడు ఆ నరనరాల నుండి వస్తున్న శ్రమ చెమట సంగీతాన్ని కవిత్వీకరించాడు. అందమైన జరీచీరలు, నెమలికన్ను చీరలు చేసే వారి జీవితాల్లో ఆనందాలు లేవని వివరించారు కుమారస్వామి.

ఇదే కవితా సంపుటిలోని "కలనేతడు" కవితలో "సిగ్గుపడ్డ అనాగరికతకు బట్టకట్టు సంస్కృతికి తాత్త్వికుడు, రంగులద్దిన పోగు ఇకమతికి సొంచెలు సాగిలబడుతుంటే మల్లెపందిరి, కూనలమ్మి, తులసికోట, కాకరపూవంచు మామిడి పిందెలు అతని చేతి మునివేళ్ళనుండి జారిన ముగ్గులు."

"కళాత్మక తత్త్వం నిత్యకృత్యం
బతుకు ఎతారాలో ఆకలి సత్యం
సెమట సుక్కల మధుపర్కాల
ఒయినులో కొత్తబట్టల సంబురమైతడు
బొంతపేగుల జీవన సమరంలో
మీ ఇంటికొస్తే చేనేత వస్త్రమై
ఆలింగనం చేసుకోండ్రి
ఫెనిక్స్‌లా పుంజుకొని మన పరువు కాపాడుతది"[4]
(పూల పరిమళం - కోడెం కుమారస్వామి - పుట - 59, 60)

ఈ కవితలో నేతకారుల కళా సృష్టిని చిత్రించారు. నేతకారులు ఆరుగాలం కష్టపడినా వారి జీవితాల్లో వెలుగులు నింపే ఆశలేదని కొత్త బట్టలు వేసుకునే వారి జీవితాల్లో కాంతులు ఉంటాయి కానీ అవి తయారు చేసిన వారి జీవితాల్లో మాత్రం అంధకారాలే అంటూ వాపోయారు. అగ్గిపెట్టెలో పట్టే చీరలను తయారు చేసే నేర్పరితనం నీకే సాధ్యమయింది. అంటూ అందరిముందు అభిమానించి భరోసా




కరువైన వాడిని అంటూ పద్మశాలీల జీవితాలను చిత్రిక పట్టారు.

'మారుకత్తి' కవితలో డా॥ పెద్ది వెంకటయ్య గౌడ్ గౌడల జీవితాన్ని చిత్రించారు.

"తలకు రుమాలు- నడుముకు ముస్తాదు బిగించుకుని
కాళ్ళకు సహాయం అందించే గుజితాడు
తళతళ మెరిసే కత్తి పదును పెట్టే పిల్లబద్ద
.... ..... ..... ..... .....
మిన్నునంటే తాటిని చీకటిలో అధిరోహిస్తాడు
మబ్బులను ముద్దాడుతూ పలకరిస్తూ
ఆనందాన్ని అనుభవిస్తాడు
కల్తీలేని సురను ప్రతి పెదవికందిస్తాడు
మానసాలను పచ్చగా మురిపించే అమృతకారుడు
మండుతున్న ఎండలను గొడుగుగా ధరిస్తాడు
పులిలాంటి చలిని రాల్చేస్తాడు" [5]
(విశ్వవీణ- డా॥ పెద్ది వెంకటయ్య - పుట-11)

గౌడ కులస్తుల గీతకార్మికుల జీవితాలు దుర్భరంగా వున్నాయి. తరతరాలుగా చెట్టెక్కి కల్లుగీసి వూరి దప్పికను తీర్చుతున్నారు. తాటి చెట్టెక్కడం ఎంత కష్టమైనది. అందుకే నడుముకు ముస్తాదు కట్టుకుని తన రెండు చేతుల్తో రెండు కాళ్ళతో ఒక్కొక్క అంగ వేసుకుంటూ శరీరమంతా రక్తం ముద్దను చేసుకొని చెమటలు కక్కుతూ రోజూ లక్షలాది మంది గీత కార్మికులు చెట్టెక్కుతున్నారు. వారి జీవితాలను యదార్థ దృశ్యంగా వెంకటయ్య చిత్రించారు.

గౌడ కులాల్లో వారి వస్త్రధారణ వారు ఉపయోగించే పదాలు, వస్తువులు, విభిన్నంగా ఉంటాయి. మనుషులకు పెట్టినట్లే వారు ఈత తాటి చెట్లకు పేర్లను కూడా పెడతారు. వారు వాటిని ఆ పేర్లతోనే పిలుచుకుంటారు. వారి జీవితాల్లో ఈ చెట్లే కీలకం.

"కులవృత్తి" కవితలో చిలుమోజు సాయికిరణ్ కులవృత్తుల గురించి చిత్రించారు.




"ఎన్నడు పుట్టిందో / ఎక్కడ పుట్టిందో
తెలియదు కానీ / మానవ మనుగడకు
జీవనభృతిగా మారింది
తాతల చేతులలో / ప్రావీణ్యం పొంది
నేటి తరాలకు ఆదర్శమయ్యింది
ఆధునిక యంత్రాంగములు / ఎన్నెన్ని వచ్చినా
నీ ప్రాముఖ్యతను కాల రాయలేదు
కొన ఊపిరిలో ఉన్న
మన కుల వృత్తులను
కాపాడే పోరుడిగా సాగిపోదాం"[6]
(కవనతీగ - చిలుమోజు సాయికిరణ్- పుట-29,30)

ఈ కుల వృత్తుల్ని ఎవరు ఎలా మొదలు పెట్టారో ఎవ్వరికీ తెలీదు కానీ, కొన్ని వేల సంవత్సరాలుగా కొన్ని కులాలకు అదే జీవనాధారం. చాకలిగా, కుమ్మరిగా, మంగలిగా, గౌడగా, బెస్త, పద్మశాలీ, మాదిగ, తదితర కులాలకు వృత్తులు ఉన్నాయి. వీరికి అన్ని కులాలతో సంబంధాలు ఉంటాయి. కానీ రెడ్డి సరసన చేరి నవ్వేందుకు లేదు, మాదిగ సరసన చేరి ఏడ్చేందుకు లేదు. కమ్మ సరసన కూర్చునేందుకు లేదు. ఏ ఒక్క అగ్రకులం వీరిని అక్కున చేర్చుకోదు. వీరినందరినీ చిన్నచూపుగానే చూస్తారు కానీ కనీస గౌరవ మర్యాదలు ఉండవు. అందుకే చాలామది కుల వృత్తుల్ని వదిలేసి వేరు వేరు పనులు చేసుకుంటూ ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్ళిపోతుంటారు. అని సాయికిరణ్ ఆవేదన చెందారు.

"అక్షర సమరం" కవితా సంపుటిలో జంగ వీరయ్య "కులం"అనే కవితను చిత్రించారు.

"కులాల బలాల మూలాలను
గాలాలు వేస్తూ కులస్తుల
కళలు పూర్వము కళాకారులు వాళ్ళు
కళలన్నీ రూపాంతరము చెంది
వృత్తులైనవి చివరకు కులములైనవి
నాటి నుండి నేటివరకు జరుగుతుంది
నిత్యం ఓ సంఘర్షణ"[7]

సమాజంలో కులాలు ఎలా రూపాంతరం చెందాయో, అవి ఎలా ఏర్పడ్డాయో చిత్రిక పట్టారు వీరయ్య సామాజికమైన అణచివేతలకు వ్యతిరేకంగా విశ్వవ్యాప్తంగా జరుగుతున్న పెనుగులాటలన్నీ అస్తిత్వ పోరుదారులే. సమాజంలో మనుషులు రెండుగా విభజించబడటం, మూడుగా చీల్చివేయబడటం, నాలుగు ముక్కలుగా నరికివేయబడటం జరిగింది. చరిత్ర పొగుగునా ఇలాంటి సంఘటనలు అనేకం. అందుకే ఒక వ్యక్తిపై మరోవ్యక్తి ఒక జాతిపై మరో జాతి, ఒక దేశంపై మరోదేశం ఆధిపత్యం చెలాయించే స్థితినుంచి బయటపడేందుకు జరుగుతున్న రసాయనిక చర్యే అస్తిత్వ పెరుగులాట.

**ముగింపు :**

సమాజంలో సగానికి పైగా ఉన్న బహుజనం ఊసులు లేకుండా రాసేదైదైనా అది పరిపూర్ణ సాహిత్య చరిత్ర కాదు. అందుకే బహుజన కలాలు ఎగిసిన తర్వాతనే బిసివాద అస్తిత్వ ఉద్యమం తన చరిత్రను తాను రాసుకుంటూ పోతుంది. అనే పద్యంలో బిసి కులాల ఊసులు, బాధలు, కష్టాలు, ఆశలు, కన్నీళ్ళు, ఆశయాలు, ఆనందాలు, తమ కలపోతలు, తలపోతలు, తమ చేతివేళ్ళు సృష్టిస్తున్న సమస్త సంపదలు, తమనీడలు, తమ ఆలోచనల అగ్నులు అన్నింటినీ కలుపుకుంటే అది బహుజన సాహిత్య వనంగా ఈనేలాగా విస్తరించటం కనిపిస్తుంది.

**ఆధార గ్రంథాలు**

1. తెలుగులో కవిత్యోద్యమాలు - కె.యాదగిరి (సంపా)
2. వెలుగు రవ్వలు - మల్యాల మనోహరరావు
3. పూల పరిమళం - కోడెం కుమారస్వామి
4. పూల పరిమళం - కోడెం కుమారస్వామి
5. విశ్వవీణ - డా॥పెద్ది వెంకటయ్య
6. కవనతీగ - చిలుమోజు సాయికిరణ్
7. అక్షర సమరం - జంగ వీరయ్య



ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 3 (43) హైదరాబాద్ జనవరి : 2026

# గోల్కొండ కవుల సంచిక : తెలంగాణ తొలి సాహితీస్వరం – పాలమూరు కవుల ప్రతిధ్వని

**డా. స్వప్న భువకర్,** అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు, మహబూబ్ నగర్. ఫోన్ : 94902 35017

వ్యాస సంగ్రహం

**"నిజాం రాష్ట్రమున ఆంధ్రకవులు పూజ్యము"** అని గోల్కొండ కవుల పత్రిక తొమ్మిదవ సంవత్సరాది సంచికలో వచ్చిన ఈ వాక్యం, తెలంగాణ కవుల ఆత్మాభిమానాన్ని తీవ్రంగా సవాలు చేసింది. ఆ అవమానాన్ని ఎదుర్కొనడానికి, తమ అస్తిత్వాన్ని ప్రకటించడానికి, తెలంగాణ కవులు ఏకమై చేసిన తొలి ప్రయత్నమే గోల్కొండ కవుల సంచిక. ఇది తెలంగాణ సాహిత్యానికి తొలి అస్తిత్వ ప్రకటనగా నిలిచింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దకాలం గడిచిన ఈ సందర్భంలో, గోల్కొండ కవుల సంచికను మరోసారి స్మరించుకోవడం మన సాహిత్య బాధ్యత. ఈ సంచికలో మొత్తం తెలంగాణకు చెందిన 354 మంది కవులు ఉన్నారు. అందులో 108 మంది కవులు పాలమూరు (పూర్వపు మహబూబ్‌నగర్) జిల్లాకు చెందినవారు కావడం గర్వకారణం. ఇందులోని పాలమూరు కవుల రచనలు విభిన్న సాహిత్య శైలులను, భావప్రపంచాలను ప్రతిబింబించాయి. ప్రతి కవీ తన రచన ద్వారా ఓ ప్రత్యేక దృక్పథాన్ని ప్రతిపాదించాడు. ఈ పత్రికలో కలిసివున్న తెలంగాణ కవుల రచనలు సాహిత్య విభిన్నతను, ప్రాంతీయ స్వరూపాన్ని చక్కగా ఉదహరిం చాయి. ఒకప్పుడు కరువుక్షామములతో పేరుగాంచిన పాలమూరు జిల్లా, సాహిత్య పరంగా ఎంత సమృద్ధిగా వికసించిందో నేటి తరాలకు తెలియజేయడం అత్యంత అవసరం. ఈ వ్యాసం ద్వారా, తెలుగులో ఆధునిక శక ప్రారంభంగా చెప్పుకొనే 19వ శతాబ్దపు తొలినాళ్లలోనే తెలంగాణ సాహిత్యం, అందులోనూ పాలమూరు జిల్లా సాహిత్యం ఎలా అభివృద్ధి చెందిందో గోల్కొండ కవుల సంచికలోని రచనల ఆధారంగా విశ్లేషించబడుతోంది. సారాంశంగా చెప్పాలంటే, ఇటువంటి అరుదైన సాహిత్య సంపదను ఆధునిక ప్రపంచానికి పరిచయం చేస్తూ భవిష్యత్ తరాలకు ఈ మరిచిపోతోన్న సాహిత్యాన్నీ, వాటి విలువనీ అందించాలి.

**కీలక పదాలు :** తెలంగాణ సాహిత్యం, గోల్కొండ కవుల సంచిక, పాలమూరు కవులు, తెలంగాణ సాహిత్య అస్తిత్వం, తెలంగాణ కవుల ఆత్మాభిమానం, పాలమూరు సాహిత్య వారసత్వం.

**ప్రవేశిక :** ఒక్కోసారి చిన్నమాటే ఒక బృహత్కార్యానికి నాంది పలుకుతుంది. **"నిజాం రాష్ట్రమున కవి లేడు"** అన్న విమర్శ ఎదురైనప్పుడు, **"తెలుగునకు నిక్కమైన ఈ దేశమందు, కవివరేణ్యులు, పండితులు గలరు కలరు"** అనే ఉద్గారంతో తెలంగాణ సాహిత్య ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పేందుకు ఒక సాహసోపేతమైన చర్య ప్రారంభమైంది. ఈ భావనను సాక్షాత్కారం చేసేందుకు 1934లో సురవరం ప్రతాపరెడ్డి గారి సంపాదకత్వంలో గోల్కొండ కవుల సంచిక వెలువడింది. ఈ సంచికలో మొత్తం 354 మంది తెలంగాణ కవుల రచనలు వెలుగులోకి వచ్చాయి. ఈ సంచిక అమరచింత -- ఆత్మకూరు సంస్థాన ప్రభ్విణి శ్రీ శ్రీ శ్రీ సవైరాణి భాగ్యలక్ష్మమ్మ గారి ఆర్థిక సహాయంతో ముద్రింపబడి, వారికే అంకితముగా ఇవ్వబడింది. ఇందులోని పాలమూరు జిల్లాకు చెందిన కవుల ప్రాతినిధ్యం అత్యంత విశిష్టమైనది కావడంతో పాటు సంచికలోని సింహభాగం కవులు పాలమూరు వారే అవడం ఈ ప్రాంతానికి




గర్వకారణం. పాలమూరు కవులు చూపించిన సాహిత్య వైవిధ్యం, భావ పరిపక్వత, ప్రాంతీయ అనుభూతి ఈ ప్రాంత సాహిత్య వారసత్వాన్ని విశ్వానికి పరిచయం చేసే వేదికయ్యింది ఈ సంచిక.

ఈ వ్యాసంలో తెలంగాణ తొలి అస్తిత్వ ప్రకటనగా వెలువడిన గోల్కొండ కవుల సంచికలోని స్తోత్రములు, మహాపురుష ప్రశంస, శృంగారము, హితోపదేశము, సంచికా ప్రశంస, వివిధ వర్ణనలు, కథలహరి, ప్రబోధము, నిజాం రాష్ట్ర ప్రశంస, కవిత్వ తత్వము, సంకీర్ణము వంటి విభాగాలలో పాలమూరు జిల్లా కవులను గుర్తించి, వారి సాహిత్య స్వరూపాలు, అంశ వైవిధ్యాన్ని వివిధ కోణాల్లో పరిశీలించడం, విశ్లేషించడం జరిగింది. సంచిక నిర్వాహకులు పాలమూరు జిల్లా కవుల సంఖ్యను 87గా పేర్కొన్నారు. అయితే, వాస్తవానికి అందులో 108మంది పాలమూరు ప్రాంత కవులున్నారు. విశేషంగా చెప్పుకోవలసిన విషయం ఏమిటంటే, ఈ 108 మంది కవుల్లో ఇద్దరు స్త్రీ రచయితలు ఉన్నారు. ఈ గణనలో వచ్చిన వ్యత్యాసానికి గల కారణం, ఆ రోజుల్లో

తమ సాహిత్య ఆత్మాభిమానాన్ని తక్షణమే వ్యక్తీకరించాలనే తపన, వీలైనంత త్వరగా సంచికను ప్రచురించాలనే ఉత్సాహం అనిపిస్తుంది.

**పాలమూరు జిల్లా కవుల సాహిత్య విశ్లేషణ : గోల్కొండ కవుల సంచికలో ప్రాధాన్యత**

తెలంగాణ సాహిత్యంలో గోల్కొండ కవుల సంచిక ప్రత్యేకమైన మైలురాయిగా నిలిచింది. ఈ సంచికలో మొత్తం 11 విభాగా లున్నాయి. ప్రతి విభాగంలో పాలమూరు జిల్లా కవుల ప్రాధాన్యత స్పష్టంగా కనిపిస్తుంది.

**1. దేవతా స్తుతి విభాగం**

దేవతా స్తుతి విభాగంలో మొత్తం 94 మంది కవులు రచనలు చేసారు. అందులో 34 మంది పాలమూరు జిల్లా కవులు కావడం విశేషం. వీటి లో 13 సంస్కృత రచనలు కాగా 21 తెలుగు రచనలు. ఈ విభాగంలో విష్ణు, కృష్ణ, శివ, సరస్వతీ వేంకటేశ్వరస్వామి మల్లికార్జున రామ హయగ్రీవ స్తుతులతో పాటు, తమ ప్రాంత ప్రసిద్ధ క్షేత్రమైన కురుమూర్తి శ్రీనివాసునిపై ప్రత్యేకమైన స్తోత్రాలు రచించారు. ఈ అంశం పాలమూరుకు ఉన్న సాంస్కృతిక సంపదను స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. వనపర్తి సంస్థాన ధర్మాధికారిగా వ్యవహరించిన హొసదుర్గం కృష్ణమాచార్యులు సంస్కృతంలో రచించిన 'శ్రీనివాస విలాస' కావ్యం కురుమూర్తి క్షేత్ర శ్రీనివాసునిపై ఒక గొప్ప సాహిత్య రచనగా నిలిచింది. **"క్రీ.శ. 1867లో చెన్నపురి సరస్వతీనిలయ ముద్రాక్షరశాలలో ఆత్మకూరు సంస్థాన ప్రభువుల ఆజ్ఞ మేరకు ఈ కావ్యం ముద్రించబడింది. ఈ కావ్యము మొత్తం ఐదు ఉల్లాసాలుగా విభజించబడి, 439 శ్లోకాలతో పాటు 21 సుదీర్ఘ వచన భాగాలను కలిగి, మొత్తం 460 పద్య, గద్య భాగాలను కలిగి ఉంది."** హొసదుర్గం కృష్ణమాచార్యులు శ్రీనివాసవిలాస కావ్యాన్ని రచించి పూర్తిచేసిన తరువాత, ఆయనకు విశేషమైన గౌరవార్థం ఏర్పాటు చేశారు. మహారాజ సమక్షంలో, మంగళవాద్యాలతో ఊరేగింపుతో కూడి, ఆయనను గజారోహణ చేసి, ఊరేగింపుగా ఊరి వీధుల్లో ప్రదర్శించారు. అనంతరం ఆత్మకూరు విద్వత్సభలో రాజా బహదురు బహిరీ ముక్కర సీతారామ భూపాలుగారి సమక్షంలో "కవిఘటా గండభేరుండ" బిరుదు ఆయనకు మాన్యంగా ప్రదానం చేయబడింది. ఈ ఘట్టాన్ని కృష్ణమాచార్యులు తానే స్వయంగా ఒక శ్లోకంగా రచించి, తాను రచించిన గ్రంథనికి చివరన చేర్చారు. ఆ శ్లోకం క్రింద ఇవ్వబడినది.

**శ్లోకం: శ్రీమత్స్వాయిరాజా బహదరుబహిరీత్యాది చిహ్నాంకితస్య**
**శ్రీసీతారామభూమీపతిమకుటమణేర్ముక్కరాఖ్యాన్వయేందోః**
**సభ్యాస్సర్వేసమేతాస్సమధగజమహారోప్య సంచార్య వీధ్యాం**
**హర్షాద్యంతూర్యఘోషైస్సమదకవీఘటాగండభేరుండమాఖ్యన్**

ఈ కావ్యాన్ని తిరుపతి వేంకట కవులు తెలుగులో అనువదించడం ద్వారా పాలమూరు ప్రాంత మతపరమైన, సాహిత్యపరమైన విలువ మరింత విస్తరించబడింది. జటప్రోలు ఆస్థాన కవి వెల్లాల శివరామ శర్మ రచించిన ఆర్యా పంచకంలో సరస్వతి దేవి పై రాసిన శ్లోకంలో **"కొల్లాపూరీతి నగరే కుతుకేన నిత్యం సంవాసిని మభయదాం ప్రణతోస్మి భక్త్యా"** అని పేర్కొనడం ద్వారా పాలమూరు ప్రాంతం సాహిత్యాభివృద్ధికి ఒక సరస్వతీ నిలయంగా ఎలా నిలిచిందో అర్థమవుతుంది. అమరచింత ఆస్థాన కవి శ్రీమద్బాల సరస్వతి బుక్కపట్నం శ్రీనివాసాచార్యులు సంస్కృతం, ప్రాకృతం, శౌరసేనీ, పైశాచి భాషల్లో రచించిన 'శ్రీనివాస ధ్యాన సోపానం' విశేష ప్రాధాన్యతను కలిగి ఉంది. వీరు అష్టభాషా కోవిదులు, అష్టావధాన నిపుణులు. దక్షిణ భారతదేశంతో పాటు ఉత్తర భారతదేశంలోని అనేక సంస్థానాలు సందర్శించి తమ ప్రతిభతో జయపత్రాలు, గౌరవాలు పొందారు. ఆత్మకూరులో 'బ్రహ్మమత వర్షిణి' అనే వేదాంత సభను స్థాపించి, బ్రిటిష్ ప్రభుత్వం వారిచే సన్మానాలు పొందారు. ఆయన నిర్వహించిన అష్టావధానాల గురించి 'రాజహంస', 'మద్రాస్ మెయిల్ వంటి ఆ కాలపు ప్రముఖ పత్రికల్లో ముఖ్యంగా ప్రస్తావించ బడ్డాయి. బాలానగర్ ప్రాంతానికి చెందిన శ్రీ కంబము వీరరామయ్య రాయకల్లు రామలింగేశ్వర స్వామి మీద చెప్పిన సీస పద్యాల్లో సర్వలఘు పద్యం వారి ప్రతిభను తెలుపుతుంది. శ్రీ నంబాకం రాఘవాచార్యులు దశావతార స్తుతి శీర్షికతో రాసిన పది శ్లోకాల్లో ఒక్కో శ్లోకం ఒక్కో అవతారాన్ని ప్రశంసిస్తూ రాయబడింది. భట్టరాజు రామకృష్ణ ' కృష్ణా' శీర్షికతో –

**కం. శ్రీ మానిత కురుమతి గిరి**
**ధామ పరంధామ సుగుణధామ జలధర**
**శ్యామ రిపు భీమా విక్రమ**
**సోమార్య మనయన రామ సోదర కృష్ణా !**

వంటి చక్కని 6 కంద పద్యాలు రచించారు. గిరిధామ పరంధామ సుగుణధామగా ఆ కృష్ణుణ్ణి యమకాలంకార ప్రయోగంతో కీర్తించారు.

**2. మహాపురుష ప్రశంస విభాగం :**

ఈ విభాగంలో మొత్తం 23 రచనలకు గాను 6 రచనలు పాలమూరు కవులవి. వాటిలో గురుస్తుతి, శివాజీ ప్రశంస, వనపర్తి పాలకులు రామేశ్వర ప్రభు ప్రశంస వంటి అంశాలను పాలమూరు జిల్లా కవులు పొందుపరిచారు. వాటిలో శ్రీ దేవి ప్రసాద్ రచించిన 'యాదవ ప్రబోధము' ముఖ్యంగా చర్చించదగ్గది. వీరి 'యాదవ చంద్రిక' గ్రంథంలో యాదవజాతి చరిత్రను పరిశోధనాత్మకంగా వివరించే ప్రయత్నం చేశారు. కృతయుగంలో పరశురాముడు క్షత్రియుల సంహారానికి దండయాత్ర సాగిస్తున్నప్పుడు కొందరు రాజులు అడవులలో దాక్కొని గోపాలక వృత్తిని స్వీకరించారని వారే యాదవులని నిరూపించే ప్రయత్నం చేశారు. వీరు ఉర్దూ, హిందీ భాషల్లో పండితులుగా పేరుగాంచారు. 1951లో 'పల్లెటూరు' అనే పత్రికను స్థాపించి నడిపారు.

**3. శృంగారం**

ఇందులోని మొత్తం 19 రచనల్లో 6 రచనలు పాలమూరు కవులవి. గద్వాల ప్రాంతానికి చెందిన శ్రీ కర్నమడకల ఆనంతా చార్యులు రాసిన 'లలనా' లో స్త్రీ అందాన్ని వర్ణిస్తూ రాసిన పది శ్లోకాలున్నాయి. శ్రీ జాజాల వాసుదేవ శర్మ గారి 'మోహలతా' ఉత్పలమాల పద్యం లలితమైన భావంతో నిండినది. శ్రీ ఉదయరాజు శేషగిరి రావు 'మనోరమ' శీర్షిక తో చంపకోత్పలములలో రాసిన పద్యాలు చక్కని భావుకతతో నిండినవి.

**"పుత్తడి జిగ్గు నిగ్గు చినబుచ్చెడు మేని మెరగు వెల్లువల్ మత్తడి దూక"** .. అంటూ రాసిన పద్యాలు తెలంగాణ కవులు ఆధునిక భావ కవిత్వాన్ని ఆపోశన పట్టిన వారిగా కనిపిస్తారు.

**4. హితోపదేశ విభాగం**

ఈ విభాగంలో మొత్తం 23 రచనల్లో 6 పాలమూరు కవులవి. గద్వాలఅబశ్రీశ్రీకు చెందిన గొబ్బూరి సంజన రచించిన **'మనమా సత్పథ మాశ్రయించి మనుమా'** అనే పద్యాలు 'మానసబోధ' ద్వారా సమాజానికి మేలుకొల్పే సందేశాన్నిఅందించాయి. అమరచింత పద్మనాభయ్య రచించిన 'సామెత' పద్యాలలో 'కోతికి పుండు', 'గర్కటీ కులితగర్భము' వంటి సామెతలు చమత్కారంగా ప్రతిబింబించ బడ్డాయి. బుక్కపట్నం రంగాచార్యులు రచించిన 'వేశ్యా గర్హణము' సామాజిక బాధ్యతను చాటుతుంది. వేశ్య సంపర్కం దుష్ప్రభావాలను ఎత్తిచూపుతూ సమాజానికి మేల్కొలుపు ఇచ్చేలా రచించబడిన సీసపద్యాలివి.

**5. సంచికా ప్రశంస**

ఈ విభాగంలోని మొత్తం రచనల సంఖ్య 15. వాటిలో పాలమూరు కవుల రచనలు రెండున్నవి.అవి శ్రీ కవి రంగదాసు 'కుసుమము', శ్రీ పల్లా చంద్ర 'కవిసంచిక'. **"ఆంధ్ర కవీంద్ర సంస్కృత మహాత్ముల సత్కవితా విలాసముల్ సాంద్రత గూర్చె నీ కవుల సంచిక నామము గోల్కొండ"** అంటూ శ్రీ కవి రంగదాసు ఈ సంచిక గొప్పదనాన్ని తెలియపరచారు.

**6. వివిధ వర్ణనలు విభాగం**

ఈ విభాగంలో 76 రచనలు ఉండగా 22 రచనలు పాలమూరు కవుల సృజన. 'గున్నచింత', ' గొల్లడా', 'దంతము', 'నారికేళము' వంటి సాధారణ వస్తువులను సాహిత్యంగా మార్చి తమ సృజనాత్మక ప్రతిభను చాటారు. **"కాదేది కవితకనర్హం"** అనే విషయాన్ని పాలమూరు కవులు ఏనాడో గుర్తించి సాహితీ సృజన చేశారు. తాటిపర్తి గోపాలాచార్యులు రచించిన 'అధునాతన విద్యార్థి' శ్లోకాలు విద్యార్థుల బాధ్యతలను స్పష్టంగా తెలియజేశాయి. చెన్నమ్మ రాజు వెంకటేశ్వరరావు రచించిన 'భాగ్యపురోపవనము' పద్యాలు భాగ్యనగర ఉద్యానవనాల సౌందర్యాన్ని కళ్ళకు కట్టినట్లు వర్ణించాయి.

**7. కథలహరి విభాగం**

ఈ విభాగంలో మొత్తం రచనలు 13 కాగా 4 పాలమూరు కవుల రచనలు. వీటిలో సురవరం ప్రతాపరెడ్డి రచించిన 'హంవీర సంభవము' గమనించదగ్గది. వీరు గోల్కొండ కవుల సంచిక సంపాదకులు, బోరవెల్లి ప్రాంతానికి చెందినవారు. 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' వంటి ప్రఖ్యాత గ్రంథల ద్వారా తెలుగు సాహిత్యాన్ని




ధృడపరిచారు. 'హంవీర సంభవము' కథలో కాపు కన్య ధైర్య సాహసాలకు మెచ్చిన చిత్తూరు రాజు ఆమెను వివాహం చేసుకోవడం వారికి వీరాతివీరుడైన హంవీరుడు జన్మించడం గురించి చెప్పబడింది. ఇందులో చెప్పబడిన కాపు కన్య పాత్ర అచ్చమైన తెలంగాణ వనితకు ప్రతీక. ఈమె శౌర్య ప్రభ, వీరకాంతగా చెప్పడంతో పాటు 'విరబూసిన తంగేడు'గా చెప్పడంలో తెలంగాణ స్త్రీలు కేవలం అందంలోనే కాదు బుద్ధి కుశలత ధీరత్వం కలిగిన వారిగా చూపుతూ ఆనాటి సమాజానికి కనువిప్పు కలిగించారు,

**8. ప్రబోధము**

22 రచనలున్న ప్రబోధ విభాగంలో 4 పాలమూరు కవుల రచన లున్నవి. వట్టేము నరహరి రాసిన యువకులరా సీసపద్యము తెలంగాణ యువతలో ఉత్సాహం నింపుతూ కర్తవ్యాన్ని బోధించేది. దేశభక్తి ప్రబోధాత్మక భరతమాత, దేశమాత అంశాలతో రచనలు కలవు.

**9. నిజాం రాష్ట్ర ప్రశంస విభాగం**

పాలమూరు కవులు తమ స్వస్థల ప్రేమను వ్యక్తపరుస్తూ 'నిజాం రాష్ట్ర ప్రశంస' విభాగంలో గాఢమైన కవిత్వం అందించారు. ఈ విభాగంలో 12 రచనలు ఉండగా 3 రచనలు పాలమూరు కవులవి. శ్రీ తోపు వెంకటాచార్యులు రచించిన 'నిజాం రాష్ట్ర

ప్రశంస' మరియు శ్రీ పురాణం మల్లయ్య రచించిన 'రాష్ట్రాధికృత' వంటి పద్యాలు ఈ కోవకు చెందినవి. ఈ సంచిక ఆవిర్భావాన్ని ప్రకటించే పద్యాన్ని ఈవిభాగం లో చూడవచ్చు.

వెలయు నాస్థాన రాజముల్ గల నిజాము
రాష్ట్రమున గవి లేదని వ్రాయనగునె
తెలుగునకు నిక్కమైన యీ దేశమందు
కవి వరేణ్యులు పండితుల్ గలరు కలరు

**10. కవిత్వతత్వ విభాగం**

ఈ విభాగపు 9 రచనల్లో 5 రచనలు పాలమూరు కవులవి. శ్రీ బుక్కపట్నం రామచంద్ర కవి రచించిన 'భారతి' పద్యాలు చదువుల తల్లి గొప్పతనాన్ని చేయగా, శ్రీపతి వెంకటేశ్వర శాస్త్రి రచించిన 'భావకవి' పద్యాలు కవి మహత్యాన్ని చాటాయి.

**11. సంకీర్ణ విభాగం**

ఈ విభాగంలోని 45 రచనల్లో పాలమూరు కవుల భాగస్వామ్యం 16 రచనలు. శ్రీ హారతి దీక్షాచార్యులు, నంద్యాల అనంత రాఘవాచార్యులు, శ్రీ చింతామణి సింగరాచార్యులు రచించిన చాటువులు ప్రాధాన్యంగా కనిపించాయి.అమరచింత-ఆత్మకూర సంస్థాన ప్రభ్వీణి శ్రీ రాణి భాగ్యలక్ష్మమ్మ గారిని ప్రశంసిస్తూ జోస్యం వెంకటాచార్యులు, శ్రీ తిరుమల బుక్కపట్నం వెంకటాచార్యులు రచించిన శ్లోకాలు విశేషమైనవి. **'శ్రీ సాధ్వీమణి వివిధ సజ్జన కల్పవల్లి'** అని ఆమెను కీర్తించటం ఆమె ఔన్నత్యానికి అద్దం పడుతుంది.

ఈ విభాగంలో హారబంధం, వ్యాళ బంధం లాంటి శైలిలో రాసిన పాలమూరు కవుల బంధ పద్యాలు వారి సాహితీ వైవిధ్యాన్ని సృజనాత్మక ఆలోచనల్ని తెలియజేస్తాయి.

**స్త్రీ రచయితలు**

సంచిక నిర్వాహకులు మొత్తం 7 మంది స్త్రీ రచయితలను గుర్తించగా, నిశిత పరిశీలనలో ఆ సంఖ్య 10కి పెరిగింది. వీరిలో పాలమూరుకు చెందిన వారు ఇద్దరు.వారు శ్రీమతి బోయినపల్లి అండాలమ్మ, శ్రీ లక్ష్మీ దేవమ్మ. అండాలమ్మ రచించిన 'భరతమాత' సీస పద్యాలు భారతదేశ పౌరులను వీరులుగా, విద్యాసంపన్నులుగా చిత్రించాయి. లక్ష్మీ దేవమ్మ రచించిన 'దేశమాత' పద్యాలలో భారతమాత గొప్పతనాన్ని వర్ణించారు.

**ముస్లిం తెలుగు పండితులు**

పాలమూరు జిల్లాకు చెందిన ముస్లిం తెలుగు పండితులలో వ్యాపర్ల మహబూబ్ అలీ ప్రాధాన్యం పొందారు. ఆయన రచించిన పద్యంలో 'కవిలోకులు లోకోపకారలోలురు మిత్రా' అని కవుల సామాజిక బాధ్యతను ఉద్ఘాటించారు.

వీరితో పాటు కల్వకుర్తికి చెందిన మార్చాల రామాచార్యులు కవిగానే కాకుండా, ప్రతిభావంతుడైన చిత్రలేఖకుడిగా కూడా ప్రసిద్ధి చెందారు. గోల్కొండ కవుల సంచికకు ముఖచిత్రం రూపొందించిన ఘనత ఈయనదే. ఆయన రూపొందించిన చిత్రాలకు సుజాత మాస పత్రిక కూడా ప్రాధాన్యతనిచ్చి ప్రచురించింది. అదేవిధంగా, మార్చాల రంగాచార్యులు కూడా పాలమూరు సాహిత్య వేదికపై ప్రత్యేక స్థానం పొందిన కవి. కచటతపలు లేకుండా ప్రవహించే పద్య ప్రవాహం ఆయన కవిత్వ శైలికి గొప్ప నిదర్శనం. వీరు రచించిన సర్వలఘు సీసపద్యం పాలమూరు కవుల సాహిత్య నైపుణ్యానికి ప్రతిఫలంగా నిలిచింది. ఈ ఇద్దరు మార్చాల కుటుంబానికి చెందిన కవులు పద్య రచనలో, చిత్రలేఖనంలో, సాహిత్యానికి అందించిన సేవలు పాలమూరు జిల్లాలోని సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయి.

**ముగింపు**

గోల్కొండ కవుల సంచికలో పాలమూరు జిల్లా కవులు అందించిన సాహిత్య సహకారం అనిర్వచనీయం. వీరి సాహిత్య సంపదలో సంస్కృతం, తెలుగు భాషలలో పాండిత్యం, భిన్నాంశాలపై రచనలు, బహుభాషా ప్రావీణ్యం, సృజనాత్మకత ప్రతిఫలించాయి. ఈ కవుల విస్మృత సాహిత్య సంపదను వెలికితీసి ఆధునిక సమాజానికి అందించడం అత్యంత అవసరం. దానికై 'గోల్కొండ కవుల సంచిక -- పాలమూరు జిల్లా కవులు' అనే పేరుతో ప్రత్యేక గ్రంథం వెలువడేలా తెలంగాణ సాహిత్య అకాడమీ చర్యలు చేపట్టాలి. అలాగే, పాలమూరు జిల్లా కవుల ముద్రిత, అముద్రిత రచనలను సేకరించి ప్రజలముందుకు తీసుకువచ్చి సాహిత్య చరిత్రలో వారి స్థానాన్ని సుస్థిరం చేయాలి.

**ఉపయుక్త గ్రంథసూచి**

1. గోలకొండ కవుల సంచిక - సం. సురవరం ప్రతాపరెడ్డి - ముద్రణ, 1934.

2. శ్రీనివాస విలాసః - సంస్కృత చంపూ కావ్యం హెుసదుర్గం కృష్ణమాచార్య కథితం, శ్రీనివాస విలాసము - తెనుగు సేత తిరుపతి వేంకట కవులు - సం. వైద్యం వేంకటేశ్వరాచార్యులు , 2023

3. శ్రీ కురుమూర్తి క్షేత్ర శతక సాహిత్యం - సం. వైద్యం వేంకటేశ్వరాచార్యులు, 2018.



ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 3 (47) హైదరాబాద్ జనవరి : 2026

# స్ఫూర్తి ప్రదాత - వివేకానందుడు

డా. టంగుటూరి సైదులు, తెలుగు అధ్యాపకులు, నాగార్జున ప్రభుత్వ కళాశాల, నల్లగొండ. ఫోన్ : 9912 676267



**"లెండి! మేల్కోండి! గమ్యం చేరేవరకు విశ్రమించకండి! . మీలోనే సర్వశక్తులున్నాయి. బలమే జీవనము బలహీనమే మరణము"** అని ఈ దేశ నుదుటి రాతను మార్చడానికి వచ్చిన కారణజన్ముడు స్వామి వివేకానంద. భారతదేశాన్ని జాగృతం చేసి ఈ దేశాన్ని పరమ వైభవ స్థానంలో నిలిపిన ధర్మ రక్షకుడు. తన అద్భుత వాగ్భూషణంతో ప్రపంచ దేశాలను సమ్మోహనులను చేసిన ఘనుడు స్వామి వివేకానంద. 1863 జనవరి 12న విశ్వనాథ దత్త భువనేశ్వరి దేవి దంపతుల కు కలకత్తా నగరంలో నరేంద్ర దత్త జన్మించారు.

ఈ దేశం పరాయి రాజ్యపాలనలో చిక్కుకొని కొట్టుమిట్టాడుతున్న సందర్భంలో స్వాతంత్ర్య భావ ప్రేరక కాంతిపుంజంలా ఆవిర్భవించిన మహా మనీషి వివేకానందుడు. కేవలం 38 సంవత్సరాలు ఆయన జీవించినా భారతీయులకు విశ్వానికి మరో 15 వందల సంవత్సరాల వరకు చైతన్యాన్ని ప్రసాదించే భావజాలను దేశం నిండా గుప్పించిన నిర్భయ ప్రబోధకులు స్వామి వివేకానందుడు. నరేంద్రుడు చిన్ననాటి నుండి ఎంతో ప్రజ్ఞ కలిగిన బాలుడు మరియు ఏకసంథాగ్రాహి. రామకృష్ణ పరమహంస శిష్యులు. భగవంతుని గురించి తెలుసుకోవాలని ధ్యాసతో రామకృష్ణ పరమహంసను చేరి దివ్య తేజస్సును పొందారు.

1892 సంవత్సరంలో భారతదేశం అంతటా పర్యటించి ప్రజలకు సన్నిహితులయ్యారు. స్వామివారు దేశంలోని యువతపై ఎంతో నమ్మకం ఉంచారు. ఇనుప కండలు ఉక్కు నరాలు వజ్ర సంకల్పం కలిగిన 100 మంది యువకులను ఇచ్చినట్లయితే ఈ దేశ భవిష్యత్తును మార్చి దేశానికి ఉన్నత స్థితిలో నిలపవచ్చని యువతపై విశ్వాసాన్ని ప్రకటించారు.

1893 సంవత్సరం సెప్టెంబర్ 11వ తేదీన వివేకానందుడు అమెరికాలోని చికాగో పట్టణంలో జరిగిన విశ్వ మత మహాసభలలో హైందవ ధర్మ ప్రతినిధిగా ప్రసంగించారు.

**భారత భూమి నా మహోన్నత స్వర్గం భారత శ్రేయస్సు నా శ్రేయస్సు మాతృదేవతను ఆరాధించని మనిషి ఏనాటికి ఔన్నత్యాన్ని అందుకోలేడు ఆత్మ స్వాతంత్రాన్ని అరికట్టండి. అజ్ఞానం నుండి బయటికి వచ్చేయండి.** ఈ మాటలన్నీ ఈశ్వర ప్రేరిత మహా వక్త స్వామి వివేకానందులవి.

భారతదేశం మీద పెత్తనం చెలాయి స్తున్న బ్రిటిష్ వారికి అనుకూలంగా ఉన్న అమెరికాలో కఠోర సత్యాన్ని ప్రవచిస్తూ హైందవ సింహంలా విజృంభించడం అంటే అల్లాటప్పా విషయం కాదు. అన్ని మత సాంప్రదాయాల వారిని సమన్వయం చేయడమంటే మామూలు విషయం కాదు.

ఉపన్యాస ప్రారంభంలోనే స్వామి వివేకానందులు 'అమెరికా సోదర సోదరీమణులారా! అని సంబోధించారు. ఈ సంబోధన ప్రపంచానికే కొత్తది. అంతే ఆ మహాసభలోని వారంతా ఆనందాతిశయంతో నిర్విరామంగా బ్రహ్మాండంగా కరతాళ ధ్వనులు చేశారు. ఆ తర్వాత స్వామీజీ మనఃపూర్వకంగా వారు పలికిన స్వాగతాన్ని అభినందించారు. ఈ అభినందన వందనాలతో అమెరికా ప్రజలు పులకించిపోయారు. హిమాలయ పర్వతం నుండి జాల్వారే గంగా ప్రవాహంగా సాగిపోతున్న వివేకానందుని ప్రసంగానికి వశమై పోయారు.

**"అమెరికా సోదర సోదరీమణులారా! సహనాన్ని సర్వమత సత్యత్వాన్ని ప్రపంచానికే ప్రబోధించిన ధర్మం నా సనాతన ధర్మమని నేను గర్విస్తున్నా. మేం సర్వమత సహనం సర్వత్ర ఆకాంక్షిస్తాం. సర్వమతాలు ప్రబోధిస్తున్నవన్నీ పరమ సత్యాలు గాని మేం విశ్వసిస్తాం వివిధ దేశాలలోని ప్రజలందరూ పీడన తాడనకు గురై శరణాగతులుగా మా దేశానికి వచ్చారు వారందరినీ నా దేశం ఆదుకొన్నదని గర్విస్తున్నా పీడనకు గురైన యూదులకు, జొరాష్ట్రియన్లకు నా దేశం నా సనాతన ధర్మం ఆదరించిందని స్వాభిమానంతో చెప్పుకొంటున్నాను. నేను చిన్నతనంలోనే పారాయణం చేసిన ఒక స్తోత్రాన్ని మీరు వినండి. వివిధ ప్రదేశాల్లో పుట్టిన నదులు సముద్రంలో సంగమిస్తున్నాయి. అనేక భావాలతో ఈ మనుషులు అనుసరిస్తున్న వివిధ ఆరాధనామార్గాలు వక్రంగా అవక్రంగా ఎలా కనిపించినా...ఓ సర్వేశ్వరా! అవన్నీ నిన్నే చేరుతున్నాయి.**

**ఎవరు ఏ రూపంతో నన్ను గ్రహిస్తారో నేను వారినట్లే అనుగ్రహిస్తాను ఎవరెవరు ఏ మార్గాలను అనుసరించిన చివరకు నన్నే చేరుతున్నారు అని భగవద్గీత చెబుతున్నది. ఈ మతసభలోని వారంతా ముక్తకంఠంతో ఆ విషయాన్నే చెబుతున్నారు"** అనగానే వేలాదిమంది కరతాల ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు.

ఈ వేదిక శాంతి పాఠాన్ని ప్రవచిస్తుందని నేను ఆశిస్తున్నాను. సర్వమత దురభిమానం వలన పుట్టిన మూర్ఖాభినివేశం ఈ సందర్భంగా ప్రపంచాన్ని చాలాకాలం కిందనే ఆక్రమించింది. ఆ కారణంగానే ఈ భూమి మీద దౌర్జన్యం జరిగింది ఈ ఘోర రాక్షస కృత్యాలు జరగకపోతే ఈ సమాజం ఎంతో అభివృద్ధి చెందేది ఇక సర్వమత దురభిమానం తొలగిపోతుంది. పరమత ద్వేషం ఉండదు తనకు తెలిసింది గొప్ప అని అనుకోవడం వల్లనే ఈ అభిప్రాయ భేదాలు వస్తున్నాయి.

వేదాలు అంటే గ్రంథాలు కావు వివిధ సమయాల్లో వివిధ వ్యక్తులు, ఋషులు కనుగొన్న ఆధ్యాత్మిక విషయ దర్శనాలే వేదాలు. మీరంతా అమృత పుత్రులు. జీవుడే బ్రహ్మ స్వరూపుడు అని వేదాలు అంటున్నాయి. ముక్తి అంటే పరిపూర్ణత. దుఃఖం తదితర బంధనాల నుంచి బయటపడడమే అయితే ఈ బంధాలను భగవంతుని దయవలని తొలగిపోతాయి. నిర్మల హృదయంతో భగవంతుని అనుగ్రహాన్ని సాధించాలి అని అన్నారు మొత్తం 7 ఉపన్యాసాలు ఇచ్చారు. పై విషయమంతా ఆ ఉపన్యాసాల సారాంశమే.

స్వామి వివేకానంద గురించి అనేకమంది రచనలు చేశారు తెలుగు సాహిత్యంలో ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి గారు శివమెత్తిన చికాగో, శ్రీ గింజల నరసింహారెడ్డి గారు విశ్వగీతి వివేకానంద స్మృతి పద్య కావ్యాన్ని రచించారు, ఈ కావ్యంలో నరసింహారెడ్డి గారు వివేకానందుని సన్నిధిలో నీలోని నీవు బాగా బయటికి వస్తావు అని మహోన్నత స్థాయిలో నిలబడతావని స్ఫూర్తిని నింపారు.

**యువత జీవితాన్ని మార్చిన వివేకానంద సూక్తుల సారం :**

దారి తెలియక అనేక సంశయాలతో కొట్టుమిట్టాడుతున్న యువతలో సర్వశక్తులు మీలోనే ఉన్నాయి అని విశ్వసించండి, ఆత్మవిశ్వాసం కలిగి ఉండండి గొప్ప విశ్వాసాల నుండి మహత్తర కార్యాలు సాధించబడతాయి అని ఆత్మవిశ్వాసాన్ని నింపాడు. పరాజయాలను పట్టించుకోకండి అవి సర్వసాధారణం అవే జీవితానికి మెరుగులు దిద్దేవీ ఓటమి లేని జీవితం ఉంటుందా అని ధైర్యాన్ని ఇచ్చారు. లెండి! మేల్కోండి! గమ్యం చేరేవరకు విశ్రమించకండి. అంటూ యువతలో చైతన్య దీప్తిని వెలిగించారు. పట్టుదల వదలకుండా చేసే ప్రయత్నం చివరకు విజయాన్ని చేకూరుస్తుంది. ఒక రోజులో దేన్నీ సాధించలేము అని ఒక లక్ష్యంతో కృషి చేస్తే నేడు కాకపోయినా రేపైనా విజయం సాధిస్తాం అని దృఢంగా నమ్మండి అని, విజయం సాధించడంలో కొన్ని ఇబ్బందులు కలగవచ్చు దానికి కృంగిపోవద్దని మానవుడు ఎంత గొప్పవాడు అయితే అంత కఠినమైన పరీక్షలు దాటవలసి ఉంటుందని, విజయం పొందాలంటే అంతులేని పట్టుదల ప్రభలమైన సంకల్ప శక్తిని నీవు కలిగి ఉండి విజయతీరాలను చేరాలని, యువతను లక్ష్యం వైపు కార్యోన్ముఖులను చేశాడు.

యువత ఆత్మ న్యూనత భావాన్ని కలిగి ఉండొద్దని ఆత్మవిశ్వాసాన్ని కలిగి ఉండాలని మీరు ఎలా ఆలోచిస్తే అలా తయారవుతారు. బలహీనమని భావిస్తే బలహీనులు అవుతారు శక్తిని స్మరిస్తే శక్తిమంతులు అవుతారని అపారమైన విశ్వాసం అనంతశక్తి ఇవే విజయ సాధనకు మార్గాలవుతాయని, లక్ష్యం పైన ఉన్నంత శ్రద్ధాసక్తులను లక్ష్యసాధనలో సైతం చూపించాలి అదే విజయ రహస్యమని. నిత్య సాధన నిరంతర కృషి తప్పక విజయాన్ని సాధిస్తుందని నేటి యువతకు మార్గదర్శనం చేశారు. ఒక వ్యక్తి సమాజంలో ఎదిగి ఏ విధంగా నిలబడాలో స్వామి వారు చెప్పారు. మొదట విధేయతను అలవర్చుకోండి సేవకుడిలా ఉండడం నేర్చుకుంటే నాయకుడయ్యే యోగ్యత లభిస్తుందని దానికి కొంత సమయం పడుతుందని అంతవరకు ఓపికతో నిరీక్షించాలని అంటారు. మానవునికి శీల సంపదను వృద్ధిచేసి మనోబలాన్ని పెంపొందించే బుద్ధిని వికసింపజేసి స్వశక్తితో విశ్వాసాన్ని పెంచే విద్య మనకు కావలసింది అని, విద్య అందరికీ భూషణం లాంటిదని విద్య వల్లనే మానవుడు ఉన్న స్థితి నుంచి ఉన్నతస్థితిలో నిలబడ గలుగుతాడు, సమాజంలో మానవున్ని విద్య అత్యున్నత స్థాయిలో నిలబెడుతుంది , కావున దానికోసం శక్తి వంచన లేకుండా కృషి చేయాలని ఉద్బోధించారు. Not me But you నాకోసం కాదు మీకోసం అనే జాతీయ సేవా పథకం సూక్తి వివేకానందుల వారిదే మానవు సేవాభావాన్ని కలిగి ఉండాలని పరోపకారార్థం ఇదం శరీరం అని తెలిపారు.

స్వామి వివేకానందుడు తక్కువ కాలం జీవించిన భారతదేశము యొక్క కీర్తి ప్రతిష్టలను ప్రపంచ స్థాయిలో నిలిపి భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేసిన కారణజన్ముడు. వివేకానందుడు అందరివాడు విశ్వమానవ శ్రేయస్సు కోసం నిరంతరం ప్రయత్నం చేసిన వారు. మంత్రముగ్ధమైన మాటలచే ప్రపంచాన్నంత సమ్మోహన స్థితిలో ఉంచినవారు, గురుపరంపరతో ముందుకు నడిచి ఆత్మ పరమాత్మ తత్వాన్ని లోకానికి అందించిన మహనీయుడు. ఆయన కొన్ని వర్గాలకు మాత్రమే పరిమితమైన వారు కారు. ఆయన యొక్క బోధనలను విశ్వమంతా ఆచరించాల్సి ఉంది, నేడు మీడియా ప్రభావంతో పాశ్చాత్య ప్రభావంతో యువత పెడ త్రోవన పడుతుంది, యువతను సన్మార్గంలో నడిపించడానికి పాఠశాల స్థాయి నుంచి స్వామివారి సూక్తులను వారి బోధనలను పరిచయం చేసినట్లయితే విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదమవుతుంది. సరైన దారి చూపేవారు లేక లోకంలో విపరీతాలు మనం చూస్తున్నాం, కావున ఈ యువతనంతా మంచి నైపుణ్యం కలిగిన వారిలా తీర్చిదిద్ది దేశ ప్రగతి కోసం యువత కృషి చేస్తే కచ్చితంగా ఏదో ఒక రోజు ఈ దేశం పరమ వైభవ స్థానంలో తప్పకా నిలుస్తుంది.

**(వివేకానంద జయంతి సందర్భంగా...)**

f

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 3 (49) హైదరాబాద్ జనవరి : 2026

# వ్యాకరణ శాస్త్ర సంబంధ ఔచిత్యరీతులు : ఆముక్తమాల్యద

**డా. రాంభట్ల పార్వతీశ్వర శర్మ**, పోస్ట్-డాక్టోరల్ ఫెలో (NTS-I, CIIL) ఆంధ్రవిశ్వకళాపరిషత్, విశాఖ పట్నం.
ఫోన్ : 9247859580

**వ్యాససంగ్రహం:**

కావ్యంలో ప్రధానమైంది, రసానికి జీవితాన్ని, చమత్కృతిని కలిగించేది ఔచిత్యం. పండితులు ఆనందించేలా క్షేమేంద్రమహాకవి ఔచిత్యవిచారచర్చ చేశాడు. పదవాక్యాది ఆశీ:పర్యంతం 27 ఔచిత్యభేదాలను నిర్వచించి, సంస్కృత కావ్యనాటకాల నుండి ఉదాహరణ, ప్రత్యుదాహరణలను ప్రదర్శించాడు. తెలుగులో అలంకారశాస్త్ర ప్రస్థానాల చర్చల్లో ఔచిత్యాన్ని స్పృశించని వారుండరు. వేంకటరామకృష్ణకవులు క్షేమేంద్రకృతి సారాన్ని పద్యీకరించారు. జమ్ములమడక మాధవరామశర్మ, పుల్లెల శ్రీరామచంద్రుడు, కాశీభొట్ల సత్యనారాయణ, చెలమచర్ల రంగాచార్యులు, టి. భాస్కరరావు తెలుగులో శాస్త్రీయంగా వ్యాఖ్యానించారు. విశ్వవిద్యాలయాల పరిశోధనల్లో జంధ్యాల జయకృష్ణబాపూజీ శ్రీనాథకవిత్వానికి (1972), యు.ఎ. నరసింహమూర్తి పింగళి సూరన కవిత్వానికి (1980), పి. సుమతీనరేంద్ర తిక్కన భారతంలో తొలి రెండు పర్వాలకు (1982), ప్రస్తుతవ్యాసకర్త ప్రాచీన పంచకావ్యాలకూ (2016) క్షేమేంద్రుడి ఔచిత్యసిద్ధాంతాన్ని అన్వయించారు. ప్రస్తుత పరిశోధనవ్యాసం ఆముక్తమాల్యద ప్రబంధంలోని వ్యాకరణశాస్త్ర సంబంధమైన ఔచిత్యరీతులను సోదాహరణంగా విశ్లేషిస్తుంది. కావ్యరచనలో వ్యాకరణశాస్త్రం, ఔచిత్యసమాదరణపై ప్రాచీనకవుల కున్న ప్రత్యేకశ్రద్ధను, సూక్ష్మదృష్టిని ఈ పరిశోధన తెలియజేస్తుంది. వ్యాకరణమంటే సంధి సమాస విధులను బోధించే సామాన్యవిజ్ఞానమే కాక, కావ్యరచనలో కీలకపాత్రను పోషించే విశిష్టశాస్త్రంగా ఈ వ్యాకరణౌచిత్య చర్చ ద్వారా సుస్పష్టమౌతుంది.

**కీలకపదాలు:** క్రియ, కారకం, లింగం, వచనం, విశేషణం, ఉపసర్గ, నిపాత, కాలం, వ్యాకరణం, ఔచిత్యం.

## 1. ప్రవేశిక :

క్షేమేంద్ర మహాకవి 'ఔచిత్యవిచారచర్చ' అనే గ్రంథంలో 27 రకాల ఔచిత్యాలను నిర్వచించి, సంస్కృతంలో లక్ష్యాలను పేర్కొన్నాడు. వాటిని మూడు కారికల్లో- **పదే వాక్యే ప్రబంధార్థే గుణేలంకరణే రసే, క్రియాయాం కారకే లింగే వచనేచ విశేషణే, ఉపసర్గే నిపాతేచ కాలేదేశే కులేవ్రతే, తత్త్వే సత్త్వేప్యభిప్రాయే స్వభావే సారసంగ్రహే, ప్రతిభాయా మవస్థాయాం విచారే నామ్న్యథాశిషి, కావ్యస్యాంగేషుచ ప్రాహు రౌచిత్యం వ్యాపిజీవితమ్** (ఔ.వి.చ. 8-10 శ్లోకాలు) అని నిక్షిప్తం చేశాడు. క్షేమేంద్రుడి ఔచిత్యవిచారచర్చ గ్రంథంలో ఎలాంటి ఉపవిభాగాలు లేకపోయినా, అవగాహనా సౌలభ్యం కోసం కొందరు పూర్వవిమర్శకులు ఔచిత్యరీతుల్ని వర్గీకరించారు. ఔత్తరాహ విమర్శకులతో పాటు జమ్ములమడక మాధవరామశర్మ మీమాంస, సాహిత్య, వ్యాకరణ, అంతరంగసమీక్షణ సంబంధ ఔచిత్యరీతులుగా పేర్కొన్నారని యు.ఎ. నరసింహమూర్తి పేర్కొన్నారు. వీటిలో క్రియౌచిత్యం నుండి కాలౌచిత్యం వరకు ఉన్న ఔచిత్యభేదాలను వ్యాకరణశాస్త్ర సంబంధ ఔచిత్యరీతులుగా గుర్తించి, ఈ ఎనిమిది రకాల ఔచిత్యాలకు ఆముక్తమాల్యద నుండి లక్ష్యాలను పరిశోధించి ఇక్కడ ప్రదర్శిస్తున్నాను.




### 2.1 క్రియాపదౌచిత్యం:

తెలుగులో క్రియలకు విశిష్టస్థానం ఉంది. బాలవ్యాకరణంలో క్రియాపరిచ్ఛేదం తెలుగు ధాతువులకు చేసే ప్రత్యయవిధానాలను స్పష్టం చేస్తుంది. కావ్యాలలో ఈ క్రియాపద ప్రయోగంలో ఔచిత్యం పాటించాని క్షేమేంద్రుడు పేర్కొన్నాడు. గుణాలు, మంచి వృత్తాలు, సాధుత్వంతోపాటు క్రియౌచిత్యం కూడా కావ్యంలో ఉంటే సత్పురుషుడిలాగ రాణిస్తుంది. మంచిగుణాలు, నడవడిక, మంచితనమున్న వ్యక్తికి.. అతడు 'చేసే పనుల్లో' కూడా ఔచిత్యం ఉంటే మరింతగా ప్రకాశిస్తాడు. అలాగే గుణవంతమైన, చక్కని వృత్తాలతో కూడిన, వ్యాకరణ సాధుత్వమున్న కావ్యంలో క్రియాపదౌచిత్యముంటే బాగుంటుందని క్షేమేంద్రుడు సూచించాడు. ఖాండిక్యకేశిధ్వజ సంవాదంలో ఇలాంటి ఔచిత్యముంది. అవిద్యాస్వరూపాన్ని వివరించే సందర్భంలోని ఈ కింది పద్యంలోని క్రియాపదం ప్రకరణానికి తగిన విధంగా ఉండడం వల్ల ఔచిత్యవంతమైంది.

**ఆ.వె॥ ఏ నవిద్యవలన మృత్యువుఁ దరియింప**

**ననఘు, రాజ్యములు మఖాదికములుఁ, జేయుచున్న వాఁడ; క్షీణింపఁ జేయుదుఁ, బుణ్యఫలము భోగభుక్తిచేత.** (3వ ఆశ్వా. 64వ పద్యం). రాజులకు ప్రీతికరమైన రాజ్యాన్నికాకుండా – మోక్షవిద్యను గురుదక్షిణగా ప్రసాదించమని ఖాండిక్యుడు కేశిధ్వజుణ్ణి అడిగాడు. కేశిధ్వజుడు **"నా స్వాభావికమైన బ్రహ్మనిష్ఠనుండి కలిగిన ప్రమాదాన్ని దాటాలని కోరుకొని, అందుకు సాధనంగా యజ్ఞాలు చేస్తున్నాను. అయినా పూర్వం చేసుకొన్న కర్మ ఫలితం ఈ సంసార జీవితాన్ని బలపరుస్తోంది. అందువల్ల ముక్తి లభించదు. అందుకే భోగాన్ని అనుభవిస్తూ ఆ ఫలాన్ని తగ్గించడం కోసం రాజ్యపాలన చేస్తున్నాను"** అని ఖాండిక్యుడితో చెప్తాడు. ఈ పద్యంలో 'తరించు' క్రియాపదం. 'తృ తరణే' అన్న అర్థాన్ని శబ్దకల్పద్రుమ నిఘంటువు సూచించింది. 'దాటడం' అన్న అర్థాన్ని ఈ క్రియ బోధిస్తోంది. శబ్దరత్నాకరం **"సముద్రములోనగు వానిని ఓడలోనగు సాధనములచే దాటు"** అన్న విశేషార్థాన్నిచ్చింది. 'అవిద్య' అంటే మఖాదికర్మ. ఎప్పుడెప్పుడో చేసుకొన్న కర్మలఫలితం సంసారసాగరంలో చిక్కుకొనేలా చేస్తుంది. అందువల్ల ఈ సంసారసముద్రాన్ని దాటడానికి రాజ్యపాలన, యజ్ఞాలు చెయ్యడం మొదలైన సత్కర్మల్ని సాధనాలుగా కేశిధ్వజుడు ఎంచుకొన్నాడు. పూర్వజన్మల పుణ్యఫలాన్ని క్షీణింపజేయడానికి భోగానుభవాన్ని సాధనంగా పేర్కొన్నాడు. **"ప్రారబ్ధం భోగతో నశ్యేత్"** అన్న వాక్యం దీనికి ఆధారం. ఈ విధంగా ఇక్కడ 'తరియించు' అన్న క్రియాపదం అవిద్యాస్వరూపాన్ని తెలపడంలో ప్రకరణోచితంగా ఉంది.

**2.2 కారకౌచిత్యం :**

క్రియతో అన్వయించేది, క్రియను పుట్టించేది – కారకం. విభక్తి అని తాత్పర్యం. ప్రకృత్యర్థాన్ని విభజించేది విభక్తి. ఈ కారకం ఆరువిధాలు. బాలవ్యాకరణంలో తత్సమపరిచ్ఛేదం ప్రథమాది సంజ్ఞా సూత్రాలైన మొదటి ఏడు విధిసూత్రాల ద్వారా ఏ విభక్తుల్లో ఏ ప్రత్యయాలు చేరుతాయో నిరూపిస్తుంది. ఏ కారకంలో ఏయే విభక్తులు చేరుతాయో, ఒక విభక్తి స్థానంలో మరే ఇతర విభక్తులు చేరడానికి అవకాశం ఉంటుందో కారకపరిచ్ఛేదం వివరిస్తుంది. **"సర్వవిభక్తః సంస్కృతతుల్యా"** అనీ, **"అన్యస్యాః క్వచి ద్ధువేర్వ్యాన్యా"** అనీ చింతామణి పేర్కొంది. తెలుగు కారకవ్యవస్థలో కూడా ఇదే పద్ధతి కనిపిస్తోంది. క్షేమేంద్రుడు ఈ కారకౌచిత్యాన్ని విభక్తిప్రత్యయాల ననుసరించి వివరించాడు. వంశానికి అలంకారమైన ఐశ్వర్యం ఔదార్యంతో కూడిన నడవడికతో ప్రకాశించేటట్లు, కారకాలతో మంచి అన్వయంతో కూడి, వాక్యం కూడా ప్రకాశిస్తుందని చెప్పి, వీటిలో కర్తృ, కర్మ, కరణ వంటి.. ఆరు కారకాలకూ లక్ష్యాలను పేర్కొన్నాడు. ఆముక్తమాల్యదలో కర్తృపద కారకౌచిత్యాన్ని పరిశీలిద్దాం. విష్ణుచిత్తుడనే పరమభాగవతుడి కథ ఉంది. అతడు విలుపుత్తూరులోని మన్నారుస్వామి వక్షఃస్థలాన్ని తులసిమాలలతో అలంకరిస్తూ, సేవిస్తూ ఉంటాడు. ఒకరోజు ఆ స్వామి ఆజ్ఞాపించగా మధురానగర రాజాస్థానంలో 'పరతత్త్వ' నిర్ణయం చేసి పాండ్యరాజును వాదంలో ఓడించి వస్తుండగా, మార్గమధ్యంలో విష్ణువుని చూసి దశావతార స్తోత్రం చేస్తాడు. అందులో భాగమైన రామావతారస్తుతిలో కృష్ణదేవరాయల ముద్రగా సమాసభూయిష్ఠమైన రచన ఉంది. ఈ పద్యంలో అరివీరభయంకరుడైన శ్రీరాముడి బాణవర్ణనలో రౌద్ర రసాలవాలంగా క్రోధం వ్యక్తమౌతోంది. సీ॥ **స్యందనస్థితబిడౌజః క్షత్తృజాడ్యకృ ఝంఝూ మరుద్గరు ఝాత్కృతములు, క్రవ్యాశిరాడ్గాత్ర కన దసృగ్గాహన స్ఫుటశల్య హవ్యభు క్ఛూత్కృతములు, యోధవర్మిత హృత్పుటోత్క్రాంత నిజపాత సాలాశ్మకృత ముహుస్థాత్కృతములు, పతితోగ్ర రక్షః కబంధభారభృశార్తి భుగ్న భోగ ఫణీంద్ర ఫూత్కృతములు,**
**తే.గీ॥ శ్రాంతరథ్య నిరంతర చ్ఛాయదములు, దివ్యతావకకార్ము కోత్ప్రేరికములు, కలుషము లండచుఁ గాత లంకాపురాంగణాంబర చలత్కలంబ కదంబకములు** (4వ ఆశ్వా. 27వ పద్యం). **"శ్రీరామా! పదునైన నీబాణాలు వింటినుండి ముందుకు వేగంగా దూసుకొని వెళుతూ, ఝంఝూప్రభంజనాన్ని సృష్టించి, సారథి అయిన మాతలికి జడత్వాన్ని కలిగిస్తూ, రథవేగాన్ని మందగింప జేస్తున్నాయి. రాక్షసరాజైన రావణాసురుడి శరీరంలో దిగబడి అతని రక్తం తగలడంతో అగ్నిలాంటి ములుకులతో 'చుయ్' అని శబ్దం చేస్తున్నాయి. కవచాలు ధరించిన శత్రువీరుల హృదయకోశాల్ని చీల్చుకొని వెళ్ళి, అక్కడి కోట గోడల బండరాళ్ళకు తగిలి 'ఠామ్మని' మోగుతున్నాయి. తమ దెబ్బలచేత తలలు తెగి నేలమీద పడుతున్న రాక్షసుల మొండేల బరువుకి ఆదిశేషుడి పడగలు కుంగిపోవడంతో ఆ బాధతో అవి బుసకొడుతున్నాయి. అలసిపోయిన రథాశ్వాలకు ఎడతెరపి లేకుండా నీడనిస్తున్నాయి. అలా దివ్యమైన నీ కోదండంనుండి వెలువడుతూ లంకాపుర గగన వీథుల్లో విహరించే నీ బాణపరంపరలు మా సకల పాపాలను కూల్చివేయాలి"** అని శ్రీరామబాణ పరంపరల ప్రభావవిన్యాసాన్ని శ్రీకృష్ణదేవరాయలు సమాస భూయిష్ఠంగా వర్ణించాడు. ఈ పద్యంలో **'కలంబ కదంబకములు'** కర్తృపదం. అంటే శ్రీరామబాణాలు. సందర్భం రామరావణయుద్ధం. రావణుడిమీద రాముడి బాణపరంపరల తీవ్రతను ఈ పద్యంలో రాయలు అత్యంతభీకరంగా వర్ణించాడు. **"కల్యతే క్షిప్యత ఇతి కలంబః – కల కిల క్షేపే – వేయఁబడునది."** అని 'కలంబ' శబ్దానికి వ్యుత్పత్తి. కలంబసమూహాల పరంపర రావణసేనమీద విజృంభిస్తోంది. వాటి ప్రభంజనంతో వినిపిస్తున్న ఝూత్కృతాలు, వేడి ములుకులు రావణుడి దేహంలో గుచ్చుకోవడంతో పుడుతున్న ఛూత్కృతాలు, శత్రువీరుల రొమ్ములు చీల్చుకువెళ్ళి కోటగోడల్ని తగలడంలోని ధ్వనిస్తున్న ఠాత్కృతాలు, శల్యమైన రాక్షసశరీరాలు నేలమీద పడుతూ ఉంటే వాటి భారాన్ని మోయలేక ఆదిశేషుడి పడగల ఫూత్కృతాలు మొదలైన వాటికి ఈ కలంబ కదంబకాలే కారణం. కోదండం నుండి వినిర్ముక్తమై ప్రభంజనాన్ని సృష్టించాయి. రావణుడి దేహాన్ని తొలిచివేశాయి. లంకానగరాన్ని

నిర్వీర్యం చేశాయి. రాక్షసుల్ని తుద ముట్టించాయి. ఎడతెరపి లేకుండా ఆకాశమంతా వ్యాపించడం వల్ల ఆ బాణచయం గుర్రాలకు నీడనిస్తున్నాయి. అలాంటి అమ్ములు పాపవినాశకాలని కూడా కవి స్తుతి. శ్రీరాముడి వీరత్వం, రామరావణ యుద్ధబీభత్సం ఈ 'కలంబకదంబకాల' వర్ణనతోనే తెలియవస్తున్నాయి. రాక్షస సంహారమనే శ్రీరామావతార లక్ష్యాన్ని నిరూపించడంలో, రాయలు ప్రయోగించిన "కలంబ కదంబక" మనే కర్తృపదం క్రియతో చక్కగా అన్వయించి, వాక్యార్థాన్ని భాసింపజేస్తూ ఔచిత్యవంతంగా ఉంది. ఇదే విధంగా ఇతర కారకౌచిత్యాలకూ లక్ష్యలక్షణ సమన్వయం చేయవచ్చు.

**2.3 లింగౌచిత్యం :**

సంస్కృతంలో శబ్దాలకు విధించిన లింగవ్యవస్థ తెలుగులో మహత్, అమహత్, మహతీవాచకాలుగా ఆ అర్థబోధక సామర్థ్యం ఉన్న ప్రత్యయాల చేరికతో వ్యక్తమౌతూ ఉంటుంది. కానీ స్త్రీలను, పురుషులను, పశుపక్ష్యాదులను తెలిపే సందర్భాలలో ఆయా లింగవ్యవస్థకు యోగ్యమైన శబ్దాలనే ప్రయోగించడం ఔచిత్యం అని క్షేమేంద్రుడి ఉద్దేశం. కవులకు ఈ ఔచిత్య నిర్వహణకు ఎంతో కోశజ్ఞానం, వ్యుత్పత్తి ఉండాలి. రాజలక్షణం చేత భవ్యత్వాన్ని పొందే శరీరంలాగ, లింగౌచిత్యంతో కావ్యం కూడా భవ్యత్వాన్ని పొందుతుంది. క్షేమేంద్రుడు తన 'లలితరత్నమాల' గ్రంథంలో నుండి **"నిద్రాం న స్పృశతి త్యజత్యపి ధృతిం ధత్తే స్థితిం నక్వచిత్.... పరాంగనా పరిగతం నామాపి నోసహ్యతే"** అన్న శ్లోకాన్ని ఉదాహరణగా పేర్కొన్నాడు. ఈ శ్లోకంలో రత్నావళీ విరహంతో బాధపడుతున్న వత్సరాజు మన్మథావస్థను విదూషకుడు వివరిస్తున్నట్లుంది. **"నిద్రను స్పృశించడంలేదు. ధృతిని విడిచిపెట్టాడు. స్థితిని ధరించడంలేదు. దీర్ఘకథను వ్యథగా భావిస్తున్నాడు. నిర్వృతిని భజించడం లేదు. ఆమె లేకపోవడంతో ఆమెగుణాలను జపిస్తూ, నిత్యం ధ్యానిస్తూ ఉన్నాడు. ఇతర స్త్రీల పేరును కూడా విని సహించలేక పోతున్నాడు."** అని శ్లోకార్థం. ఇందులో నిద్రా- స్థితి - ధృతి - కథా - నిర్వృతి శబ్దాలు స్త్రీలింగాల్లో ప్రయోగించడం.. స్త్రీత్వ ఆరోపణ స్పష్టమౌతూండడం లింగౌచిత్యమని చెప్పాడు. రమణీయమైన వర్ణనలకు నిలయమైన ఆముక్తమాల్యదలో వసంతకాలవర్ణనలోని పద్యం లింగౌచిత్యాన్ని ప్రకటిస్తోంది.

**చ॥ చిగురుఁ బికాళికి, న్ఫలముఁ జిల్కల గుంపునకు, న్మధూళిఁ దేఁ, టిగమికి, దావి గాలికి, విటీవిటకోటికిఁ బువ్వులుం, దలం, బుగఁ గృప నీవియు న్సురభి పుంస్త్వముఁ బాంథులచోటఁ బూనె; న, ట్లగుఁ బ్రజ కోర్కు లిచ్చుతన కార్మ్యఁ దలంచిన దబ్బ దే యనన్**
(5వ ఆశ్వా. 142వ పద్యం). "ఆ వసంతర్తువు కామధేనువుగా (సురభి) కోకిలలకు చిగుళ్ళను, చిలుకలకు పళ్ళను, తుమ్మెదలకు తేనియలను, గాలికి సువాసనను, ప్రేమికులకు (విటీవిటులకు)




పువ్వులను, ప్రసవించి తన స్త్రీత్వ ధర్మాన్ని నెరవేర్చింది. ఇక అందరి కోరికల్నీ తీర్చే తనకు తన మనస్సులోని కోరికమాత్రం తీరదా! అన్న నమ్మకంతో తన పురుషధర్మాన్ని - కర్కశత్వాన్ని - పాంథులపట్ల ప్రదర్శిస్తోంది. ఫలితంగా ఆ వసంతం శుకపికాదులకు ఆహ్లాదాన్ని, పాంథులకు విరహాన్ని పెంచడంద్వారా ఖేదాన్ని కలిగిస్తోంది" అని భావం. 'సురభి' శబ్దానికి స్త్రీలింగంలో 'కామధేనువు' అని, పుంలింగంలో 'వసంతచైత్రాలు' అని అర్థాలు. **"....సురభి స్తు గవి స్త్రియామ్, వసంతచైత్రయో: పుంసి త్రిషు సౌమ్య సుగంధినో:"** (నానార్థరత్నమాల) వసంతర్తువు కోకిల మొదలైనవాటికి క్షేమంకరమైనా, బాటసారులకు బాధాకరమైందని చెప్పడంకోసం 'సురభి' అన్న శబ్దానికున్న లింగవైవిధ్యాన్ని చక్కగా కవి ఈ సందర్భంలో వినియోగించాడు. రమణీయమైన ఈ వర్ణనలో స్త్రీత్వ ధర్మాన్ని బోధించే విషయంలో 'సురభి' శబ్దం స్త్రీలింగంగాను, పుంభావ బోధకత్వంలో అదే శబ్దం పులింగంగాను శోభించడంతో ప్రస్తుత వర్ణన సహృదయ హృదయానందకరంగా ఔచిత్యవంతమైంది.

**2.4 వచనౌచిత్యం :**

దైన్యం లేకపోవడంతో ధన్యమయిన మనస్సున్న విద్వాంసుల ముఖంలాగ, కావ్యం ఉచితమయిన ఏక, ద్వి, బహువచనాల చేత శోభిస్తుంది. క్షేమేంద్రుడు తన 'నీతిలత' నుండి ఉదాహరణగా **"త్రైలోక్యాక్రమణై ర్వరాహ విజయై ర్నిస్సంఖ్య రత్నాప్తిభి:.... సకృదుద్యమ(శ్రమవశాద్వ్యాసక్త నిద్రం హరిం"** అన్న శ్లోకాన్ని పేర్కొన్నాడు. ఇందులో విష్ణువుకంటే రావణుడి గొప్పదనాన్ని కవి వర్ణిస్తున్నాడు. విష్ణుపరంగా ఒక్కసారే జరిగిన త్రివిక్రముడిగా ముల్లోకాల్ని ఆక్రమించడం (లోకాలపై ఎక్కువసార్లు దండెత్తడం), కౌస్తుభరత్నాన్ని పొందడం (నిత్యం సముద్రం నుండి ఎన్నో రత్నాల్ని పొందడం), లక్ష్మీదేవిని వరించడం (రాజ్యలక్ష్మిని) మొదలయిన విషయాల్ని చెప్తూ రావణుడు ఆ యా కార్యాల్ని విష్ణువు కంటే ఎక్కువసార్లు నిర్వర్తించడం వల్ల రావణుడి గొప్పతనం తెలియ వస్తోంది. ఈ విధంగా వచనౌచిత్యం బహువచన రూపంగా ఇక్కడ విరాజిల్లిందని క్షేమేంద్రుడు పేర్కొన్నాడు. విష్ణుచిత్తీయంలో మన్నారుస్వామి పరమభాగవతుడైన విష్ణుచిత్తుణ్ణి **"పాండ్యరాజు**

**ఆస్థానంలో విష్ణుమహిమను తెలిపి, సత్కారాన్ని స్వీకరించి, వైరాగ్యభావంతో ఉన్న పాండ్యరాజును విష్ణుభక్తుడిగా చేయమని"** ఆనతిస్తాడు. అంతటి భారాన్ని తనమీద పెట్టిన మన్నారుస్వామితో విష్ణుచిత్తుడు పలికిన మాటల్లో వచనౌచిత్యం భాసించింది.

శా॥ **స్వామీ! నన్ను, నిత:పురాపఠితశాస్త్రగ్రంథజాత్యంధు, నారామక్ష్మా ఖననక్రియాఖరఖనిత్రగ్రాహితోద్యత్కిణ స్తోమాస్నిగ్ధకరు, న్భవద్భవనదాసు, న్వాదిఁ గాఁ బంపుచో, భూమీభృత్సభ నోటమైన నయశంబు ల్మీకుఁ గాకుండునే?** (2వ ఆశ్వా. 90వ పద్యం).

**"స్వామీ! నేను ఇంతకుముందు తర్క వేదాంతాది శాస్త్రాలను చదివిన వాణ్ణి కాను. కేవలం అజ్ఞానిని. మీతోటలో మట్టితవ్వడానికి కఠినమైన గడ్డపారతో పనిచేసినందువల్ల నా చేతులు గురుకుగా కాయలు కాచాయి. మీ గుడి దాసుణ్ణి నేను. ఇలాంటి నన్ను వాదిగా మధురకు పంపితే, ఆ రాజాస్థానంలో అపజయం కలిగితే మీకు అపకీర్తులు రాకుండా ఉంటాయా?"** అని విష్ణుచిత్తుడు మన్నారు దేవుడితో అన్నాడు. ఈ చెప్పిన విశేషణాలన్నీ విష్ణుచిత్తుడి అసామర్థ్యాన్ని తెలిపేవిగా ఉన్నాయి. 'స్వామీ' అన్న సంబోధనతో పద్యం ప్రారంభం కావడం విశేషశిల్పం. శ్రీవైష్ణవం ప్రకారం భగవంతుడే యజమాని. భక్తుడు అతడి ఆజ్ఞను అనుసరించే సేవకుడు మాత్రమే. అందుకే 'భవద్భవనదాసున్' అని విష్ణుచిత్తుడు అన్నాడు. 'భూమీభృత్' ఒక దేశానికి ఏలిక. భగవంతుడు జగత్తు అంతటికీ రారాజు. భగవంతుడికి సామంతుడిలాంటి రాజు సభకు శాస్త్ర గ్రంథాలు చదువని విష్ణుచిత్తుడిలాంటి అజ్ఞాని వెళితే తద్వారా కలిగే 'అయశములు' – అతణ్ణి పంపిన దైవానికే. దాసుడికి కాదు. అందువల్ల విష్ణుచిత్తుడికి ఏమాత్రం అపకీర్తి ఉండదు. అసమర్థుడికి కలిగే అపకీర్తి అతడి మీద అంత ప్రభావాన్ని చూపదు. కాని యజమాని, జగన్నాథుడైన విష్ణువుకే 'అయశంబుల్' అనడంలో బహుత్వం, దాని ప్రభావతీవ్రతను ఉత్కటత్వాన్ని తెలిపుతూ ఔచిత్యవంతంగా ఉంది.

### 2.5 విశేషణౌచిత్యం:

గుణోదారుడైన సజ్జనుడు గుణాధికులైన మిత్రులతో ఎలా ప్రకాశిస్తాడో అలాగే కావ్యంలో విశేష్యార్థం తగిన విశేషణాలతో ప్రకాశిస్తుంది. క్షేమేంద్రుడు తన 'మునిమతమీమాంస' నుండి **"చైత్రే సూత్రితయవ్వనాన్యు పవనా న్యామోదినీ పద్మినీ..... క్షిప్రక్షయం జీవితం"** అన్న శ్లోకాన్ని లక్ష్యంగా పేర్కొన్నాడు. ఈ శ్లోకంలో 'జీవితం' అన్న విశేష్యానికి **'మృ న్నిర్మిత మామ భాజన మివ'** అన్న విశేషణపదంతో చక్కని సౌందర్యం కలుగుతుండడంతో ఇక్కడ విశేషణౌచిత్యం ఉందని క్షేమేంద్రుడు చెప్పాడు. ఆముక్తమాల్యదలో కనిపించే వర్ణనలన్నీ కవి స్వయం ప్రతిభావ్యక్తాలుగా తోచుతాయి. ఈ కావ్యంలో నూత్నమైన కల్పనలతో కవి తన ప్రతిభను చాటుకొన్నాడు. మాలదాసరికథలోని ఒక పద్యంలో చెప్పదల్చుకొన్న భావానికి అనుగుణమైన వర్ణనతో తగిన విశేషణపదాల ప్రయోగంవల్ల విశేషణౌచిత్యం భాసించింది. ఆ.వె॥ **ఊఁత నీరు చెలఁది నేఁత మూటాయిటి, దూది యెండపసుపు దొట్టియక్క, రంబు మేను దీని రహిఁ బుణ్య మమ్ముట, కప్పురంబు వెట్టి యుప్పు గొనుట** (6వ ఆశ్వా. 62వ పద్యం). **"ఈ శరీరం చేపల్నిపట్టే ఊత (ఒక సాధనం)లో వచ్చిన నీళ్ళు లాంటిది. సాలెపురుగు నేతలో ముడిచి ఉంచిన బూరుగు దూదిలాంటిది. ఎండలోని పసుపు, దూలంలో పురుగు తొలిచిన తొర్రి అక్షరం లాంటిది. అలాంటి శరీరం మీద ఉన్న మమకారంతో పుణ్యాన్ని అమ్ముకోవడం ఎలాంటిదంటే కర్పూరాన్ని ఇచ్చి ఉప్పును కొనుక్కోవడం లాంటిది."** అని శరీరాన్ని గురించి దాసరి బ్రహ్మరాక్షసుడితో అన్నాడు. ఇక్కడ దేహం క్షణికమైందని, ఎన్నో జన్మల్లో ఎన్నో శరీరాల్ని జీవుడు దాలుస్తున్నాడని, అందువల్ల దేహం కోసం పుణ్యాన్ని విడిచిపెట్టనని దాసరి అంటాడు. ఈ పద్యంలో 'మేను'కు కవి వాడిన విశేషణపదాలు ఎంతో ఔచిత్యవంతంగా ఉన్నాయి. ఊతనీరు, చెలదినేత మూటాయిటి దూది, ఎండ పసుపు, తొర్రి అక్కరం (బోసినోటితో ఉచ్చరించే అక్షరం) మొదలైన విశేషణాలు అస్థిరమైన లక్షణాలతో ఉంటాయి. చేపల్ని పట్టడానికి వాడే 'ఊత' అనే సాధనంలో నీళ్ళు నిలబడవు. అంటే క్షణికమని భావం. సాలెపురుగు నేసిన నేతలో ముడిచి పెట్టిన బూరుగు దూదితో ఉపయోగం ఉండదు. ఎండలో పసుపును ఉంచితే వర్ణహీనం ఔతుంది. బోసినోటివాడుచ్చరించే అక్షరానికి శోభ ఉండదు. ఈ విధంగానే మేను – శాశ్వతమైంది కాదని, తృటిలో నశించేదని తెలిపే నిత్యానిత్య వస్తు విచారణలో విశేషణపదాలు ఔచిత్యవంతంగా ఉన్నాయి.

### 2.6 ఉపసర్గౌచిత్యం :

సన్మార్గంలో ప్రవర్తించడంవల్ల వృద్ధిపొందే ఐశ్వర్యంలాగ, తగిన ఉపసర్గలతో కావ్యం ఉన్నతిని పొందుతుంది. క్షేమేంద్రుడు తన 'మునిమతమీమాంస' నుండి **"ఆచారం భజతే త్యజత్యసి మదం వైరాగ్యమాలంబతే కర్తుం వాంచతి సంగభంగగలితోత్తుంగాభిమానం తపః ......కర్మణ్యతాం"** అన్న శ్లోకాన్ని లక్ష్యంగా పేర్కొన్నాడు. ఇందులో ఉత్+తుంగ = ఉత్తుంగ అన్న పదవిభజనలో 'ఉత్' అన్న ఉపసర్గ ఔచిత్యవంతంగా ఉందని, దుర్మదం వల్ల కలిగే అభిమానం (అహంకారం) ఆధిక్యం తెలియడంతో ఇక్కడ ఉపసర్గౌచిత్యం తెలియవస్తోందని వివరించాడు. ప్రాదులను ఉపసర్గలుగా సంస్కృత వ్యాకరణం పేర్కొంది. మాలదాసరికథలో అతడి వైష్ణవభక్తి పరాయణత్వాన్ని వర్ణించిన సందర్భంలోని పద్యంలో ఉపసర్గ సమంచితంగా ఉంది.

శా॥ **గండా భోగముల న్మృదగ్రులహరు ల్గప్ప న్నుతు ల్పాడి యా, దండ గ్వేగులు డించి భక్తి జనితోద్యత్తాండవం బాడు నా, చండాలేతరశీలుఁ దుత్పులకుఁడై చాండాలిక న్మీఁటుచున్, గుండు ల్నీరుగ నెండ గాలి పసి తాఁకుం జూడ కా ప్రాహ్ణమున్.** (6వ

ఆశ్వా. 7వ పద్యం) ఆ మాలదాసరి విష్ణువు సేవించడానికి గుడి దగ్గరకు వెళ్ళేవాడు. **"తన ఒంటిమీది బరువులన్నింటినీ దించి ఒక పక్కన పెట్టి, వెడల్పైన చెక్కిళ్ళమీద ఆనంద బాష్పాలు జాలువారుతూ శరీరమంతా పులకరించిపోతూ ఉంటే చేతి కిన్నెరను మీటుతూ, ఎండ, గాలి, ఆకలిదప్పులు- అన్నీ మరచి రాళ్ళు కరిగేలా గొంతెత్తి పాడుతూ భక్తితో ఆనందతాండవం చేసేవాడు. అలా మధ్యాహ్నం వరకూ విష్ణువును సేవించి సాష్టాంగంగా నమస్కరించేవాడు."** ఇక్కడ "చండాలేతరశీలుడు ఉత్+పులకుడై చాండాలికన్" అన్నాడు కవి. పులకుడు అనడంతోనే దాసరి భక్తివలన పుడుతున్న సాత్వికభావం తెలుస్తోంది. 'ఉత్' ఉపసర్గప్రయోగంతో ఆ మాలదాసరి భక్త్యావేశంతో చేసే తాండవం ప్రత్యక్షమై ఈ ఉపసర్గ ఔచిత్యవంతమైంది. అలాగే "ఉద్యత్తాండవంబాడు" అన్నచోట కూడా 'ఉత్' అన్న ఉపసర్గ ఎత్తుగడతోనే మాలదాసరి నాట్యంలో వేసే గంతుల్ని స్ఫురింపజేస్తోంది. ఈ విధంగా రాయలు ప్రయోగించిన ఉపసర్గలు ఔచిత్యవంత మయ్యాయి.

**2.7 నిపాతౌచిత్యం :**

గ్రహించదగిన, తగినస్థానాల్లో ఉంచదగిన నిపాతలచేతకూడా కావ్యానికి అర్థసంగతి కలుగుతుందని క్షేమేంద్రుడి ప్రస్తావన. 'అర్థసంగతి' అంటే అర్థం తగిన విధంగా ఉండడం. సంస్కృతంలో చ, తు, హి మొదలైనవి నిపాతలు. వీటిని సముచిత స్థానాల్లో ప్రయోగిస్తే కావ్యార్థంలో ఎలాంటి సందిగ్ధత ఉండదని క్షేమేంద్రుడు 'వృత్తి'లో పేర్కొన్నాడు. **"ఉపాదేయై శ్చాదిభి: నిపాతై: ఉచితపదవీ నివేశితై: కావ్యస్యార్థసంగతి: అసందిగ్ధా సత్సహాయైరివ భవతి"** అని 'చ' మొదలైన నిపాతల ప్రయోగాన్ని బట్టి కూడా ఔచిత్యానౌచిత్యాలను విధించాడు. కానీ తెలుగులో వీటికి ప్రయోగాలు లేవు. 'తెలుగులో భావస్ఫూర్తిని కలిగిస్తూ, రసపోషక సాహాయ్యకాలయిన 'కట', 'భళీ' మొదన అవ్యయాలే నిపాతలు' అని చెలమచర్ల రంగాచార్యులు శ్రీ కాళహస్తి మాహాత్మ్యం పీఠికలో తెలిపారని ఆంధ్రకవుల ఔచిత్యవిచారణలో కాశీభొట్ల సత్యనారాయణ పునరుద్ఘాటించారు (పుట. 63). రంగాచార్యులే స్వయంగా "ఆంధ్రౌచిత్య విచారచర్చ"లో తెలుగులో నిపాతల గురించి చెప్పారు. **"సంస్కృతమున ప్రాదులు నిపాతములు. తెలుగులో తత్సమానార్థకములు 'ను' మొదలగునవి నిపాతములన జెల్లును. ఈ నిపాతము లాయా యర్థములకు దగినట్లు ప్రయోగింపబడినచో సంశయాదులను బోనాడి మంత్రులవలన రాజులకు అర్థ సంగతివలె కావ్యార్థము నుల్లసిలజేయునని భావము. అద్రవ్యవాచకములైన చాదిగణపఠిత శబ్దములును, ప్రాదులును నిపాతము లనబడును. లక్షణముచే రూపనిష్పత్తి కలుగకపోగా విశేషవిధిగా వ్యాకరణాదులచే బఠింపబడిన శబ్దములను నిపాతము లందురు. చూ. 'చాదయోకసత్వే'- (1-4-57 అష్టాధ్యాయి) చ, వా, హ, అహ, ఏవ, ఏవమ్, నూనమ్ మొదలైనవి చాదులు (గణపాఠము ప్రథమాధ్యాయము). 'ను' (సముచ్చయము), భళి, బాపురే, మజ్జా, అయ్యారే మొదలగు ప్రశంసార్థకములు; ఔర, ఆహా, అద్దిర, ఓహో యాశ్చర్యార్థకములు; అయ్యో, అక్కటా, కట్టా, కటాకటా ప్రభృతులగు సంతాపార్థకములు; అ, ఎ, ఏ అవధారణార్థకములు; కా, కదా, కాదే**




**'కిలార్థకములు' ఇట్టివి తెలుగున నిపాతము లనదగినవి"** (పుట. 85-86) అని పేర్కొన్నారు. ఆముక్తమాల్యదలోని ఖాండిక్యకేశిధ్వజుల కథలో ఒక పద్యంలో శ్రీకృష్ణదేవరాయలు వాడిన 'నిపాత' తగినవిధంగా ఉంది.

**తే.గీ॥ మతియుఁ గోరిన వారి యక్కఱలు తీర్చి, యును మన:పూర్తి చాల కొయ్యనఁ దలంచి, 'యకట గురుదక్షిణ యొసంగ నయితి' నంచు, మగుడఁ జని శంక నతఁడు సంభ్రమపడంగ** (3వ ఆశ్వా. 53వ పద్యం). యజ్ఞంలో వచ్చిన అవాంతరాన్ని తీర్చుకోవడానికి కేశిధ్వజుడు తన శత్రువైన ఖాండిక్యుడి దగ్గరకు వెళ్ళి దానికి నిష్కృతిని తెలుసుకొని వచ్చి యజ్ఞాన్ని పూర్తిచేస్తాడు. ఋత్విక్కులు మొదలైనవాళ్ళని సంభావనలతో తృప్తిపరుస్తాడు. **"అడిగిన వాళ్ళందరికీ లేదనకుండా వాళ్ళు కోరిన కోర్కెల్ని తీర్చాడు. అప్పటికీ అతని మనస్సులో ఏదో వెలితి మిగిలిపోయింది. చప్పున అతనికో విషయం గుర్తొచ్చింది. 'అయ్యో! గురుదక్షిణ ఇవ్వడం మరిచానే!' అంటూ మళ్ళీ అడవికి వెళ్ళి ఖాండిక్యుణ్ణి కలుసు కొన్నాడు."** ఈ పద్యంలో 'అకట' అన్న నిపాత సంతాపార్థకంగా ఉంది. కేశిధ్వజుడు యజ్ఞాన్ని పూర్తిచేశాడు. తనివి చెందలేదు. అందరికీ కావలిసినవన్నీ ఇచ్చి తృప్తి పరిచాడు. అయినా మనసులో ఏదో చింత ఉంది. అది యజ్ఞంలో కలిగిన విఘ్నానికి నిష్కృతిని తెలిపిన గురు సమానుడైన ఖాండిక్యుడికి గురుదక్షిణ ఇవ్వకపోవడం వల్ల కలిగిన చింత. కేశిధ్వజుడు తనతో యుద్ధం చేయడానికి వస్తున్నా దేమో అని ఖాండిక్యుడు

తొట్రుపడతాడు. ఈ మనోవ్యథ, కేశిధ్వజుడి అసంతృప్తి – రెండూ 'అకట' అన్న నిపాతతో వ్యక్తమౌతున్నాయి. అందువల్ల ప్రకరణోచితమైన అర్థస్ఫోరకంగా ఉన్న 'అకట' అన్న నిపాత ఈ పద్యంలో ఔచిత్యవంతమైంది.

**2.8 కాలౌచిత్యం :**

సమయానికి తగిన వేషంతో సౌందర్యాన్ని పొందే సత్పురుషుల శరీరంలాగ, కాలానుగుణంగా ఏర్పడిన ఔచిత్యంతో కూడిన వాక్యంకూడా అందంగా ఉంటుంది. క్షేమేంద్రుడు కాలౌచిత్యాన్ని నిరూపించడానికి భూత, వర్తమాన, భవిష్యత్ కాలాలకు మూడింటికీ వేరు వేరుగా లక్ష్యాలను చూపించాడు. విష్ణుచిత్తుడి కథలో మత్స్యధ్వజుడైన వల్లభదేవుడు రాచనగరులోనే మరో అంత:పురంలో ఉన్న తన భోగపత్నితో సమాగమానికి బయలుదేరుతాడు. వైభవోపేతంగా, నడిచేవచ్చే మేరుపర్వతంలా ఆ రాజు భోగిని అంత:పురానికి వెళుతున్నప్పుడు మార్గమధ్యంలో ఓ విప్రుడి ఇంటికి సమీపించే సమయానికి ఒక పరదేశి విప్రుడు అరుగుమీద ఉన్న తోటి బ్రాహ్మణులతో సుభాషితాన్ని వల్లెవేస్తాడు. ఈ సందర్భంలో రాయలు రాసిన ఈ కింది పద్యంలో కాలోచితమైన విషయం ఔచిత్య వంతంగా ఉంది.

చం॥ **వినియె, 'నెల ల్చతుర్వయిని వృష్టిదినాలికి, రాత్రికై దివం, బున, జరకై వయస్సునను, బూని, పరంబున కిప్పు, దుద్యమం, బనువుగఁ జేయఁగా వలయు' నంచుఁ బురోహితధర్మ మాత్మఁ గీ, ల్కొన నలవిప్రుఁ డాద్విజులలోన సుభాషితము న్పఠింపఁగన్.** (2వ ఆశ్వా. 76 పద్యం). **"వర్షపురోజుల్లో సుఖంగా గడవాలంటే మనిషి తక్కిన ఎనిమిది నెలలు బాగా కష్టపడి పనిచేయాలి. రాత్రి బాగా గడవాలంటే పగలంతా బాగా శ్రమించాలి. ముసలితనంలో హాయిగా కూర్చొని తినాలంటే బాగా వయసులో ఉన్నప్పుడే కష్టపడాలి. పరలోకంలో సుఖపడాలంటే అందుకోసం ఇహలోకంలో కష్టపడాలి."** ఈ పద్యంలోని అన్ని ఉదాహరణలు భవిష్యత్కాలంకోసం మునుపే కష్టపడాలని సూచిస్తున్నాయి. వర్షాకాలమైన నాలుగుమాసాలకు కావలిసిన వస్తుసామగ్రిని మిగలిన ఎనిమిది మాసాల్లోను, రాత్రికోసం పగలు, ముసలితనం కోసం యవ్వనంలోను, పరలోకం కోసం వర్తమానశరీరంతోను చేయాల్సిన ప్రయత్నాలను బాగా చేయడం వల్ల బంగారు భవితవ్యం ఉంటుందనే న్యాయం ఇందులో సుభాషితంగా తెలుస్తోంది. ఈ వర్తమానకాలికకృషి, భవిష్యదర్థకమైన ప్రయోజన సమన్వయంతో ఇక్కడ కాలౌచిత్యం భాసించింది.

**ఉపసంహారం :**

కావ్యంలో ఔచిత్యానౌచిత్యాలను విమర్శిస్తే కావ్యం మొత్యాన్ని విమర్శించినట్లే. శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదలో వ్యాకరణశాస్త్ర సంబంధ ఔచిత్యాలను యోగ్యమైన రీతిలో పోషించి రసోపనిషత్తు, కావ్యానికి ప్రాణమైన ఔచిత్యానికి పట్టం గట్టాడు. వ్యాకరణమంటే కేవలం సంధి, సమాసాల వ్యవస్థను శాసించేది మాత్రమేకాదు. శబ్దశక్తి పరివ్యాప్తమైన శాస్త్రం. కవులు తమ రచనల్లో ధాతుస్వరూపం, క్రియారూప నిష్పత్తి, కారకప్రయోజనాలు తెలిసి ప్రయోగించాలి. శాబ్దికమైన లింగవ్యవస్థను పదాల అర్థసాధన కోసం తగిన విధంగా వాడుకోగలగాలి. వచనభేదాన్ని కలిగించే ప్రత్యయాలను భావాలకు అవసరమైనట్లుగా ఉపగించుకోవాలి. వృథావిశేషణాల వాడకాన్ని తగ్గించి, విశేష్యాలకు అనుగుణంగా విశేషణ పదాలను సమకూర్చాలి. ఉపసర్గలు, నిపాతలు పాదపూరణకోసం కాక, భావోద్వేగ వ్యంజకాలుగా ఘటించగలగాలి. ఈ విధమైన ఔచిత్యదృష్టితో కావ్యరచన చేస్తే అది సహృదయానందకరంగా, చిరస్థాయిగా లోకంలో నిలుస్తుంది.

**ఉపయుక్త గ్రంథ సూచి :**

జయకృష్ణ బాపూజీ, జంధ్యాల. శ్రీనాథుని సాహిత్యప్రస్థానము. కళ్యాణభారతి, గుంటూరు, 1977.

నరసింహమూర్తి, యు.ఎ. ఔచిత్యప్రస్థానము సూరనకవిత్వము. రసజ్ఞ ప్రచురణ, విజయనగరం, 1987.

పురుషోత్తం, బొడ్డుపల్లి. (వ్యాఖ్యాత) బాలవ్యాకరణము. స్టూడెంట్సు ఫ్రండ్సు ప్రచురణ, నరసరావుపేట, 1977.

మాధవరామశర్మ, జమ్ములమడక. (అను.) ఔచిత్యవిచారచర్చ. అభినవభారతి, గుంటూరు. 1963.

రంగాచార్యులు, చెలమచర్ల. (అను.) ఆంధ్రౌచిత్యవిచారచర్చ. శ్రీనివాసపబ్లికేషన్స్, హైదరాబాద్, 2007.

రామకృష్ణారావు, వంతరాం. (వ్యాఖ్యాత). బాలవ్యాకరణ ఘంటాపథము. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 2016.

వేంకటరాయశాస్త్రి, వేదము. (సంజీవినీ వ్యాఖ్య) ఆముక్తమాల్యద. ఎమెస్కో. హైదరాబాద్. 2012.

సత్యనారాయణ, కాశీభొట్ల. ఆంధ్రకవుల ఔచిత్యవిచారణ, స్వీయ ముద్రణ, నర్సాపురం, 1973.

సుమతీనరేంద్ర. పి. తిక్కనచేసిన మార్పులు ఔచిత్యపు తీర్పులు. బాలకృష్ణభారతి, హైదరాబాద్, 1982.



ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 3 (55) హైదరాబాద్ జనవరి : 2026

# "శ్రమ వీరుల రహదారి, కిలారి"

**మద్దిలేటి సోమశేఖర్,** తెలుగు పరిశోధక విద్యార్థి, బెంగళూరు విశ్వవిద్యాలయం. ఫోన్ : 98485 29891

పల్లెటూరి సాహిత్యాన్ని గురించి మాట్లాడుకోవడం అంటే సామాజిక స్పృహ ఉన్న జీవితాన్ని గురించి మాట్లాడుకోవడమే అవుతుంది. ఇంత చిన్న పుస్తకం కదా ఇందులో ఏముంటుందిలే కథ, నేను ఎన్నో చదివేశా కదా అనుకున్నాను. తీరా పుస్తకం విప్పి చదవడం మొదలు పెట్టేసరికి నన్ను తొంబయ్యవ దశకంలోకి నేరుగా ఈడ్చుకుని పోయింది. అన్నీ మనకు తెలిసిన పాత్రలే కానీ, ఆ జీవితాల్లోని లోతులను పరిశీలిస్తే విస్తుపోయే వాస్తవాలు మనకు కనిపిస్తాయి. నేనెందుకు ఇలా రాయకూడదు అనిపించింది. ఉత్పత్తి కులాల వారి ఆకలి, ఆలోచనలు, ఆశలు, అనుభూతులు, అవకాశాలు, వేదనలు, సంవేదనలు, ఘర్షణలు, సంఘర్షణలు, అమాయకత్వం, ఆత్మీయతతో పాటు కులం కట్టుబాట్లు, వివక్షలు లోలోపలి అంతరంగాల ఆవిష్కరణలతో నడుస్తుంది కిలారి నవల. ఒక నిర్దిష్ట సమాజంలో బతుకుతున్న జీవితాలు అగ్రకులాల చేత ప్రభావితమైన అణగారిన కులాల వ్యథల్ని చిత్రించే నవలగా కిలారిని అభివర్ణించుకోవచ్చు.

ప్రతి మనిషికి ఎంత సాధించినా, జీవితంలో ఎంత ఎదిగినా, ఏవో కోరికలు మిగిలిపోతూనే ఉంటాయి. అవి తీర్చుకోలేనివి అంటే కాదు కానీ, తీర్చుకోవడానికి సమయం లేక తీరా వచ్చాక అవి తీర్చుకుంటున్న అనుభూతి పంచుకోవడానికి అర్థం చేసుకునే మనుషులు కావాలి. అలాంటి సందర్భాలు నాగేషు నుంచి జాలువారిన రచనలు ఆకాశంలో సగమైనా, వారధి, ఏకుదారం అయినా, బీరప్ప అయినా, తగటు అయినా, ప్రస్తుతం కిలారి అయినా, ఏ రచనకు ఆ రచన సాటి అని చెప్పవచ్చు. ఒక్కొక్కటి ఒక్కో అక్షర శిఖరం.

ప్రస్తుతం మనం చర్చించే నవల కిలారి గురించి మాట్లాడితే సిరికోనా సాహితీ వేదిక, జొన్నలగడ్డ రాంభొట్లు, సరోజమ్మ స్మారకంగా అమెరికా వారు నిర్వహించే నవలా పోటీలలో 2024-25కు గాను ఉత్తమ నవలా పురస్కారానికి కిలారి నవల ఎంపిక అయ్యింది.

కిలారి అంటే గొల్లవాండ్లు, గొల్లవారు, అని గొర్రెలకాపరి, మేకల కాపరి, మిగతా చిల్లర జీవాలు కాసేవాళ్లు కావచ్చు. మరి కొంతమంది కిలారిని ఇంటిపేరుగా కూడా పెట్టుకుని వున్నారు. కిలారి శీర్షికకు ఉప శీర్షికగా, ఉత్పత్తి కులాల ఉస్తువారి అని పెట్టడం మరింత ఆకట్టుకునేలా వుంది.

ఉస్తువారి అంటే దృఢత్వం, బలిష్టత, దిటువు, గట్టితనం, సాహసం, బలం మొదలైన అర్థాలతో ఉపశీర్షిక ఎన్నుకోవడం రచయిత యొక్క నవలలో పాత్రలు అంత బలంగా ఉంటాయని చెప్పడానికే ఉస్తువారి అని ఉపశీర్షిక పెట్టడం జరిగిందేమో అని నా భావన.




ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ గారు కిలారి నవలకు ముందుమాటగా రాస్తూ, **"నాటి మహా భారతానికి సజీవ శేష భాగం ప్రతి ఊరు మరో మాటలో చెప్పాలంటే భారతీయ సంకీర్ణ అస్తిత్వానికి సజీవ సంకేతమే ఊరు"** అంటారు. గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలు అనే నానుడి కూడా ఉంది. అలాగే "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరియసీ" అనే రామాయణ శ్లోకంలో జన్మనిచ్చిన కన్నతల్లి కన్నా సొంత ఊరు ఎంత పవిత్రమో! ఈ నవల ద్వారా ఊరు యొక్క ఉచ్ఛ స్థితి ఉద్విగ్నభరితంగా ఉత్కంఠగా పాఠకుడే అందులో లీనమైనట్టు, కిలారి కథనం మన జీవితమే అయినట్టు ఏదో కోల్పోయినోడు వెదుక్కున్నట్లు వుంటుంది.

ఈ నవలలోకి వెళితే అనంతపురం జిల్లా కడ అంచుల్లోని ముత్యాలంపల్లి గ్రామానికి కోలార్ చుట్టుపక్కల నుండీ వలస వచ్చిన గొర్రెల కాపరులైన కురుబ కులానికి చెందిన ఒక కిలారి కుటుంబంతో ఈ నవల మొదలవుతుంది. జీవితంలో ముందుకు వెళ్లాలి అంటే ఒక్కొక్క అడుగు ముందుకేసుకొని వెళ్లాలి. రాయలసీమ అంటే ఎంత పౌరుషం ఉన్నా భాష, యాస దగ్గరికి వచ్చేసరికి కొంచెం కారం, మమకారం కలిసి ఉంటుంది. కిలారిలో ముఖ్యపాత్రలు వీరయ్య, సక్కిరమ్మ కిలారి జాతరకి వెళ్లడానికి తయారయ్యే సందర్భంతో నవల ప్రారంభం అవుతుంది. నవలారంభంలోనే సక్కిరమ్మ పాత్ర కనిపిస్తుంది. స్త్రీ సమాజానికి ఎంత అవసరమో ఈ సందర్భంగా మనం గుర్తుచేసుకోవచ్చు. పూర్వం స్నానం అంటే పండగలకో, జాతరలకో మాత్రమే చేసుకునేవారు. వాళ్ల జీవితాలు మురికి కష్టాలకి ప్రతీక. అమాయక పిల్లలు వాళ్ళ ప్రవర్తన, పవిత్రమైన ప్రవహించే నది లాంటిది. వాళ్ళ జీవితం, ప్రేమ ఆప్యాయతలు, అల్లుకొని ముందుకు సాగే జీవితాలు ఈ నవల్లో ప్రతి పాత్ర ప్రముఖమైనవే.

పూర్వం ఎక్కువగా నేరాలు ఏమైనా జరిగితే పెద్దపెద్ద అధికారులు, రక్షక భటులు, సంరక్షించే అధికారులు, ముందుగా విచారించేది మంగళోళ్ళని, ఎందుకంటే ప్రతి ఇంటి దగ్గరికి వాళ్ళ వృత్తిజీవనం గడిపేందుకు వ్యవస్థలోని అన్ని లొసుగులు మాట్లాడుకుంటూ వాళ్ళ వృత్తిలో నిమగ్నమై జీవనం సాగిస్తారు. ఈ నవల ద్వారా మంగలోళ్ల అవసరం ఎంత వుంటుందో ప్రత్యక్షంగా మనకు అర్థం చేయించారు. ఈ నవలలో ఇంకా హృదయ విదారకరమైన పాత్ర ఏదైనా ఉంది అంటే గూరప్ప కోడలు, గౌరమ్మ శివరామరెడ్డి వాళ్ళ ఇంటికి శారకు అని వెళుతుంది. అక్కడ శారకు పోయిన గౌరమ్మను చెరపట్టడానికి ప్రయత్నిస్తాడు. అయ్యా ఇంకా బిడ్డకు జన్మనిచ్చి మూడు నెలలు అయింది అంటుంది. నా మొగుడుని కూడా పక్కలోకి రానీలేదు అంటుంది. మేం కూటికి తక్కువైనోళ్లే కాని గుణానికి తక్కువైనోళ్లు కాదు అని ఘాటుగా చెప్పి అక్కడినుండీ తప్పించుకుని వస్తుంది. ఆ సందర్భంలో శివరామిరెడ్డి మాట్లాడినటువంటి మాటలు నేటి ఆధునిక కాలంలో కూడా స్త్రీల పట్ల ఏ రకమైన లైంగిక హింస ఉన్నదో గౌరమ్మ పలికిన మాటల ద్వారా తెలుస్తుంది. మనుషులకు ఆకలి సహజం, కానీ ఆత్మాభిమానం ఉండాలన్నది అంతకన్నా నిజం. ఆ ఆత్మాభిమానాన్ని దెబ్బతీసేందుకు పురుషుడు ఎన్ని కుయుక్తులు పన్నుతాడో చెప్పడమే ఇక్కడ రచయిత ఉద్దేశ్యం. గౌరమ్మ శివరామిరెడ్డి ఇంట్లోకి రమ్మని అడిగిన విషయాన్ని వాళ్ళ మామగారైన గూరప్పకు చెబుతుంది. మనం ఈ ఊరికి బ్రతుకుతెరువు కోసం వచ్చాము, ఇప్పుడిప్పుడే కుదురుకుంటున్నాం. అప్పుడే గలాటాలు చేసుకోకూడదు. కాలం మనకూ వస్తుంది అని సర్ది చెప్పి ఆమెను ఓదారుస్తాడు.

కంబళ్ల సొసైటీ కోసం తీసిన స్థలం బీరప్ప జాగా, అది ముత్యాలంపల్లిలోని కురుబలందరి ఉమ్మడి ఆస్తి. ఆ ప్రదేశంలో గుడిసె వేసుకొని జీవనం సాగిస్తుంటారు ఎరుకల గూరప్ప కుటుంబీకులు. అలాగే జీవితంలో బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం, ఉన్నట్టే ఏ సమయంలో ముచ్చట్లు అ సమయంలోనే జరగాలి అనేది రచయిత చీటీగాడు అనే పాత్ర ద్వారా తెలియజేశాడు.

ఈ కిలారి నవలలో ఇంకో ప్రధాన విషయం ఏమిటంటే అప్పట్లో ఈ అధునాతన టెక్నాలజీ లేదు. మనిషి పొద్దు పోవడానికి ఏవో వరసైన వారి మీద సరసపు మాటలను, కనుసైగలు, రంకులు, రగడల గురించి మాట్లాడుకుని పల్లె వాసులు కాలక్షేపం చేసేవారు. వాళ్ళు ఎంత మొరటుగా వుంటారో తెలుపడానికి గిన్నెలో సీకాయని కలిపి స్నానానికి సిద్ధం చేసిన గిన్నెను చూసి అప్పుడే ఆకలితో వచ్చిన భర్త అదే వూరిబిండి అనుకుని మొత్తం తిన్న సంగతిని చదివితే అప్పటి పల్లెల్లోని ముగ్ధ మనసుకు చిహ్నంగా అనిపిస్తుంది.

అలాగే పల్లెల్లో నేటికి మూఢనమ్మకాల్లో బ్రతుకు సాగిస్తున్నారు. అందుకు ఉదాహరణ వీరయ్య పడమర దిక్కుకి ప్రయాణం చచ్చినా చేసేది లేదు అంటాడు. ఒక్క కిలారి పరసకు మాత్రం తప్ప. ప్రతి పల్లెల్లోను నేటికీ వాళ్ళ అసలు పేర్ల కన్నా అద్ద పేర్లతోనే వాళ్లను ఎక్కువగా సంబోధించే పాత్రలు ఈ నవలలో ఎన్నో కనిపిస్తాయి. బ్రతుకుతెరువు కోసం ఏదో ఒక పని చేయాలి. అని వూసాయమ్మ ఆకలిగా వుండే ఆడోళ్ళకి, మగోళ్ళని, ప్రాయం వచ్చిన మగపిల్లలకు, పెద్ద పెద్ద ఆడవాళ్ళని తార్చడం పెద్ద కార్యమే చేస్తుంటుంది. ఆర్థికంగా బతకడానికి రమేష్, ఎర్రసీనప్ప, రామంజి ముగ్గురు మగవాళ్ళను బుట్టలో వేసుకుంటుంది. అయితే చెడ్డ పనులు ఎన్ని దినాలు సాగవు.

ఈ నవల్లో ప్రధానంగా అగ్రకులాల ఆధిపత్యం హెచ్చుగా కనిపిస్తుంది. శివరామరెడ్డి, కంతరెడ్డి, కసిరిరెడ్డి, వీళ్ళకు డబ్బు జమీను (భూమి) వుందనే మదంతో చిన్న చిన్న కులాల వాళ్ళని కొట్టడం, ఆడవాళ్లను బలవంతంగా లోబరచుకోవడం చేస్తుంటారు. అగ్రకులాల ఆధిపత్యాన్ని ఏ విధంగా చిన్నాచితక కులాలు వారు వారి మీద తిరగబడ్డారో మనం ఈ నవల ద్వారా తెలుసుకోవచ్చు. ఉదాహరణకు పందుల మేపే వాళ్ళని కొట్టడం, తిరిగి వాళ్లు రెడ్లను కొట్టడం, పల్లెను విడిచి పట్టణాలకు వెళ్లిపోవడం, దాక్కోవడం లాంటివి. ఎన్నో విధారకరమైన సంఘటనలని ఈ నవలలో తెలుసుకోవచ్చు. శివరాం రెడ్డి కొడుకు కురుబోళ్లని కొట్టడం, దూషించడం తర్వాత వాళ్లు తిరగబడి కొట్టడం కొట్లాటల్లో వీరయ్య మరణిస్తాడు. అతనికి అంతిమ సంస్కారాలు చేయడానికి ఎవరూ ముందుకు రారు. కురుబ కులస్తులందరూ మా కులం గొప్పది, గోత్రం గొప్పదని మాట్లాడు కోవడం అసహ్యించుకునేలా ప్రవర్తిస్తారు. పుట్టినప్పుడు కులం తెలియదు చనిపోయినప్పుడు కులం తెలియదు మధ్యలోనే ఇవన్నీ అనుకుని మంగలి దుబ్బోడు శవం చుట్టూ చేరిన సరికులస్థులందరినీ ఇష్టానుసారంగా తిట్టి శవాన్ని పూడ్చడానికి సిద్ధపడటం అభ్యుదయంగా అగుపిస్తుంది. మంగళవానికి సహాయంగా శివగాడు, మంజూగాడు, రొగ్గోడు సహాయం చేయడం, మానవత్వం విలువలకు చక్కని సూత్రం నిర్వచనం మంగలి దుబ్బోడి పాత్ర. సొంత బంధువులే ఆస్తికోసం గొడవలు పడడం, ఆస్తి కోసం ఏ విధంగా నేటికీ బంధువుల్లో అలజడులు రేగుతున్నాయో, ఆనాటి పల్లెల్లో కూడా ఆస్తి కోసం బంధువులను చంపడానికి వెనకడుగు వేయకుండా ఉండే పాత్రలని కళ్ళకు కట్టినట్టు చూపడం మనం ఈ నవలలో గమనించవచ్చు.

ఆర్భాటాలకు ఆనందాలకు పోతే సంసారాలు నాశనమైతాయని ముర్రోని భార్య నరసింహంతో చిన్నపిల్లలను వదిలేసి వెళ్లిపోవడాన్ని బాధాకరమైన విషయంగా చెప్పుకోవచ్చు. సమాజంలో మనుషులు మానవతా విలువలు కోల్పోయారనే విషయం చదువుతుంటే చక్కని సందేశం మనకి అగుపిస్తుంది. పల్లెల్లో వృత్తులన్నీ పట్నానికి బయలుదేరడం, అక్కడ అధునాతన సాంకేతికంగా వృత్తులు చేసుకుంటూ, జీవనం సాగించడం పల్లెలు ఖాళీ అవ్వడం, పల్లె

బోసిపోవడం లాంటివి జరుగుతూ ఉంటాయి. అప్పుడే పల్లెకు అరిష్టం జరిగిందని ఊరికి ఎన్నో దినాల నుంచి వేచి చూస్తున్నటువంటి గుడి కట్టడానికి చందాలు వసూలు చేయడం, డబ్బు సాలక ఊర్లో తిట్టి కొట్టిన వాళ్లు ఊరి కోసం డబ్బు ఇవ్వడం ప్రగతికి చిహ్నంగా కనిపిస్తుంది. కసిరెడ్డి కురుబ అటమోన్ని, ముర్రోన్ని, బింగరమోన్ని కొట్టినా అదే కసిరెడ్డికి ఆరోగ్యం బాగా లేకపోతే మానవతా విలువలతో ఈ బాధితులే అతనికి ఆసుపత్రిలో చూపించడం ఈ నవలలో హింసకు ప్రతిహింస సమాధానం కాదని నిర్వచిస్తుంది. ఈ నవల పల్లెలు సజీవంగా వుండాలంటే ఎలా బతకాలి అనేది మనకు దార్శనికతను చూపిస్తుంది. పల్లెలు ప్రశాంతంగా ఉండాలంటే అన్ని కులాల చేతివృత్తులు తప్పనిసరిగా ఉండాలి. అప్పుడే దేశానికి పట్టుకొమ్మలు పల్లెలు అన్న నానుడికి సార్థకం అవుతుందని కిలారి నవల యొక్క ముఖ్య ఇతివృత్తం. దీంతోపాటు కులసంఘాలుచేసే మోసాల్లో కూరుకుపోవద్దండని హితవు చెబుతుంది ఈ నవల. ఆర్థిక అసమానతలకు కులాలు తక్కువ కాదని,మన అలవాట్లు బాగుంటే ఏ కులమైనా ఆకాశం అంత ఎత్తుకు ఎదగవచ్చు అనేందుకు నిదర్శనంగా చూపించారు ఈ నవలలోని కొన్ని పాత్రలు. మొత్తంగా కిలారి నవల పల్లె భారతం లాంటిది. ఇందులో నువ్వు ఏది కోరుకుని అర్థం చేసుకుంటావో అవన్నీ ఇందులో లభిస్తాయి. తప్పకుండా చదవాల్సిన నవల కిలారి.






ప్రతులకు రచయిత 9985509053 నెంబర్ కు సంప్రదించ గలరు.




## ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.
తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.
330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.
అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.
**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

## 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం 'కదంబం'.

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 3 58 హైదరాబాద్ జనవరి : 2026

# తెలుగు జాతి అస్తిత్వాన్ని చాటిన 'తెలంగాణ పద సాహిత్యం – సమాలోచన'

## (తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రెండు రోజుల జాతీయ సదస్సు)

డా॥ మంత్రి శ్రీనివాస్ ... ఫోన్ : 83283 33720

తెలంగాణ పదసాహిత్య పుట్టుకకు మూలకేంద్రం. పదం పదపదానా ఇక్కడి ప్రజల ఆచార విచారాలు, సంస్కృతీ సంప్రదాయాలలో గంగపొంగినట్టు పొంగుకొస్తాయి. ఆశువుగా పుట్టి అమూల్యమైన జ్ఞానసంపదను మోసుకుంటూ రేపటి తరాలకు జీవన సుగంధాన్ని కానుకగా అందిస్తాయి. నరహరి కృష్ణమాచార్యుల సింహగిరి వచనాలు మొదలు ఇక్కడి భక్తకవులు, వాగ్గేయకారులు, జానపద కళాకారులు, జ్ఞానయోగులు, అచలాది పండరీ భాగవతులు, గురుబోధకారులు, భక్త సమాజాలు, దాస కవులు ప్రపంచానికి అద్వితీయమైన జ్ఞానాన్ని తమ పదాలలో ప్రవహింపజేశారు. ఆ పదసాహిత్య పరిమళాన్ని లోకానికి అందిచడానికి తెలుగుశాఖ ఉస్మానియా విశ్వవిద్యాలయం సంకల్పించింది. రెండురోజుల జాతీయ సదస్సును నిర్వహించి పదకవితా సామ్రాజ్యలతకు పరిశోధక ప్రభను అద్దింది. తెలుగుశాఖ ఉస్మానియా విశ్వవిద్యాలయం, రూసా, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో **"తెలంగాణ పద సాహిత్యం -- సమాలోచన"** అనే శీర్షికతో ఈ రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించడం విశేషం.

తేది: 29,30 డిసెంబర్ 2025 లలో ఆర్ట్స్ కళాశాల రూమ్ నెంబర్ 133 వేదికగా జరిగిన ఈ సదస్సు ప్రారంభసభకు ఆచార్య కమలాకర శర్మ (అధ్యక్షులు, తెలుగుశాఖ,ఉవి) అధ్యక్షత వహించారు. ఈ విశిష్ట సదస్సుకు ముఖ్య అతిథిగా ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎం. కుమార్, గౌరవ అతిథిగా సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానంద రావు హాజరయ్యారు. ప్రత్యేక అతిథులుగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, తెలంగాణ శాసన మండలి సభ్యులు డా. గోరటి వెంకన్న, తెలంగాణ సాహిత్య అకాడమి పూర్వాధ్యక్షులు డా.నందిని సిధారెడ్డి హాజరుకాగా, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. ఏనుగు నరసింహారెడ్డి విశిష్ట అతిథిగా విచ్చేశారు. తెలంగాణ పదసాహిత్య పరిశోధకులు డా. పి. భాస్కరయోగి కీలకోపన్యాసకులుగా, ఆత్మీయ అతిథులుగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్స్ పాల్ ఆచార్య సి. కాశీం, డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ ఆచార్య సైదా తలాత్ సుల్తానా, పార్య ప్రణాళికా సంఘం అధ్యక్షులు డా. ఏలె విజయలక్ష్మి పాల్గొన్నారు.

సభాధ్యక్షులు మాట్లాడుతూ సమస్త జీవరాశిలో, జడ చేతనాదులలో పరమాత్మను చూస్తూ సర్వేజనా: సుఖినోభవంతు అనే సదుద్దేశ్యాన్ని తమ పదాలలో, భజనలలో అందించిన వాగ్గేయకారులకు తెలంగాణ నిలయ మన్నారు. భక్త రామదాసు, రాకమచర్ల వెంకటదాసు, మన్నెంకొండ హనుమద్దాసు, వేపూరు హనుమద్దాసు, చెన్నదాసు, ఈగ బుచ్చిదాసు, దున్న ఇద్దాసు ఇలా ఎందరో భక్తయోగులు తమ పదసంకీర్తనల మాధ్యమంగా ప్రజలకు ఇహపర తత్వాలను బోధించి బ్రతుకు విలువను బోధించారన్నారు. పదాలలో ప్రచారమవుతున్న భగవత్తత్వాన్ని, జ్ఞానాది, మార్గదర్శనాన్ని ఈ సదస్సు జనపరం చేస్తుందన్నారు. సదస్సు లక్ష్యాన్ని వివరిస్తూ సుమారు నలభై మంది ప్రముఖులు, పరిశోధకులు విభిన్న అంశాల వారిగా తమ పత్రాలను సమర్పిస్తారన్నారు. ముప్పైమూడు జిల్లాల పదకవుల సమాచారాన్ని ఒక్క వేదికమీదికి తీసుకొస్తున్న సదస్సుగా ఈ సదస్సును అభివర్ణించారు. ముఖ్య అతిథి ఆచార్య ఎం. కుమార్ మాట్లాడుతూ చిన్నతనం నుండి పల్లెటూర్లలో భజన కీర్తనలు తానూ విన్నానని, తెలంగాణ అస్తిత్వాన్ని నమోదుచేసే ఇటు వంటి సదస్సులు భవిష్యత్ తరాలకు మార్గనిర్దేశం చేస్తాయన్నారు. గౌరవ అతిథి ఆచార్య వెలుదండ నిత్యానందరావు ప్రసంగిస్తూ పద సంకీర్తనలు అనతర్లీనంగా భక్తిని, జ్ఞానాన్ని, తత్వాన్ని లోకానికి బోధించి మానవతావాదాన్ని నిలిపి ఉంచడంలో సహాయకారిగా నిలుస్తాయన్నారు. డా.నందిని సిధారెడ్డి మాట్లాడుతూ పల్లె పల్లెనా ప్రతీ పనిలో పదాలు జీవిత సారాంశాన్ని బోధిస్తూ ఆబాలగోపాలాన్ని చైతన్యం చేస్తాయన్నారు. పదమనేది తెలంగాణ జనుల శ్వాసగా డా. గోరటి వెంకన్న అభిప్రాయపడ్డారు.






పదాలలో ప్రజలు తమ జీవితాలను చూసుకుంటారన్నారు. కీలకోపన్యసకర్త డా. భాస్కరయోగి ప్రసంగిస్తూ తెలంగాణ గుండె లయగా పదాన్ని నిర్వచిం చారు. దున్న ఇద్దాసు, మన్నెంకొండ హనుమద్దాసు వంటి వాగ్గేయకారుల కీర్తనలను పాడి అందులోని అమూల్యమైన జ్ఞాన సంపదను, లోకం అలవార్చుకోవాల్సిన శిష్టాచారాలను, తాత్విక చింతనను సభికులకు పంచారు. డా. ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ పదసాహిత్యం తెలంగాణ అస్తిత్వ పతాకం అన్నారు. ఆత్మీయ అతిథి ప్రొఫెసర్ సి. కాశీం మాట్లాడుతూ పల్లె ప్రజలను మంచిమార్గంలో నడుపుతూ సంస్కరణ దిశగా పద సాహిత్యం పనిచేసిందన్నారు. తెలుగుశాఖ జాతి నిర్మాణంలో పాలుపంచుకున్న సాహితీ జ్ఞానాన్ని సదస్సుల ద్వారా ప్రజలకు చేరువచేస్తుందని ప్రొఫెసర్ సైదా తలాత్ సుల్తానా అన్నారు. డా. ఏలె విజయలక్ష్మి ప్రసంగిస్తూ తెలుగుశాఖ తెలంగాణ సాహిత్య సంపదను భద్రపరచడంలో భాగంగా చేస్తున్న ప్రయత్నాలలో ఈ సదస్సు కూడా ఒకటన్నారు. ఈ ప్రారంభ కార్య క్రమాన్ని తెలుగుశాఖ అసోసియేట్ ప్రొఫెసర్ డా. ఎస్. రఘు సమన్వయం చేశారు.

ముప్పది రెండు మంది పత్రసమర్పకులతో అయిదు సాంకేతిక సమావేశాలు ఈ సదస్సులో జరిగాయి. మొదటి సమావేశం ప్రాచ్య పరిశోధనా సంస్థ శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం సంచాలకులు ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఆధునిక వాగ్గేయకారులపై తెలంగాణ పదసాహిత్య ప్రభావం అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ఈసమావేశంలో తెలంగాణ పదసాహిత్యం–భాషా విశ్లేషణ, తెలంగాణ పదసాహిత్యం–అలంకారాలు, తెలంగాణ పదసాహిత్యం–దాసకవులు, తెలంగాణ పదసాహిత్యం–కందార్థాలు, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పదసాహిత్యం వంటి అంశాలపై వివిధ విశ్వవిద్యాలయ ఆచార్యులు పరిశోధకులు తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు.

రెండవ సాంకేతిక సమావేశానికి అధ్యక్షులు తెలుగుశాఖ మద్రాసు విశ్వవిద్యాలయం ఆచార్య విస్తాలి శంకర్ రావు అధ్యక్షత వహించారు. 'తెలంగాణ పదసాహిత్యం– సామాజికాంశాలు' అనే అంశంపై వారు తమ అమూల్యమైన పత్రాన్ని సమర్పించారు. ఈ సమావేశంలో తెలంగాణ పదసాహిత్యం– ప్రతీకలు, తెలంగాణ పదసాహిత్యం–దత్త సంప్రదాయం, తెలంగాణ పదసాహిత్యం– విమర్శ, పరిశోధన, తెలంగాణ పదసాహిత్యం– భారతీయత, ఆదిలాబాద్ జిల్లా పదసాహిత్యం, ఉమ్మడి మెదక్ జిల్లా పదసాహిత్యం అన్న అంశాల శోధకులు మీద తమ పత్రాలను సమర్పించారు.

మూడవ సాంకేతిక సదస్సుకు తెలుగుశాఖ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వి. త్రివేణి అధ్యక్షత వహించారు. 'ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పదసాహిత్యం' అనే అంశంపై వారు ప్రసంగించారు. ఈ సదస్సులో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా




పదసాహిత్యం, తెలంగాణ పదసాహిత్యం– సాంఖ్యం, చిస్తీ సంప్రదాయం వంటి అంశాలపై వివిధ విశ్వవిద్యాలయ ఆచార్యులు, పరిశోధకులు తమ పత్రాలను సమర్పించారు.

నాలుగవ సదస్సుకు ఆచార్య కె. లావణ్య (డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ తెలంగాణ విశ్వ విద్యాలయం) అధ్యక్షత వహించారు. 'తెలంగాణ పదసాహిత్యం–కవయిత్రులు' అనే అంశంపై వారు ప్రసంగించారు. ఈ సమావేశంలో ఉమ్మడి నల్గొండ, కరీంనగర్ జిల్లాల పదసాహిత్యం, తెలంగాణ పదసాహిత్యం– ప్రబోధం, గురువు, పండరి సంప్రదాయం అనే అంశాలపై పరిశోధకులు తమ విలువైన పత్రాలను సమర్పించారు.

ఐదవ సమావేశానికి తెలంగాణ విశ్వవిద్యాలయం సీనియర్ ప్రొఫెసర్ పి. కనకయ్య అధ్యక్షత వహించారు. 'తెలుగు నాటకాలు –పదసాహిత్య స్పృహ' అనే అంశంపై వారు ప్రసంగించారు. ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల పదసాహిత్యం, తెలంగాణ పదసాహిత్యం–మంగళ హారతులు, తెలంగాణ పదసాహిత్యం–దైవేతర స్తుతి, తెలంగాణ పదసాహిత్యం–చారిత్రాకాంశాలు, తెలంగాణ పదసాహిత్యం– అచల సంప్రదాయం వంటి అంశాలపై పరిశోధకులు విలువైన పత్రాలను సమర్పించారు.

ముగింపు సమావేశానికి తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య సాగి కమలాకర శర్మ అధ్యక్షత వహించగా, ఉస్మానియా యునివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి. నరేష్ రెడ్డి ముఖ్య అతిథిగా, వీరనారి చాకలి






ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య సూర్యాధనంజయ్ విశిష్ట అతిథిగా, ప్రముఖ ప్రజా వాగ్గేయకారులు జయరాజు, తెలుగుశాఖ పుర్వాధ్యక్షులు, దేశభక్త ఆచార్య కసిరెడ్డి వెంకట్ రెడ్డి గార్లు ప్రత్యేక అతిథులుగా. ఆత్మీయ అతిథులుగా తెలుగుశాఖ కేంద్రీయ విశ్వవిద్యాలయం అధ్యక్షులు ఆచార్య పిల్లలమర్రి రాములు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి. కాశీం పాల్గొన్నారు. వాగ్గేయకారులు జయరాజు మాట్లాడుతూ సాహిత్యమే ప్రజలని బతికిస్తుందని, బతుకునిస్తుందని మాట్లాడుతూ మనిషికి, ప్రకృతికి ఆత్మీయ సంబంధం ఉందని అన్నారు. ఈ సదస్సు డైరెక్టర్ గా వ్యవహరించిన తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య సాగి కమలాకర శర్మ మాట్లాడుతూ ప్రాచీన కాలం నుండి నేటి వరకు ఆ పరంపర కొనసాగిందని, దీన్ని ముందు తరాలకు అందించడం నేడు మనపై ఉన్న వర్తమాన బాధ్యత అని అన్నారు. ప్రత్యేక అతిథిగా ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ పదసాహిత్యం సమాలోచన సదస్సు ఏర్పాటు చేసినందుకు తెలుగు శాఖను అభినందించారు. తెలంగాణ నేలంతా ప్రజల నోళ్ళల్లో పద సాహిత్యం విరాజిల్లుతోందని అన్నారు. ఈ కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా విచ్చేసిన ఆచార్య పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ యూనివర్సిటీల్లో పద సాహిత్యం పై విస్తృతమైన పరిశోధనలు రావాలని సూచించారు. ఆత్మీయ అతిథి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. చింతకింది కాశీం మాట్లాడుతూ సారవంతమైన పరిశోధనలు రావాలంటే సామాజిక సంఘర్షణాత్మక జీవితాన్ని సాహిత్యానికి అనుసంధానించాలని అన్నారు. తెలుగు పాఠ్యప్రణాళికా సంఘం అధ్యక్షులు డా. ఏలె విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు ఈ సదస్సును ఆదర్శంగా తీసుకొని గ్రామీణ ప్రాంతాల్లోని పద సాహిత్యాన్ని వెలికి తీయాలని సూచించారు. ఈ రెండు రోజుల పాటు జరిగిన సదస్సు నివేదికను తెలుగు శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ డా. ఎస్. రఘు ప్రవేశ పెట్టారు. ఈ సదస్సులో 32 పైగా ప్రసంగ పత్రాలు, 300 వరకు ప్రతినిధులు పాల్గొన్నారని, సభ విజయవంతంగా తెలంగాణ పద సాహిత్యంపై లోతైన చర్చ, పరిశోధనను ఈ సభ హామీ పడిందని అన్నారు. ఈ సదస్సులో తెలుగుశాఖ అధ్యాపకులు, ఇతర శాఖల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నది

బి ఎల్ ఎన్ కొల్లి
9441853658

నదికి ఏదైనా చెప్పు---
ఎవరికీ చెప్పలేని మాటైనా సరే
ప్రేమైనా... బాధైనా...

నిజమే కావాలి---
మలినం తాకని, మోసం ఎరుగని
జీవితం తనకు తాను ఎంచుకున్న నడకలా

ఆమె చెవిలో
చల్లగా చదివి వినిపించు
నీ హృదయపు స్వచ్ఛమైన లిపిని

కాగితం ముందే నీ శ్వాసలోనే పుట్టిన
నగ్నమైన పదాలై సందేహం లేని స్వరంతో
ఆమె కోసం ఒక లోతైన సంకల్పం వ్రాయి---
కాలానికి ఎదురీదే నిశ్శబ్ద ప్రతిజ్ఞలా

కవి కలం నుంచి జారే ప్రతి అక్షరం
నీ ఆత్మ నీడగా మారి
ఆమె ప్రవాహంలో తన్నుతాను మరచిపోవాలి

నది నడిచేది
మన అడుగుల వెనక కాదు
మన ఉద్దేశాల లోతుల్లో

పచ్చదనం పసుపును నేర్చుకునే వరకు
పంటలపై కాలం తన ముద్ర వేసే వరకు
ఆమె తన వాటాను మౌనంగా తీసుకుంటుంది---
ఒకసారి వరదగా, మరొకసారి వానగా

మనం ఆశ్చర్యంగా నిలిచినా
ఆమెకు తెలుసు---
ఏది ఇవ్వాలో, ఏది తిరిగి తీసుకోవాలో

నది శక్తి ఇదే---
ఆమె శబ్దం కాదు, అర్థం
ఉగ్రత కాదు, సహనం
మన జీవితాలకు అద్దం
మనల్ని మనకే పరిచయం చేసే
శాశ్వత ప్రవాహం

# స్వకృతి






అవుట్ లుక్
ఎం. విప్లవకుమార్
వెల : 250
ప్రతులకు : ప్రసిద్ధ అన్ని పుస్తక విక్రయ కేంద్రాలు
ఫోన్ : 95152 25658




అక్షర త్రివేణి (భాషా, సాహిత్య, విద్యా విషయక వ్యాస సంపుటి)
డా. దహగాం సాంబమూర్తి
వెల : 795
ప్రతులకు : నీల్‌కమల్ పబ్లికేషన్స్
సుల్తాన్ బజార్, కోటి, హైదరాబాదు - 500001
ఫోన్ : 9000168953




ప్రతిభా వైజయంతి (సమ్మానోత్సవ విశేష సంచిక)
సంపాదకులు : డా. దహగాం సాంబమూర్తి
వెల : 400
ప్రతులకు : అజో-విభో-కందాళం ఫౌండేషన్
కాచిగూడ, హైదరాబాదు - 500027
ఫోన్ : 040 40179673




తొలకరి
(అల్లం రాజయ్య కథలు - నేపథ్యం)
సంపాదకులు :
శివరాత్రి సుధాకర్, చైతన్య చెక్కిళ్ల
వెల : 350
ప్రతులకు :సంపాదకులు
ఫోన్ : 9491124112




కల వస్తే బాగుండును
డా. బెల్లి యాదయ్య
వెల : 150
ప్రతులకు :శ్రీక్రితి 6-2-330, బిహెండ్ ఎన్.జి.కాలేజ్, శ్రీనగర్ కాలని, నల్గొండ - 508001
ఫోన్ : 9949609280

## చిరునామా

మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/బికె-ఎల్.ఐ.జి.10,
బతుకమ్మకుంట, బాగ్అంబర్‌పేట,
హైదరాబాద్-500013.
చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
editormusi@gmail.com




నా చూపు దేశం వైపు

ఆచార్య మసన చెన్నప్ప
సెల్ నం : 9885654381.




కురుమల సాహిత్యం చరిత్ర సంస్కృతి
డా. మహేందర్ బర్ల
వెల : 280
ప్రతులకు :నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్
హైదరాబాద్ - 500020
ఫోన్ : 9490099437



# శూన్య యాత్ర



డా. ఎన్. గోపి
ఫోన్ : 939 102 8496





ఎన్నాళ్లకో
మీ ఊరికెళ్తున్నాను
దారి పొడుగునా
అప్పుడు మనం మాట్లాడుకున్న
కబుర్లు
గుర్తుకొస్తున్నాయి.
కాని అప్పటి రోడ్లు కావివి.

ప్రయాణాలంటే
నాకెంత ఇష్టమో నీకు తెలుసు
కాని ఇవాళ పక్కన నువ్వులేవు
గంటకో కవిత పుట్టేది
ప్రథమ శ్రోతవు నువ్వే.

తెలిసినవాళ్లు కనపడితే
వికసించిపోయే దానివి
ఇవాళ వారి జాడలేదు
నువ్వూ లేవు.
రెండు పక్కలా
తంగెడుపూలు కనపడితే
'అదిగో నీపూలు' అనే దానివి
ఇప్పుడవి
నీ కుశల మడుగుతున్నాయి.

గుడిసె హోటళ్లదగ్గర ఆగి
చాయ తాగటం ఇష్టం
ఇవాళ వాళ్లు
నన్ను ప్రశ్నార్థకంగా చూస్తున్నారు.

నువ్వు పుట్టిన ఇల్లు
చదివిన స్కూలు
పనిచేసిన కాలేజి
బోసిపోయి కనిపిస్తున్నాయి.
అయ్యో!
కాలచక్రం
వెనక్కి తిరిగితే బాగుండును.
మీ అక్కకు
డెమెన్షియా వచ్చింది
అందుకే కాబోలు
నీ గురించి అడగటం లేదు
అదృష్టవంతురాలు.

ప్రియతమా!
నువ్వు లేకపోవటమంటే
ఏమీ లేకపోవటమని
అర్థమైంది.

❖ ❖ ❖ ❖ ❖


# శిలాక్షరం

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం – సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.




సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి
సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య
వెల : 300/-

సంప్రదించండి.
మూసీ మాసపత్రిక
ఫోన్ : 934 7971177

# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177

Regd No. R.N.37723/80
P.R.No.HSE-824/2023-2025
Date of Publication 1st of Every Month Date of Posting 5th / 6th of Every Month
Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyderabad - 500 001.


# హరిహర త్రిశక్తి క్షేత్రం

నవాలయ ఆవరణం, శ్రీ విద్యాపురం, వలిగొండ, యాదాద్రి జిల్లా.



## ఆలయ నిర్మాణ, నిర్వహణకు సహకరించండి.....

దాతలు తమ సహకారం ఆన్‌లైన్ ద్వారా కూడ అందించవచ్చు.

**State Bank of India, Nallakunta Branch,**

**A/c. No. 62011461764, IFSC Code : SBIN0020083**

**రండి... ఈ ధర్మయజ్ఞంలో అందరం పాలుపంచుకుందాం.**

# వేద సంస్కృతి పరిషత్

వైదిక సాంస్కృతిక ఉద్దీపన పరిశోధనా సంస్థ

సెల్ : 9704227744, 9347971177

Website : www.vsparishath.com, E-mail : vsp613@gmail.com


From :
**The Manager, MUSI Telugu Monthly Magazie**
# 2-2-1109/BK - LIG - 10, Batukammakunta, Bagh Amberpet, Hyderabad- 500 013.
Cell : 9347971177, Email : editormusi@gmail.com

Printed, Published and Owned by : B.Manohari, Printed at Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
Published at H.No.2-2-1109/BK, LIG - 10, Batukammakunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana
Editor : Dr.Sagi Kamalakara Sharma